


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక




Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 17 శనివారం | మే 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 242
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

# సత్తా చాటాం

- భారత్ వ్యూహాత్మక సత్తాను ఆపరేషన్ సిందూర్ చాటింది
- న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో కొత్త మల్టీ-ఏజెన్సీ సెంటర్ను ప్రారంభించిన అమిత్ షా
- దేశ వ్యూహాత్మక్మ వృద్ధి, నిర్వహణ సామర్థ్యాలకు 'ఆపరేషన్ సిందూర్' ఓ ఉదాహరణ
- ప్రధాని మోదీ దృఢ సంకల్పం, కచ్చితమైన, సకాలంలో అందిన ఇంటెలిజెన్స్
- సమాచారం, భారత సాయుధ బలగాల సత్తా కారణాలే విజయానికి కారణం

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** జాతీయ భద్రత, ఇంటెలిజెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పటిష్టతకు భారత ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో కొత్త మల్టీ-ఏజెన్సీ సెంటర్‌ను శుక్రవారం నాడు అమిత్ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యూహాత్మక్మ వృద్ధి, నిర్వహణ సామర్థ్యాలకు 'ఆపరేషన్ సిందూర్' ఒక ఉదాహరణని చెప్పారు. ఈ ఆపరేషన్ విజయవంతానికి ప్రధానమంత్రి మోదీ దృఢ సంకల్పం, కచ్చితమైన, సకాలంలో అందిన ఇంటెలిజెన్స్ సమాచారం, భారత సాయుధ బలగాల సత్తా కారణాలని ప్రశంసించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ఆధ్వర్యంలో కొత్తగా ప్రారంభించిన మల్టీ ఏజెన్సీ సెంటర్ (ఎంఏసీ) పనిచేస్తుంది. దేశవ్యాపంగా ఉన్న వివిధ భద్రతా సంస్థలు, నిఘా ఏజెన్సీల మధ్య సమాచార మార్పిడి, సమన్వయానికి ఎంఏసీ కృషి చేస్తుంది. అంతర్గత, బహిర్గత ముప్పును అంచనా వేసి, ఆ ముప్పును నివారించేందుకు అవసరమైన రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్, సత్వర స్పందన మెకానిజం, ఇంటర్-ఏజెన్సీ సినర్జీ మెరుగుపరిచేందుకు ఈ వ్యవస్థ ఎంతో ఉపకరిస్తుందని అంచనా వేస్తున్నారు.

**'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'లో గాయపడిన వారి పరామర్శ..**

దీనికి ముందు, ఇటీవల ముగిసిన నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్.. 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'లో గాయపడిన ఐదుగురు భద్రతా సిబ్బందిని అమిత్‌షా పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స, క్షేమ సమాచారాన్ని

# పొంచివున్న తుఫాన్

- బంగాళాఖాతంలో పొంచి ఉన్న శక్తి తుపాను
- ఏపీకి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వెల్లడి
- బంగాళాఖాతాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు
- 27 నాటికే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం
- ఏపీలో వచ్చే 48 గంటల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు

2



**నెల్లూరు-నవభూమిబ్యూరో:** నైరుతి రుతుపవనాలు ఇప్పటికే బంగాళాఖాతాన్ని తాకాయి. బంగాళాఖాతం దక్షిణ ప్రాంతం, అండమాన్ నికోబార్ దీవులకు సమీపించాయి. అండమాన్ ఉత్తర సముద్రంలో ప్రవేశించాయని, అవి మరింత చురుగ్గా విస్తరించడానికి అనుకూల వాతావరణం ఉందని అటు భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇంకొద్ది రోజుల్లో అరేబియా, బంగాళాఖాతం దక్షిణ ప్రాంతాలు అండమాన్- నికోబార్ అంతటా రుతుపవనాలు విస్తరించనున్నాయి. క్రమంగా- జూన్ 1వ తేదీ కంటే ముందే అంటే.. మే 27 నాటికే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని వివరించింది. దీని ప్రభావంతో ఏపీలో వచ్చే 48 గంటల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తు నిర్వహణ విభాగం తెలిపింది. ఏజెన్సీ, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో బుధవారం అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కడప, శ్రీసత్యసాయి పుట్టపర్తి, అన్నమయ్య రాయచోటి జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. దీనికి అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతున్నాయి. పలు జిల్లాలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. అమరావతి గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. రాయలసీమలోని శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తాలు కురిశాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో- 54 మిల్లీ మీటర్ల మేర వర్షపాతం నమోదైంది. ఏలూరు జిల్లా

# ఇక నెలనెలా నిరుద్యోగ లెక్కలు

- మనదేశ ఆర్థిక వ్యవస్థలో మరింత పారదర్శకతను తీసుకురావడానికి కేంద్రం ఒక సంచలన నిర్ణయం
- త్రైమాసికంగా మాత్రమే విడుదల చేసే నిరుద్యోగ గణాంకాలను ఇకపై నెలనెలా
- మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రొగ్రాం ఇంప్లిమెంటేషన్ మొట్టమొదటి నెలవారీ నిరుద్యోగ డేటాను రిలీజ్
- దేశంలోని శ్రామిక మార్కెట్ తాజా పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఉపయోగం
- ఏప్రిల్ 2025 నాటికి భారతదేశంలో నిరుద్యోగిత రేటు 5.1శాతంగా నమోదు

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** మనదేశ ఆర్థిక వ్యవస్థలో మరింత పారదర్శకతను తీసుకురావడానికి భారత ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వార్షికంగా లేదా త్రైమాసికంగా మాత్రమే విడుదల చేసే నిరుద్యోగ గణాంకాలను ఇకపై నెలనెలా ప్రకటించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రొగ్రాం ఇంప్లిమెంటేషన్ మొట్టమొదటి నెలవారీ నిరుద్యోగ డేటాను రిలీజ్ చేసింది. దీని ద్వారా దేశంలోని శ్రామిక మార్కెట్ తాజా పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ తాజా గణాంకాల ప్రకారం ఏప్రిల్ 2025 నాటికి భారతదేశంలో నిరుద్యోగిత రేటు 5.1శాతంగా నమోదైంది. ఈ సంఖ్య ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారత దేశం అంత క్లిష్ట పరిస్థితుల్లో అయితే లేదు. అదే నెలలో యునైటెడ్ స్టేట్స్ నిరుద్యోగిత రేటు 4.2శాతంగా ఉంది. ఇది భారతదేశానికి సాపేక్షంగా దగ్గరగా ఉంది. అయితే, యునైటెడ్ కింగ్‌డమ్‌లో నిరుద్యోగిత రేటు 2021 తర్వాత అత్యధికంగా 4.5శాతానికి పెరిగింది. మరోవైపు, పాకిస్తాన్ అంచనా నిరుద్యోగిత రేటు 7.5శాతానికి చేరుకుంది. ఇది ఆందోళనకరమైన విషయం. భారతదేశం నెలవారీ నివేదికల వైపు అడుగు వేయడాన్ని నిపుణులు ఒక కీలకమైన పురోగతిగా అభివర్ణిస్తున్నారు. క్రమం తప్పకుండా వచ్చే ఈ అప్‌డేట్స్ దేశీయ విధాన రూపకల్పనను మెరుగుపరచడమే కాకుండా, ప్రపంచ ఆర్థిక అంచనాలలో భారతదేశ విశ్వసనీయతను కూడా పెంచుతాయి. స్థిరమైన డేటాతో దేశం ఉద్యోగ సంబంధిత సవాళ్లను త్వరగా పరిష్కరించడానికి అవకాశం లభిస్తుంది. ఈ కొత్త విధానం ఆర్థిక విశ్లేషకులకు, పరిశోధకులకు మరింత సమగ్రమైన సమాచారాన్ని అందిస్తుంది.

# లోకేశ్‌కు పదోన్నతి?



- మంత్రి లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవా..లేక పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవా?
- లోకేశ్‌కు కీలక పదవి ఇచ్చేందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిర్ణయం
- ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ ఖరారు కావడంతో నేడు ఢిల్లీకి లోకేశ్
- ప్రధాని మోదీ ఆశీస్సులు పొందేందుకే ఢిల్లీకి వెళ్తున్నట్లుగా ప్రచారం

2

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీలో కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమిలో 3 పార్టీలు కలిసి ఉంటూనే సొంతంగా బలం పెంచుకోవటం పైన ఫోకస్ చేస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తి కానుంది. ఈ సమయంలో పాలనా - పార్టీ పరంగా నిర్ణయాల వేగం పెంచాలని సీఎం చంద్రబాబు డిసైడ్ అయ్యారు. ఇదే సమయంలో పార్టీ మహానాడుకు సిద్దం అవుతున్నారు. ఈ సమయంలోనే లోకేష్‌కు ప్రమోషన్ అంశం తెర మీదకు వచ్చింది. లోకేష్ ఢిల్లీకి వెళ్తున్నారు. ప్రధాని మోదీతో సమావేశం కానున్నారు. దీంతో.. ఈ పరిణామాలు మరింత ఆసక్తిగా మారాయి. ప్రధాని తో భేటీ ఏపీ మంత్రి నారా లోకేష్ శనివారం ఢిల్లీ వెళ్లనున్నారు. అనంతపురం జిల్లా పర్యటనలో ఉన్న లోకేష్ కు ప్రధాని అప్పాయింట్ మెంట్ ఖరారైనట్లు సమాచారం రావటంతో వెంటనే హైదరాబాద్ చేరుకుంటున్నారు. రేపు కుటుంబ సభ్యులతో కలిసి ఢిల్లీ వెళ్లనున్నారు. ఏపీ పర్యటన కు వచ్చిన సమయంలో ప్రధాని మోదీ తనను కలవాల్సిందిగా లోకేష్‌కు సూచించారు. తాజాగా ఆపరేషన్ సింధూర్ తరువాత లోకేష్ అప్పాయింట్ మెంట్ కోరారు. కాగా, రేపు ఈ మేరకు లోకేష్ కు అప్పాయింట్ మెంట్ ఖరారైంది. ఈ పర్యటన సమయంలో ఆపరేషన్ సింధూర్ తరువాత ప్రజల మూడ్.. ఎన్డీఏ పాలన.. ఏపీలో ఏడాది కూటమి పాలన గురించి చర్చిం చే అవకాశం ఉంది. అదే విధంగా ఆపరేషన్ సింధూర్ పైన ప్రధానికి ఏపీ తరపున అభినందనలు తెలపనున్నారు. లోకేష్ కు ప్రమోషన్ లోకేష్ కు పార్టీలో - ప్రభుత్వంలో ప్రమోషన్ గురించి చర్చ జరుగుతోంది. కొద్ది నెలల క్రితం పవన్

# ఫైళ్ల క్లియరెన్స్‌కు మంత్రులకు డబ్బులు

- వివాదంలో చిక్కుకున్న మంత్రి కొండా సురేఖ
- వరంగల్‌లో ఓ కార్యక్రమంలో మంత్రి అనుచిత వ్యాఖ్యలు
- దుమారం రేపిన మంత్రి సురేఖ వ్యాఖ్యలు..
- పార్టీలోనే వ్యతిరేకరావడంతో మాట మార్చిన మంత్రి
- గత సర్కార్‌లో బీఆర్ఎస్ మంత్రులు తీసుకున్నారని వ్యాఖ్య



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ మంత్రి కొండా సురేఖ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు.. ఏ ఉద్దేశంలో అన్నారో కానీ, ఆమె చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. గతంలో ఓ సినీ నటుడి కుటుంబాన్ని ఉద్దేశించి సురేఖ చేసిన వ్యాఖ్యలు ఆమె మంత్రి పదవికే గండం తెచ్చేంత పనిచేశాయి. అవి సద్దుమణిగాయో లేదో.. వేములవాడ దేవస్థాన గోశాల వివాదం తెరపైకి వచ్చింది. ఇప్పుడు తాజాగా 'మంత్రులను' ఉద్దేశించి సురేఖ అన్నట్లుగా ఉన్న వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. ఇంతకూ ఆమె ఏమన్నారంటే.. వరంగల్ లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ మాట్లాడుతూ తమ వద్దకు వచ్చే కంపెనీల ఫైళ్ల క్లియరెన్స్‌కు సహజంగా మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారని, తాను మాత్రం సమాజ సేవ చేయాలని సూచించానని పేర్కొన్నారు. "వరంగల్ క్రిష్ణ కాలనీ బాలికల జూనియర్ కళాశాల భవనాలు వర్షాకాలం జలమయం అవుతున్నాయి. కొత్త భవనం కట్టాలంటే రూ.4.5 కోట్లు అవుతాయి. ఇంతమొత్తం ఎక్కడినుంచి తేవాలో నాకు అర్థంకాలేదు. నేను అటవీ శాఖ మంత్రిగా ఉన్నందున నావద్దకు కొన్ని ఫైళ్లు వస్తాయి. ఇలాంటివాటిని మంత్రులు డబ్బులు తీసుకుని క్లియర్ చేస్తారు. నేను మాత్రం స్కూల్‌ను డెవలప్ చేయమని చెప్పా. పేరు చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నా. దీంతో అరబిందో సంస్థ వారు ముందు కొచ్చి రూ.4.5 కోట్లతో కాలేజీ భవనం కట్టించారు" అని సురేఖ వ్యాఖ్యానించారు. సురేఖ వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. మంత్రులు ఫైళ్ల క్లియరెన్స్ కు లంచాలు తీసుకుంటారనే అభిప్రాయం వెళ్లడంతో ఆమె స్పందించారు. తాను మాట్లాడింది బీఆర్ఎస్ ప్రభుత్వం నాటి మంత్రుల గురించి అని సర్దిచెప్పుకొంటూ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని, అలా తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. ఏ పనికైనా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని అన్నానని తెలిపారు. ప్రస్తుతం ఆ వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని కొండా సురేఖ తెలిపారు.

# ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని

- తెలుగుదేశ ప్రభుత్వ విధానమిదే..మంత్రి లోకేశ్
- రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా
- అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నాం
- ఉద్యోగం, ఉపాధి కల్పనలే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధికి కీలకమైన పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం




**అమరావతి-నవభూమిబ్యూరో:** ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని అనేది తమ విధానమని మంత్రి నారా లోకేష్ తేల్చి చెప్పారు. అయితే.. రాష్ట్రం లోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని తెలిపారు. ఈ క్రమంలో అభివృద్ధిని వికేంద్రీకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ అభివృద్ధికి కీలకమైన పెట్టుబడులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఉద్యోగం, ఉపాధి కల్పనలే లక్ష్యంగా పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని లోకేష్ తెలిపారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్‌కు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో కలసి నారా లోకేష్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ... గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఈ సోలార్ ప్రాజెక్టుకు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రైతులను ప్రోత్సాహిస్తు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో భారత దేశంలోనే అతి పెద్ద ప్రాజెక్టుగా ఇది నిలుస్తుందన్నారు. దీనివల్ల వేలాది మందికి ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. తమది మాటల ప్రభుత్వం కాదన్న నారా లోకేష్ వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేస్తున్న ట్టు చెప్పారు. కొందరు(వైసీపీపె పరోక్షంగా) చేస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. సూపర్ సిక్స్‌ను కూడా సమర్ధవంతంగా అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళిక రూపొందించారని తెలిపారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేసిందని.. అమరావతిని అప్పట్లోనే అభివృద్ధి చేసి ఉంటే.. ఇప్పుడు ప్రపంచ స్థాయి నగరంగా ఉండేదని తెలిపారు. ఇప్పుడు అమరావతిని ఒక కొలిక్కి తీసుకువచ్చామని.. అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు.. ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందిస్తున్నాయని చెప్పారు. వచ్చే నెలలో తల్లికి వందనం అమలు చేస్తామని.. చదువుకునే పిల్లలు ఎంత మంది ఉన్నా.. రూ.15000 చొప్పున అందిస్తామని ఈ విషయంలో ఎలాంటి సందేహం అవసరం లేదని చెప్పారు.

# ముగ్గురు ప్రియుళ్ల సాయంతో భర్తను 6 ముక్కలుగా నరికిన భార్య

- బల్లియాలో 62 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగి దారుణ హత్య
- భార్య, ఆమె ముగ్గురు ప్రియులే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు నిర్ధారణ
- మృతదేహాన్ని 6 ముక్కలు చేసి వివిధ ప్రాంతాల్లో పడేసిన వైనం
- భార్య సహా నలుగురు నిందితుల అరెస్ట్, ఒకరిపై కాల్పులు

2





**సికందర్‌పూర్-నవభూమి బ్యూరో**


ఉత్తరప్రదేశ్‌లోని బల్లియాలో సభ్యసమాజం తలదించుకునే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కట్టుకున్న భార్యే తన ముగ్గురు ప్రియులతో కలిసి భర్తను అత్యంత కిరాతకంగా హత్య చేసింది. అనంతరం మృతదేహాన్ని ఆరు ముక్కలుగా నరికి, వివిధ ప్రాంతాల్లో పడేసి నేరాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేసింది. ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసి రిటైర్ అయిన 62 ఏళ్ల దేవేంద్ర రామ్‌ను ఆయన భార్య మాయ (55), ఆమె ప్రియులు మిథిలేష్ పటేల్, అనిల్ యాదవ్, సతీష్ యాదవ్‌లు (అందరూ

# వల్లభనేని వంశీపై మరో కేసు

- అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని మైనింగ్ ఏడీ ఫిర్యాదు
- గన్నవరం పోలీస్ స్టేషన్‌లో వంశీపై కేసు నమోదు
- రూ. 100 కోట్లపైన అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదు

2

**అమరావతి-నవభూమిబ్యూరో:** వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై మరో కేసు నమోదైంది. గన్నవరం నియోజకవర్గంలో జరిగిన మైనింగ్ అక్రమాలపై గనుల శాఖ ఏడీ గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన అక్రమ తవ్వకాలపై నివేదికను పోలీసులకు సమర్పించారు.



# ఇద్దరు 'కీ'లక నేతల అరెస్ట్

- లిక్కర్ స్కాంలో జగన్ కోటరీలో రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయరెడ్డి, మాజీ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్
- ముందస్తు బెయిల్ కోసం వీరిద్దరూ పెట్టుకున్న పిటిషన్ తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- పదిగంటల సేపు వీరిద్దరిని విచారించిన సిట్

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** లిక్కర్ స్కాంలో కీలక నిందితులు రిటైర్డ్ ఐఏఎస్ ధనుంజయ రెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ కోసం వారు పెట్టుకున్న పిటిషన్ ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ దశలో కల్పించుకుని నిందితులకు బెయిల్ ఇస్తే కేసు దర్యాప్తుపై ప్రభావం చూపుతుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. హైకోర్టులో ముందస్తు బెయిల్ కు నిరాకరించడంతో నిందితులు ఇద్దరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అక్కడ ప్రతికూల తీర్పు రావడంతో సిట్ తీసుకుబోయే చర్యలు ఆసక్తి రేపుతున్నాయి.

ఏపీ లిక్కర్ స్కాం విచారణలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. లిక్కర్ స్కాం లో వైసీపీ ముఖ్య నేతలకు ఉచ్చు బిగుస్తోంది. ఇప్పటికే సిట్ పలువురిని అరెస్ట్ చేసి విచారణ కొనసాగి స్తోంది. ఎంపీ మిథున్ రెడ్డితో సహా పలువురిని ఇందులో విచారణ చేసింది. కాగా, జగన్ కోటరీలో కీలకంగా పని చేసిన ఇద్దరిని సిట్ విచారిస్తోంది. ఈ ఇద్దరు ముందస్తు బెయిల్ కోసం సుప్రీంను ఆశ్రయించారు. కాగా, వారి ముందస్తు బెయిల్ పిటీషన్ ను సుప్రీం తోసిపుచ్చింది. దీంతో, ఇక ఈ ఇద్దరి విషయంలో సిట్ నిర్ణయం పైన ఉత్కంఠ కొనసాగుతోంది. సుప్రీం తిరస్కరణ ఏపీ లిక్కర్ కేసులో నిందితులుగా ఉన్న కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డికు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం లిక్కర్ కేసు దర్ యాప్తు కొనసాగుతున్నందువల్ల ముందస్తు బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. కాగా కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డిలకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు గతంలో హైకోర్టు నిరాక రించింది. దీంతో వారు


# మూడేళ్ల రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ఫుల్ స్టాప్?

**మాస్కో-నవభూమిబ్యూరో**
రష్యా-ఉక్రెయిన్ మధ్య సంవత్సరాల తరబడి హెూరాహెూరీగా యుద్ధం కొనసాగుతోంది. 2022 ఫిబ్రవరి 24వ తేదీన ఆరంభమైన ఈ యుద్ధానికి అంతం అనేది ఉండట్లేదు. ఇన్ని రోజులుగా నిరాటంకంగా ఈ రెండు దేశాలు తలపడుతూనే వస్తోన్నాయి. నువ్వా-నేనా అన్నట్లు సాగుతున్న ఈ పోరులో ఉక్రెయిన్‌లోని పలు నగరాలు ధ్వంసం అయ్యాయి. ఈ యుద్ధంలో వేలాదిమంది ప్రాణాలు




కోల్పోయారు. భారీ స్థాయిలో ఆస్తినష్టం సంభవించింది. అయినప్పటికీ ఏ దేశం కూడా వెనక్కి తగ్గట్లేదు. ఇప్పటికే ఉక్రెయిన్ తూర్పు ప్రాంతంలోని పలు నగరాలు నేలమట్టం అయ్యాయి. వాటిన్నింటినీ రష్యా సైనిక బలగాలు తమ ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. మరియోపోల్, మెలిటొపోల్, క్రిమియా, డాన్‌బాస్, డొనెట్స్క్, లుహాన్స్క్, ఖేర్సన్, సుమి, ఒడెస్సా, చెర్నీహివ్.. వంటి నగరాలను రష్యా సైనిక బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. పాశ్చాత్య దేశాల నుంచి ఎదురవుతోన్న ఒత్తిళ్లు, ఆంక్షలు, పలు రకాల నిషేధాలను కూడా రష్యా ధీటుగా ఎదుర్కొంటోంది. రష్యా సైన్యానికి అంత తేలిగ్గా తలవంచట్లేదు ఉక్రెయిన్. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, ఆస్ట్రేలియా సహా యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు అందిస్తోన్న అత్యాధునిక ఆయుధాలు, యుద్ధ సామాగ్రితో రష్యా దూకుడుకు అడ్డుకట్ట వేయగలుగుతోంది. రష్యా ఆధీనంలో ఉన్న కొన్ని కీలక నగరాలను సైతం విడిపించుకోగలిగింది.

## నవ వార్త




## ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రాప్.. అక్కను ప్రేమించాడు.. చెల్లెలు కావాలన్నాడు



**మేడ్చల్-నవభూమి** ప్రేమ పేరుతో చాలా మంది ఆడపిల్లలు మోసపోతూనే ఉన్నారు. సోషల్ మీడియాలో పరిచయాలు ప్రేమకు దారి తీస్తున్నాయి. కానీ ఆ ప్రేమ ఎంతో కాలం నిలబడని పరిస్థితి. ప్రేమిస్తున్నానంటూ యువతుల ను మోసం చేస్తున్నారు. అంతేకాకుండా వారితో అత్యంత సన్నిహితంగా దిగిన ఫోటోలు, వీడియోలతో బ్లాక్ మెయిల్‌కు కూడా పాల్పడుతున్నారు. ఈ ఊబిలో నుంచి బయటపడే మార్గం లేక కొందరు యువతులు ప్రాణాలు తీసుకుంటున్నారు. ఘట్‌కేసర్‌లో ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. మైనర్‌ను ట్రాప్ చేసిన ఓ యువకుడు.. ఆమెను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి భారీగా బంగారం వసూలు చేశాడు. ఇంతటితో ఆగకుండా అతడు చేసిన మరో పనితో ఆ మైనర్ బలవన్మరణానికి యత్నించింది. ఇంతకీ ఏం జరిగిందో ఇప్పుడు చూద్దాం.ఘట్‌కేసర్‌లో దారుణం జరిగింది. ప్రేమ పేరుతో మైనర్‌ను ఓ యువకుడు ట్రాప్ చేశాడు. అతడి వేధింపులు తాళలేక బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔషాపూర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. అవినాష్ రెడ్డి అనే యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ మైనర్‌తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమకు దారి తీసింది. ఈ క్రమంలో ఇద్దరు కలుసుకుని ఫోటోలు, వీడియోలు తీసుకున్నారు. ఆ తరువాత అవినాష్ రెడ్డి అసలు రూపం బయటపడింది. అక్కతో ప్రేమాయణం నడిపిన అతడి కన్ను చెల్లెలిపై పడింది. తనతో దిగిన ఫోటోలు, వీడియోలు చూపించి ప్రియురాలిని బెదిరించాడు. ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు తీసుకుని వస్తే ఫోటోలు, వీడియోలు డిలీట్ చేస్తానని నమ్మబలికాడు. దీంతో చేసేదేమీ లేక తప్పనిసరి పరిస్థితుల్లో ఇంట్లో నుంచి రహస్యంగా బంగారు ఆభరణాలు తీసుకుని అవినాష్ రెడ్డికి ఇచ్చింది. ఆ తరువాత ఫోటోలు, వీడియోలు డిలీట్ చేయమని కోరింది.

## పట్టాలు దాటుతుండగా ఊహించని ఘటన

**రంగారెడ్డి-నవభూమి** అదృష్టం కలిసి వస్తే ఎంత పెద్ద ప్రమాదం నుంచి అయినా తప్పించుకుంటారు కొందరు. లేకపోతే చిన్న ప్రమాదాలకే ప్రాణాలు కోల్పోతుంటారు. పెద్ద పెద్ద ఆక్సిడెంట్‌ల నుంచి ఎలాంటి దెబ్బలు తగలకుండా కొంతమంది ప్రాణాలతో బయటపడతారు. వీరిని చూసే అంటారేమో వీళ్లకు భూమి మీద ఇంకా నూకలు ఉన్నట్టున్నాయి అని. ఇలాంటి ఘటనే రంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. ఓ కార్మికుడు తన పనిని ముగించుకుని ఇంటి బాట పట్టాడు. ఈ క్రమంలో అతడు రైలు పట్టాలు దాటాల్సి వచ్చింది. కానీ ఇంతలోనే ఊహించని ఘటన చోటు చేసుకుంది. అసలేం జరిగిందో ఇప్పుడు చూద్దాం.రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్ రైల్వే స్టేషన్‌లో ఓ కార్మికుడు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. కంపెనీలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాలు దాటుతున్నాడు. అయితే అక్కడున్న గూడ్స్ ట్రైన్ అకస్మాత్తుగా ముందుకు కదలడంతో ఆ కార్మికుడు రైలు పట్టాలపై పడుకున్నాడు. గూడ్స్ ట్రైన్ వెళ్లిపోయిన తర్వాత ప్రాణాలతో బయటపడ్డాడు.నిన్న (గురువారం) సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. తిమ్మాపూర్ ఒక పారిశ్రామిక వాడ. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ చుట్టూ అనేక పరిశ్రమలు ఉంటాయి. ఒక సైడ్ రెసిడెన్షియల్ క్వాటర్స్ ఉండగా, మరో పక్క పరిశ్రమలు ఉంటాయి. తరచుగా అటూ ఇటూ వెళ్లేవాళ్లంతా ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్‌ను ఉపయోగించకుండా కింద నుంచే వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో బీహార్‌కు చెందిన ఓ కార్మికుడు ఆగి ఉన్న గూడ్స్ రైలు ముందు నుంచి వెళ్తున్నాడు. అయితే అకస్మాత్తుగా గూడ్స్ రైలు కదిలింది. ఈ సమయంలో ఏం చేయాలో తెలియక ఓ క్షణం భయాందోళనకు గురయ్యాడు. మళ్లీ అంతలోనే ప్రాణాలు దక్కించుకునేందుకు ట్రాక్ మధ్యలో పడుకుండిపోయాడు. మొత్తం గూడ్స్ రైలు వెళ్లిన తర్వాతే సదరు కార్మికుడు లేవడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. ఇలాంటి ఘటనలు రెండు మూడు చోటు చేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనను అక్కడున్న కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది కాస్తా వైరల్‌గా మారింది. ఈ వీడియోను చూసి నెటిజన్లు కూడా తమదైన శైలిలో స్పందిస్తున్నారు. పెద్ద ప్రమాదం నుంచే తప్పించుకున్నాడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

## కాసుల కోసం దిగజారిన ఆర్టీసీ సిబ్బంది.. విషయం ఇదీ

**వికారాబాద్ నవభూమి** జిల్లాలోని పరిగి ఆర్టీసీ బస్ డిపోలో వాహనాల ఇంజన్ నంబర్ల ట్యాంపరింగ్ కలకలం రేపింది. సీజ్ చేసి సెక్యూరిటీ కోసం ఉంచిన వాహనాల ఇంజన్ నంబర్లు, చేసిస్ నంబర్లు మార్చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆర్టీసీ సిబ్బంది కాసుల కక్కుర్తి... ఆర్టీసీ ప్రతిష్టను దిగజార్చేలా చేసింది. గత సంవత్సరం అక్టోబర్‌లో వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేవని ఓ బోరుబండిని పోలీసులు సీజ్ చేశారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా విచారణ చేసి వాహన యజమానిపై కేసు నమోదు చేశారు. వాస్తవానికి ఈ బోరుబండిని అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారంటూ గతంలోనే సీజ్ చేశారు పోలీసులు.ఈ నేపథ్యంలో సెక్యూరిటీ కోసం బోరుబండిని పరిగి బస్ డిపోలో ఉంచారు పోలీసులు. ఈ క్రమంలో సదరు బోరుబండి యజమాని తన వాహనాన్ని రిలీజ్ చేయించేందుకు అనేక తప్పులు చేయించాడు. డిపోలో ఉన్న వాహనం పేరిట మరో రిజిస్ట్రేషన్‌తో సర్టిఫికెట్ సృష్టించి అన్ని పత్రాలు ఉన్నాయంటూ కోర్టును తప్పుదోవ పట్టించాడు. ఆర్టీసీ సిబ్బందికి కాసుల ఆశ చూపి గుట్టు చప్పుడు కాకుండా వాహన ఇంజన్ నంబర్, చేసిస్ నంబర్‌ను యాజమాని మార్చేశాడు. నకిలీపత్రాలు నిజమని భావించిన కోర్టు.. రిలీజింగ్ ఆర్డర్ ఇచ్చింది. రిలీజింగ్ ఆర్డర్‌ను పరిగి పోలీసులకు పంపించాడు బోరుబండి యజమాని. అయితే వాటిని పరిశీలించిన పోలీసులు.. అవి నకిలీవని తేల్చారు.బోరు వాహనం నెంబర్లు మార్చారని పోలీసులకు తెలిసి ఆర్టీసీ సిబ్బంది, అధికారులను విచారణ చేసినప్పటికీ టాంపరింగ్ వ్యవహారం బయటకు రాకుండా జాగ్రత్త వహించారు. వాహనం నెంబర్ టాంపరింగ్ వ్యవహారంలో ఆర్టీసీ డిపో మేనేజర్ విషయాన్ని దాటవేసేందుకు యత్నించారు. అసలు బోరు బండి తమ డిపోలో పెట్టినట్టు రికార్డులో లేదని, పోలీసుల అంతర్గత ఒప్పందంతో మాత్రమే డిపోలో పెట్టుకున్నామన్నారు. టాంపరింగ్ వ్యవహారంతో తమకు సంబంధం లేదని డిపో మేనేజర్ తెలిపారు.
టాంపరింగ్ వ్యవహారం ఆర్టీసీ ఉన్నతాధికారులకు, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు చేరింది. దీనిపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎలా స్పందిస్తారో, అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# ప్రపంచ సుందరాంగుల మనసు దోచుకున్న భూదాన్ పోచంపల్లి



**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి మే 16:** ప్రపంచ సిల్క్ సిటీగా, సాంస్కృతిక వారసత్వం, ఇక్కత్ చీరల నేతకు ప్రసిద్ధి గాంచిన భూదాన్ పోచంపల్లి అంతర్జాతీయ సుందరీమణుల మన్ననలు పొందింది.ఆఫ్రికా ఖండం నుంచి వచ్చిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు భూదాన్ పోచారం పల్లి గ్రామాన్ని సందర్శించి, పోచంపల్లి చీరల తయారీ,డిజైన్,అద్దకం ఇక్కత్ వస్త్రాలను చూసి అబ్బురపడ్డారు. అంతేకాక రుంజా వాయిద్యం,సంస్కృతి, సాంప్రదాయ నాదస్వర ,కోలాటాల స్వాగతంతో మైమరచిపోయారు . సిందూరం, సంగీతం, చేతినేతల మధ్య కళాత్మకమైన ఈ సందర్శనం అతిథుల హృదయాలను రంజింపజేసింది. గ్రామ చేనేత పార్క్ ప్రవేశద్వారం వద్దే స్థానికులు సంప్రదాయ వస్త్రాలతో కంటెస్టెంట్లకు స్వాగతం పలికారు. సిందూరం నుదుట దిద్ది, పువ్వుల మాలలు అందిస్తూ “పోచంపల్లికి హృదయపూర్వక స్వాగతం” అంటూ అందగత్తెలకు హృదయాలను హత్తుకునేలా ఆత్మీయ స్వాగతం పలికారు. పోచంపల్లి చేనేత టూరిజం పార్క్ ప్రవేశ దారం వద్ద ఫోటోలకు ఫోజులిస్తూ“ తెలంగాణ జరూర్ అనా” అంటూ నినదించారు.ఇక్కత్ చీరల తయారీని చూసి వీరు అబ్బురపడ్డారు. ప్రత్యేకమైన ఇక్కత్ చీరల తయారీ విధానాన్ని స్థానిక పార్కులోపరిశీలించిన అతిథులు, నూలు వడకడం నుంచి రంగులు చొప్పించే క్లిష్టమైన ప్రక్రియలను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. “ఒక్క చీరకు వారాలు తీసుకునే శ్రమ, డిజైన్ల సృజనాత్మకత కంటెస్టెంట్ లను మనస్సును హత్తుకుంది. చీరలపై భిన్న డిజైన్లను గమనించిన అతిథులు, కొందరు స్వయంగా రాట్నంతో నూలు వడికే ప్రయత్నం చేశారు.అంతేకాక చీరలను పట్టుకొని చూసి పరవసించారు.చేనేత టూరిజం పార్కు లో స్థానిక కళాకారులు ప్రదర్శించిన రుంజా కిన్నెర,వాయిద్యాల మధుర సంగీతం అందగత్తెలను మంత్రముగ్ధుల్ని చేసింది. కొందరు కంటెస్టెంట్ లు స్వయంగా రుంజా వాయించగా, మరికొందరు సంగీతానికి లయబద్ధంగా నాట్యం చేశారు. చేనేత పార్కులో ఏర్పాటు చేసిన మెహిందీ స్టాల్ వద్ద చేతులకు మెహందీ వేయించుకొన్నారు.సందర్శన కంటస్టెంట్ లు స్థానిక కళాకారుల నుంచి మెహందీ టాటూలు వేయించుకున్నారు. అరి చేతులపై నెమలి సోయగం, నాజూకైన నక్షత్రాలు, పువ్వుల డిజైన్లతో మురిసిపోయిన బ్యూటీలు ఫోటో సెషన్లకు పోజ్ ఇచ్చారు. రాట్నం తో నూలు వడికే విధానం ను సుందరీమణులు పరిశీలించారు.కొంత మంది స్వయంగా రాట్నం ఒడికి మురిసిపోయారు. పోచంపల్లి చేనేతగ్రామీణ పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన పోచంపల్లి, వెంకటగిరి ,గొల్లభామ, నారాయణపేట, వస్త్రాల ప్రదర్శన ను సందర్శించారు.చివరగా యాంపి థియేటర్లో భూదాన్ పోచంపల్లి ప్రస్థానం, హ్యాండ్లూమ్‌పై ప్రత్యేక వీడియోను మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లకు ప్రదర్శించారు. జిల్లా యంత్రాంగం ప్రతి క్షణాన్ని అందగత్తెలు ఆస్వాదించేలా చక్కని ఏర్పాట్లు చేసింది.మిస్ వరల్డ్ కంటెస్టెంట్ ల రూరల్ టూర్ నిర్వహించడంలో ప్రభుత్వ ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న యాదాద్రి భువనగిరి జిల్లా యంత్రాగం స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారం, సమన్వయంతో జిల్లా కలెక్టర్ ఎం హనుమంత రావు నేతృత్వంలో పోచంపల్లి గ్రామ చేనేత పార్కులోఅందాల భామల కోసం చక్కని ఏర్పాట్లు చేశారు.చేనేత పార్క్ కు ప్రపంచానికి పరిచయం చేసేలా వరల్డ్ టూరిజం లో ప్రత్యేక గుర్తింపు దక్కేలా చక్కగా ప్రమోట్ చేశారు.3 గంటలకు పైగా సాగిన కార్యక్రమంలో స్థానిక కళాకారులు వాయిద్యాలు, మెహందీ, చేనేత వస్త్రాల ప్రాధాన్యం, తయారీ, ఇక్కత్ చీరల ప్రత్యేక గుర్తింపును తెలియజేస్తూ స్థానిక సంస్కృతితో కంటెస్టెంట్ లను పూర్తిగా మమేకం అయ్యేలా చేశారు. ప్రతి క్షణాన్ని అందగత్తెలు ఆస్వాదించేలా కార్యక్రమాలను ప్లాన్ చేసారు.చివరలో అందగత్తెలకే అసూయపుట్టేలా నిర్వహించిన ఫ్యాషన్ షో పోచంపల్లి సందర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ప్రపంచ అందగత్తెలే అచ్చెరువు పొందేలా అసూయ పుట్టేలా భారతీయ నారిమణుల ఇక్కత్ చీరల ఫ్యాషన్ షో అద్భుతం గా సాగింది.సంప్రదాయం ఉట్టిపడేలా ధరించిన చేనేత, ఇక్కత్ వస్త్రాలతో ఆత్మవిశ్వాసం నింపుకున్న యువతులు యాంపి థియేటర్ వేదికగా జోష్ నింపారు.షో జరుగుతున్నంత సేపు ప్రపంచ అందగత్తెలు కళ్లార్పకుండా చూస్తూ చప్పట్లు, కేరింతలతో ప్రోత్సహించారు. షో చివరలో ఫ్యాషన్ షో లో పాల్గొన్న యువతులను మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లు కలసి అభినందించారు. స్థానికులు ఈ షో ను ఆసక్తిగా తిలకించారు. ఈ ఫ్యాషన్ షో స్థానికులకే కాదు.. అందగత్తెలకు సరికొత్త అనుభూతి మిగిల్చింది.యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ పోచంపల్లి ఇక్కత్ చీరల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఇక్కత్ అనేది ఒక బ్రాండ్ నూలు ఉడకబెట్టడం,వడకడం,రంగుల అద్దకం వంటి టెక్నాలజీ ఎక్కడ లేనివిధంగా పోచంపల్లి లోనే ఉంటుందని తెలిపారు .పోచంపల్లి చేనేత చీరలు పూర్తిగా చేతితో మగ్గంపై ఎన్నో సంవత్సరాల నుండి చేస్తున్న సంప్రదాయ కల అని, ఎంతో మంది మహిళలు ఇక్కత్ చీరల ద్వారా జీవనం పొందుతున్నారని తెలిపారు.పోచంపల్లి చీరల డిజైన్ కూడా ఒక ప్రత్యేకత సంతరించుకుందని, భూదానోద్యమంతో భూదాన్ పోచంపల్లి ప్రసిద్ధి పొందగా, పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు ఎంతో గుర్తింపు పొందాయని ,2021లో ఉత్తమ పర్యాటక గ్రామంగా ప్రపంచ ఖ్యాతి పొందినదని తెలిపారు.భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కార్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని శతాబ్దాల నుండి పోచపల్లిలో చీరలు నేస్తున్నారని, ఎంతోమంది ఉపాధి పొందుతున్నారని ,పోచంపల్లి చీరల ప్రక్రియ విశేషమైన అద్భుతమైన ప్రక్రియ అని,పోచంపల్లికి యునెస్కో గుర్తింపు రావడం ఆశా మాషీ కాదని అన్నారు.జిల్లా యంత్రాంగం ప్రపంచ సుందరీమణులను ఇక్కత్ వస్త్రాలతో,బ్యాగులతో సన్మానించారు. స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కొర్రా లక్ష్మి, రాచకొండ సిపి సుధీర్ బాబు, డిసిపి అక్షన్స్ యాదవ్, పోచంపల్లి టూరిజం పార్క్ ఎండి ఉపేందర్ రెడ్డి ఉన్నారు.

# వాళ్లపై పీడీ యాక్ట్ పెట్టండి


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ నవభూమి ప్రతినిధి:**వర్షాకాలం పంటల సాగుకు సన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో సాగు విస్తీర్ణానికి సరిపడేన్ని విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. నకిలీ విత్తనాలు, రైతులను మోసం చేసే కంపెనీలు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.
వ్యవసాయ శాఖ అధికారులతో సచివాలయంలో రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం సలహాదారు వేం నరేందర్?రెడ్డి, ఎంపీ చామల కిరణ్?కుమార్?రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. కల్తీ, నకిలీ విత్తనాల దందాలపై అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ, పోలీస్ విభాగం సంయుక్తంగా టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించాలని చెప్పారు.
రాష్ట్ర సరిహద్దులు అన్ని చోట్లా టాస్క్ ఫోర్స్ నిఘా ఉంచాలని రేవంత్ రెడ్డి చెప్పారు. రైతులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను సీఎం హెచ్చరించారు.
ఎవరెవరు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నారు, ఎక్కడ నిల్వలు ఉన్నాయి.. ఎక్కడ నుంచి రవాణా అవుతున్నాయనే వివరాలన్నీ అధికారులకు సమాచారం ఉందని, ఎవరినీ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు.
నకిలీ దందా చేసే వ్యాపారులపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలని అన్నారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో మాట్లాడాలని సీఎస్ రామకృష్ణారావును ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో సరిపడే విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు ఆయనకు వివరించారు. ఈ సీజన్ లో వరి, పత్తి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంటుందని, రైతుల నుంచి డిమాండ్ ఉన్న అన్ని కంపెనీల విత్తనాలు మార్కెట్ లో అందుబాటు ఉన్నాయని వివరించారు. ఎరువులు, విత్తనాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రైతులకు భరోసానిచ్చారు. ఈ సారి రుతుపవనాలు ముందే వస్తుండటంతో రాష్ట్రంలోనూ వానలు ముందుగానే కురిసే అవకాశముందని వాతావరణ శాఖ చేసిన సూచనలను రైతులు గమనించాలని సూచించారు. అందుకు అనుకూలంగా సరైన అదనులో పంటలు వేసుకోవాలని, నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దని రైతులకు ఆయన కోరారు. ప్యాక్డ్ విత్తనాలు తప్ప లూజ్ విత్తనాలు కొనుగోలు చేయవద్దని, విత్తన పాకెట్లు కొనేటప్పుడు తప్పకుండా బిల్లును, పాకెట్ ను పంట కాలం ముగిసేంత వరకు భద్రపరుచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

# మైనార్టీలకు గుడ్ న్యూస్ చెప్పిన రేవంత్ రెడ్డి..!!

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**తెలంగాణలోని మైనారిటీ వర్గాల అభివృద్ధి, విద్య, ఉపాధి రంగాల్లో అవసరమైన మేరకు ఆదుకోవడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ముస్లింలలో ఎంతో మంది నిరుపేదలు ఉన్నారని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాల్లో వారి జనాభా మేరకు అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. హజ్ యాత్రికుల సౌకర్యార్థం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని మామిడిపల్లిలో వసతి భవనం నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించిందని రేవంత్ రెడ్డి చెప్పారు. ముస్లింలు జీవితంలో ఒక్కసారైనా హజ్‌కు వెళ్లి ప్రార్థనలు చేయాలని అనుకుంటారని, ఈ సారి ప్రభుత్వానికి 6,000 దరఖాస్తులు అందితే వాటన్నింటినీ ఆమోదించినట్టు తెలిపారు. ’ హజ్ యాత్రికులకు వీడ్కోలు పలుకుతూ విమానాశ్రయం బయలుదేరిన బస్సులకు నాంపల్లి హజ్ హౌజ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. హజ్ యాత్రికులకు అభినందనలు తెలియజేశారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి హజ్‌కు వెళ్లే హజీల కోసం అవసరమైన ఏర్పాట్లు చేశారని, ప్రభుత్వం అందుకు అన్ని విధాలుగా సహకరించిందని రేవంత్ రెడ్డి చెప్పారు. హజ్‌కు వెళ్లడం ముస్లింల హక్కు అని, ఈ విషయంలో ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని పేర్కొన్నారు. హజ్ యాత్రకు బయలుదేరి వెళ్లే వాళ్ల కోసం అవసరమైన ఏర్పాట్లు చేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

## సత్తా చాటాం

(1వపేజీ తరువాయి)ఆయన అడిగి తెలుసుకున్నారు. న్యూఢిల్లీలోని ఎయిమ్స్ ట్రౌమా సెంటర్‌లో వీరు చికిత్స పొందుతున్నారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కరెగుట్ట హిల్స్‌లో బలగాలు ఈ ఆపరేషన్ నిర్వహించాయి. మావోయిస్టులపై జరిగిన ఈ అతిపెద్ద ఆపరేషన్ 21 రోజులపాటు సాగింది. పలువురు వాంటెడ్ కమాండర్స్‌తో సహా 31 మంది టాప్ నక్సలైట్లను ఈ ఆపరేషన్‌లో బలగాలు మట్టుబెట్టాయి. ఈ ఆపరేషన్‌లో అసిస్టెంట్ కమాండంట్ సాగర్ బొరాడే (204 కోబ్రా బెటాలియన్), హెడ్ కానిస్టేబుల్ మునీశ్ చంద్ శర్మ (203 కోబ్రా), కానిస్టేబుల్ ధను రామ్ (204 కోబ్రా), కానిస్టేబుల్ కృష్ణ కుమార్ గుర్జర్ (196 సీఆర్‌పీఎఫ్), కానిస్టేబుల్ సంతోశ్ మురమి (డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్, ఛత్తీస్‌గఢ్ పోలీస్) ఉన్నారు.
దేశంలో నక్సల్స్ నిర్మూలనకు చేపట్టిన మిషన్‌లో ‘ఆపరేషన్ బ్లాక్‌ఫారెస్ట్’ సాధించిన విజయం చారిత్రకమని, ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలో 2026 మార్చికల్లా దేశంలో నక్సల్స్ నిర్మూలనకు కేంద్రం కృతనిశ్చయంతో ఉందని కేంద్రమంత్రి అమిత్‌షా పునరుద్ఘాటించారు.

## వల్లభనేని వంశీపై మరో కేసు

(1వపేజీ తరువాయి)2019-2024 సమయంలో వంశీ, ఆయన వర్గం అక్రమాలపై పాల్పడినట్టు నివేదికలో పేర్కొన్నారు. రూ. 100 కోట్లపైన అక్రమాలకు పాల్పడ్డారని వంశీపై మైనింగ్ ఏడీ ఫిర్యాదు చేశారు. దీంతో గన్నవరం పోలీసులు వంశీపై కేసు నమోదు చేశారు. దీనిపైన పీటీ వారెంట్ కోర్టులో దాఖలు చేయాలని పోలీసులు నిర్ణయించారు. ఇక, ఇప్పటికే ఆయన వివిధ కేసుల్లో అరెస్టై జైలులో ఉన్న విషయం తెలిసిందే.

## పొంచివున్న తుఫాన్

(1వపేజీ తరువాయి)నిడమర్రు- 54, కాకినాడ జిల్లా కాజులూరు- 42 మిల్లీ మీటర్ల మేర వర్షం కురిసింది. ఇదే తరహా వాతావరణ పరిస్థితులు మరో రెండు రోజుల పాటు కొనసాగనున్నట్లు విపత్తు నిర్వహణ విభాగం తెలిపింది.

## ఇక నెలనెలా నిరుద్యోగ లెక్కలు

(1వపేజీ తరువాయి)తద్వారా వారు శ్రామిక మార్కెట్‌లోని మార్పులను మరింత లోతుగా అర్థం చేసుకోగలరు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అంచనా వేయగలరు. అంతేకాకుండా, ఈ డేటా ప్రభుత్వానికి ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా రూపొందించడానికి సహాయపడుతుంది. ప్రభుత్వం ఈ చర్య కేవలం డేటా సేకరణ, విడుదలకే పరిమితం కాకుండా, దాని విశ్లేషణ, తగిన చర్యలు తీసుకోవడంపై కూడా దృష్టి సారిస్తుందని భావిస్తున్నారు. నిరుద్యోగిత అనేది ఒక క్లిష్టమైన సామాజిక-ఆర్థిక సమస్య, దీనిని సమర్థవంతంగా పరిష్కరించడానికి సరైన సమయంలో సరైన సమాచారం అందుబాటులో ఉండటం చాలా ముఖ్యం. ఈ కొత్త నెలవారీ నివేదికల ద్వారా భారతదేశం ఈ దిశగా ఒక బలమైన అడుగు వేసింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

## లోకేశ్‌కు పదోన్నతి?

(1వపేజీ తరువాయి)తో సమానంగా లోకేష్‌కు డిప్యూటీ సీఎం హోదా ఇవ్వాలని టీడీపీ నేతలు ఓపెన్ గా చేసిన వ్యాఖ్య లు రాజకీయంగా చర్చగా మారాయి. పవన్ అభిమానులు ఈ ప్రతిపాదన పైన ఘాటుగా స్పందిస్తూ పోస్టింగ్స్ పెట్టటంతో వివాదంగా మారింది. ఆ తరువాత ఈ వ్యవహారం పైన ఎవరూ మాట్లాడవద్దని టీడీపీ అధినాయకత్వం ఆదేశించటంతో వివాదం ముగిసింది. ఇక, ఈ నెల 27వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కడప జిల్లా కమలాపురం నియోజకవర్గ పరిధిలో టీడీపీ మహానాడు జరగ నుంది. ఇందు కోసం భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమయంలోనే ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న లోకేష్ కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలంటూ తీర్మానం ప్రతిపాదించ.. ఆమోదించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం.పార్టీ - ప్రభుత్వంలో లోకేష్ ఇప్పటికే ప్రభుత్వం లో దాదాపు నెంబర్ టూ స్థానంలో ఉన్నారు. ప్రభుత్వ నిర్ణయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీలోనూ సీట్ల ఖరారు.. మంత్రివర్గ కూర్పు.. ప్రస్తుతం నామినేటెడ్ పదవుల విషయంలోనూ లోకేష్ పాత్ర కీలకంగా మారిందని పార్టీ నేతలు చెబుతున్నారు. దీంతో.. పార్టీలో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి గురించి మహానాడు వేదికగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. పార్టీ పదవుల విషయంలోనూ ఎవరూ రెండు సార్లు కంటే ఎక్కువగా ఒకే పదవి లో కొనసాగ కూడదనే లోకేష్ ప్రతిపాదనకు పార్టీ పొలిట్ బ్యూరో ఆమోద ముద్ర వేసింది. దీంతో, ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాని తో భేటీ.. పార్టీ మహానాడు లో లోకేష్ పదవి పైన జరిగే నిర్ణయాల పైన టీడీపీలో ఆసక్తి కర చర్చ సాగుతోంది.

## ఇద్దరు ‘కీ’లక నేతల అరెస్ట్

(1వపేజీ తరువాయి) హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం ముందు ఈరోజు విచారణ జరిగింది. లిక్కర్ కేసులో ముందస్తు బెయిల్ ఇస్తే విచారణాధికారి చేతులు కట్టేసినట్లు అవుతుందని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. విచారణ వేళ ఈ క్రమంలో కృష్ణమోహన్ రెడ్డి, ధనుంజయ్ రెడ్డిలకు ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వడం కుదరదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. ఇప్పటికే లిక్కర్ కేసులో ఈ ఇద్దరు సిట్ విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో సిట్ 33 మందిని నిందితులుగా పేర్కొంది. అయిదు గురిని అరెస్ట్ చేసింది. తాజాగా, భారతీ సిమెంట్స్ శాశ్వత డైరెక్టర్ బాలాజీ గోవిందప్పను ఈకేసులో కర్ణాటకలో సిట్ అధికారులు అదుపులోకి తీసుకుంది. కేసులో బాలాజీ గోవిందప్పను ఏ33గా నిందితుల జాబితాలో సిట్ చేర్చింది. ఇప్పుడు సుప్రీం కోర్టు ముందస్తు బెయిల్ తిరస్కరించిన ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ అధికారులు దాదాపు 10 గంటలకుపైగా విచారించారు.

## 8వ సారి నీరవ్ మోదీకి బెయిల్ తిరస్కరణ

**లండన్-నవభూమి:** పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రుణాలు ఎగవేసిన కేసులో .. డైమండ్ వ్యాపారి నీరవ్ మోదీ ప్రస్తుతం లండన్ జైలులో జైలుశిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. అయితే లండన్ హైకోర్టు 8వ సారి నీరవ్ మోదీ బెయిల్ దరఖాస్తును తిరస్కరించింది. పంజాబ్ బ్యాంకుకు 13 వేల కోట్ల రుణం ఎగవేసిన కేసులో నీరవ్ మోదీ జైలుశిక్ష అనుభవిస్తున్నాడు. ఇదే కేసులో మోహుల్ చోక్సీ కూడా దోషిగా ఉన్నాడు. లండన్‌లోని కింగ్స్ బీచ్ డివిజన్ కోర్టు బెయిల్‌ను తిరస్కరించింది. క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ అడ్వకేట్‌తో పాటు సీబీఐ ఈ కేసులో నీరవ్ మోదీకి వ్యతిరేకంగా వాదించారు.
నీరవ్ మోదీపై మూడు కేసులు ఉన్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫ్రాడ్ కేసులో సీబీఐ రిపోర్టుతో పాటు మనీల్యాండరింగ్ ఆరోపణలపై ఈడీ కేసు, సాక్ష్యులపై వత్తిడి తీసుకువస్తున్న దాఖలైన సీబీఐ కేసులు ఉన్నాయి. 2019, మార్చి 19వ తేదీన అప్పగింత వారెంట్ కింద అతన్ని అరెస్టు చేశారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్ శనివారం 17 । మే । 2025

# ఇక, పాక్ బతుకు బట్టబయలు..



**పహల్గాం (నవభూమి)** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ సహా ఇప్పటికే అనేక తక్షణ చర్యలు చేపట్టిన భారత్ ఇప్పుడు కొత్త ఇనీషియేటివ్ తీసుకోబోతోంది. ప్రపంచం ముందు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని బట్టబయలు చేయబోతోంది. పహల్గాంలో 26 మంది ప్రాణాలు బలిగొన్న ఉదంతాన్ని, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ గురించి.. ప్రపంచ దేశాలకు వివరించడానికి భారత ప్రభుత్వం అన్ని పార్టీల ఎంపీ ప్రతినిధుల బృందాన్ని విదేశాలకు పంపనుంది. కశ్మీర్‌పై పాకిస్తాన్ దురాగతాన్ని తిప్పికొట్టడానికి, పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదాన్ని బహిర్గతం చేయడానికి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించారు.ఇందుకోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వివిధ రాజకీయ పార్టీల పార్లమెంటు సభ్యుల (ఎంపీలు) ప్రతినిధులను కీలకమైన ప్రపంచ రాజధానులకు పంపడానికి సన్నాహాలు చేస్తోంది. ఉగ్రవాద దాడులపై భారతదేశ దృక్పథాన్ని ప్రదర్శించడం, నిరంతర సీమాంతర ఉగ్రవాద బాధితురాలిగా భారతదేశం ఎదుర్కొంటున్న సవాళ్లని ప్రపంచానికి చాటి చెప్పడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ , ఇతర సంబంధిత ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపడతారు.దీంతో ఇప్పుడు.. సరిహద్దుల ఆవల నుంచి పుట్టుకొచ్చే ఉగ్రవాదంపై భారత్ తన వాణిని ప్రపంచ దేశాల ముందు బలంగా వినిపించబోతోంది.

## ఎవరెస్ట్ పర్వతంపై భారతీయుడి మృతి.. డెత్ జోన్ వద్ద ఘటన..



**ఖట్మాండు-నవభూమి:** ఎవరెస్ట్ పర్వతారోహణకు వెళ్లిన భారతీయుడు సుబ్రతా ఘోష్ (40) గురువారం మృతిచెందారు. శిఖరాగ్రానికి చేరుకున్న ఘోష్ ఆ తర్వాత కిందకి వచ్చే క్రమంలో హిల్లరీ స్టెప్‌కు దిగువన కన్నుమూసినట్టు తెలుస్తోంది. "ఆయన మరింత కిందకు దిగేందుకు నిరాకరించాడు" అని నేపాల్‌లోని స్నోయీ హొరైజన్ ట్రెక్ కంపెనీకి చెందిన బోధ్‌రాజ్ భండారి పేర్కొన్నారు. సుబ్రతా మృతికి గల కారణాలు మాత్రం తెలియరాలేదు. మృతదేహాన్ని పర్వతం దిగువన ఉన్న బేస్ క్యాంప్‌నకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని భండారీ తెలిపారు. పోస్ట్ మార్టం తర్వాతే మృతికి గల కారణాలు తెలుస్తాయని అన్నారు. ఇక ఈ సీజన్‌లో మరణాలు సంభవించడం ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు.ఎవరెస్ట్ పర్వతం శిఖరాగ్రానికి దిగువన 8 వేల మీటర్ల ఎత్తులో ఉన్న పర్వత ప్రాంతాన్ని హిల్లరీ స్టెప్ అని పిలుస్తారు. ఇంత ఎత్తున గాల్లో ఆక్సీజన్ చాలా స్వల్పంగా ఉంటుంది. దీంతో.. ఈ ప్రాంతాన్ని డెత్ జోన్‌గా పిలుస్తారు. ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని దాటి శిఖరాగ్రానికి చేరుకోవడం కష్టంగా ఉండేదని అక్కడి వారు చెబుతుంటారు. 2015 నాటి భూకంపం తర్వాత హిల్లరీ స్టెప్ స్వరూపం కొద్దిగా మారడంతో పర్వతారోహణ కాస్తంత సులభతరం అయ్యిందట.ఇక మరో ఘటనలో ఫిలిప్పీన్స్‌కు చెందిన ఫిలిప్ శాంటియాగో సైతం పర్వతారోహణలో ఉండగా బుధవారం కన్నుమూశారని అక్కడి పర్యాటక శాఖ అధికారి ఒకరు తెలిపారు. పర్వతంపై నాలుగో క్యాంప్ వద్దకు చేరుకునే సరికే అతడు బాగా అలిసిపోయాడు. అక్కడ విశ్రాంతి తీసుకునే క్రమంలోనే కన్నుమూశాడు.తాజా పర్వతారోహణ సీజన్ మే నెలలో ముగియనుంది. ఈ సీజన్‌లో మొత్తం 459 మందికి ఎవరెస్ట్ ఎక్కేందుకు నేపాల్ ప్రభుత్వం అనుమతించింది. ఈ వారంలో సుమారు 100 మంది పర్వతారోహకులు తమ గైడ్‌ల సాయంతో పర్వతారోహణను విజయవంతంగా ముగించారు. ఇక గత వందేళ్లలో 345 మంది పర్వతారోహకులు ఎవరెస్ట్ పర్వతంపై కఠిన వాతావరణ పరిస్థితులు తట్టుకోలేక కన్నుమూశారు.

## సింధు నదిపై భారీ ప్రాజెక్టులకు భారత్ శ్రీకారం.?



**న్యూదిల్లీ-నవభూమి:** సింధు, జీలం, చీనాబ్ నదులపై కొత్తగా డ్యామ్‌లు, భారీ రిజర్వాయర్లు త్వరితగతిన నిర్మించాలని భారత్ భావిస్తోంది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది. ఏప్రిల్ 22 పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోయిన తర్వాత పాకిస్థాన్‌తో భారత్.. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సింధు నది, దాని ఉప నదులైన జీలం, చీనాబ్ జల వనరుల్ని మరింత మెరుగ్గా ఉపయోగించుకునేందుకు ఆయా నదులపై కొత్త ప్రాజెక్టుల ప్రణాళిక, అమలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఇందులో భాగంగా రణబీర్ కాలువను విస్తరించే ప్రణాళికను కూడా సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఇది భారత్ చేపట్టాలని భావిస్తోన్న కీలక ప్రణాళికలలో ఒకటి. రణబీర్ కాలువ పొడవును 120 కి.మీ.కు రెట్టింపు చేయాలని, తద్వారా సెకనుకు 150 క్యూబిక్ మీటర్ల నీటిని మళ్లించడానికి వీలు కలుగుతుందని అంటున్నారు. ప్రస్తుతం దీని సామర్థ్యం 40 క్యూబిక్ మీటర్లు. దీంతోపాటు, సింధు, చీనాబ్, జీలం నదుల నుండి నీటిని మూడు ఉత్తర భారత రాష్ట్రాలలోని నదుల్లోకి తరలించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు రాయిటర్స్ వార్తా సంస్థ చెబుతోంది. ప్రస్తుతం సింధు దాని ఉప నదులపై ఉన్న చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 3,360 మెగావాట్ల నుండి 12,000 మెగావాట్లకు పెంచాలని భావిస్తున్నట్టు చెబుతున్నారు.కొత్తగా భారత్ ఈ నదులపై కనీసం ఐదు నీటి నిల్వ ప్రాజెక్టులను గుర్తించిందని, వాటిలో నాలుగు చీనాబ్, జీలం ఉపనదులపై ఉన్నాయని తెలిపింది. కాగా, పాకిస్తాన్‌లోని దాదాపు 80% పంట పొలాలకి, అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా సింధు నీటి ప్రవాహంపై ఆధారపడి ఉన్నాయి. పాకిస్తాన్ తో భారత్ సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తర్వాత మే ప్రారంభంలో పాకిస్తాన్‌లోని కీలకమైన ప్రాజెక్టుల్లో నీరు 90% వరకు తగ్గిందని చెబుతున్నారు. సింధు నది టిబెట్‌లోని మానసరోవర్ దగ్గర ఉద్భవించి, అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ నది భారత్ లోని ఉత్తర, పాకిస్తాన్ లోని తూర్పు, ఆగ్నేయ ప్రాంతాల్లో ప్రవహిస్తుంది.

## సత్తా చాటిన ఆకాశ్

**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గాం ఉగ్రదాడి కారణంగా భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అలాంటి వేళ.. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో దాదాపు 100 మందికిపైగా ఉగ్రవాదులు మరణించారు. అందుకు ప్రతిగా భారత్‌లోని సరిహద్దులుగా ఉన్న రాష్ట్రాలే లక్ష్యంగా పాక్ క్షిపణలు, డ్రోనులతో దాడులు నిర్వహించింది. ఈ దాడులను భారత సైన్యం తిప్పికొట్టింది. భారత్ అంబులపొదిలోని ఆకాశ్ క్షిపణి ద్వారానే ఇది సాధ్యమైందనే వాదన సర్వత్ర వినిపిస్తోంది.ఈ తరహా క్షిపణిని ఇప్పటి వరకు చూడలేదని శత్రు దేశమైన పాకిస్థాన్ సైతం ప్రకటించిందంటే.. ఆకాశ్ పవర్ ఏమిటో అర్థమవుతోంది. ఈ ఆకాశ్ క్షిపణి హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థలో తయారయింది. ఈ ఆకాశ్ క్షిపణి తయారికి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా శాస్త్రవేత్త డాక్టర్ ప్రహ్లాద రామారావు వ్యవహరించారు. ఆ ఆకాశ్ క్షిపణికి సంబంధించిన పలు కీలక అంశాలు.



## భారత ఆర్మీపై వివాదాస్పద వ్యాఖ్యలు..ఈసారి డిప్యూటీ సీఎం



**భోపాల్‌నవభూమి:** కల్నల్ సోషియా ఖురేషి పై మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసి చిక్కుల్లో పడ్డారు. తాజాగా ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జగదీష్ దేవ్డా ఇండియన్ ఆర్మీపై చేసిన వ్యాఖ్యలు సైతం రాజకీయ దుమారం రేపుతున్నాయి. "భారత ఆర్మీతో సహ యావద్దేశం నరేంద్ర మోదీ పాదాలకు మొక్కాలి" అని దేవ్డా అన్నారు.జబల్‌పూర్‌లో జరిగిన పౌర రక్షణ వలంటీర్ల శిక్షణా శిబిరంలో జగదీష్ దేవ్డా మాట్లాడుతూ, పహల్గాం ఉగ్రవాదులకు మోదీ దీటుగా జవాబిచ్చారని ప్రశంసించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మోదీ తీసుకున్న నిర్ణయానికి యావద్దేశంతో పాటు, మిలటరీ మొత్తం ఆయన పాదలకు మొక్కాలని అన్నారు. ముఖ్యంగా మోదీ సారథ్యంలో పాక్ ఉగ్రవాదులపై తీసుకున్న నిర్ణయాత్మక చర్యలను ఎంత పొడిగినా తక్కువేనని చెప్పారు. పహల్గాంలో ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా టూరిస్టులను వారి భార్యాపిల్లల కళ్లముందే మతం అడిగి మరీ కాల్చిచంపారని, ఇలాంటి కిరాతకులకు బదులిచ్చి తీరాల్సిందేనని అన్నారు. మిలిటెంట్లు, వారి మద్దతుదారులను మట్టుబెట్టేంత వరకూ దేశం విశ్రమించకూడదని చెప్పారు.జవాన్ల సాహసాలను కించపరుస్తారా?: ప్రియాంక గాంధీ దేవ్డా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ వాద్రా విమర్శలు గుప్పించారు. ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని, సిగ్గుచేటని మండిపడ్డారు. "మహిళా సైనికులపై మధ్యప్రదేశ్ మంత్రి ఒకరు మొదట అవమానకర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం మన సాయుధ బలగాలను అవమానిస్తూ మాట్లాడారు. యావద్దేశం మన జవాన్ల సాహసాలను అభినందిస్తోంది. కానీ బీజేపీ నేతలు మాత్రం జవాన్ల సాహసాలను నిరంతరం కించపరుస్తూనే ఉన్నారు. ఇలాంటి మాటలు మాట్లాడిన నేతలను ఆ పార్టీ శిక్షించడానికి బదులు, వారికి కొమ్ము కాస్తోంది. ఇలాంటి వ్యాఖ్యలు ద్వారా దేశ ప్రజలకు, జవాన్లకు బీజేపీ ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటోంది?" అని సోషల్ మీడియా పోస్ట్‌లో ప్రియాంక ప్రశ్నించారు.

## తుల్‌బుల్‌పై ఒమర్, మెహబూబా మాటల తూటాలు



**శ్రీనగర్-నవభూమి:** సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన నేపథ్యంలో వులర్ సరస్సుపై గతంలో తలపెట్టిన 'తుల్‌బుల్' నేవిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఉంది. అయితే, ఒమర్ అబ్దుల్లా అభిప్రాయంతో జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ విభేదించారు. దీంతో శుక్రవారంనాడు ఈ ఇద్దరు నేతల మధ్య సోషల్ మీడియా 'ఎక్స్'లో మాటల యుద్ధం చోటుచేసుకుంది. అత్యంత అవసరమైన, జీవనాధారమైన నీటిని ఆయుధంగా మార్చడం అవమానవీయమని ఒమర్‌ను మెహబూబా ముఫ్తీ విమర్శించగా, సరిహద్దుకు అవతల ఉన్నవారి కోసం ఆలోచిస్తూ చీప్ పబ్లిసిటీకి ముఫ్తీ ప్రయత్నిస్తున్నారని ఒమర్ తప్పుపట్టారు.ఉత్తర కశ్మీర్‌లో ఉలర్ సరస్సు ఉంది. వీడియోలో చూస్తున్న సివిల్ వర్క్‌లు తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించినవి. ఈ పనులు 1980లో మొదలయ్యాయి. సింధూ జలాల ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ పాకిస్థాన్ తెచ్చిన ఒత్తిడితో దానిని నిలిపివేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నావిగేషన్ కోసం జీలంను ఉపయోగించుకునేందుకు మార్గం సుగమం అవుతుంది. దిగువన ఉన్న విద్యుత్ ప్రాజెక్టుల్లో విద్యుదుత్పత్తి మెరుగుపడుతుంది" అని ఒక ట్వీట్‌లో ఒమర్ తెలిపారు.బాధ్యతలేని డిమాండ్ కాగా, ఒమర్ అబ్దుల్లా అభిప్రాయాన్ని మెహబూబా ముఫ్తీ తప్పుపట్టారు. "భారత్-పాక్ మధ్య ఉద్రిత్తల నేపథ్యంలో తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టును పునరుద్ధరిస్తామంటూ సీఎం చెప్పడం దురదృష్టకరం. జమ్మూకశ్మీర్‌లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయి తీవ్ర నష్టంతో కడగండ్ల పాలైన పరిస్థితిలో సీఎం వ్యాఖ్యలు ప్రమాదకరంగా, ఉగ్రికత్తలు రెచ్చగొట్టేలా ఉన్నాయి. అత్యంత అవసరమైన, జీవనాధారమైన నీటిని ఆయుధంగా మార్చడం అమానవీయం. ద్వైపాక్షిక అంశాలను అంతర్జాతీయంగా మార్చే ప్రమాదం కూడా ఉంది" అని ముఫ్తీ ట్వీట్ చేశారు.తిరిగి స్పందించిన ఒమర్ పీడీపీ చీఫ్ ట్వీట్‌పై ఒమర్ తిరిగి స్పందించారు. "సింధూ జలాల ఒప్పందం (ఐడబ్ల్యూటీని)తో జమ్మూకశ్మీర్‌కు చారిత్రక ద్రోహం జరిగింది. ఇది జమ్మూకశ్మీర్ ప్రజల ప్రయోజనాలకు విరుద్ధం. ఈ ఒప్పందాన్ని నేను మొదట్నించీ వ్యతిరేకిస్తున్నాను. ఇక ముందు కూడా ఇదే వైఖరిని కొనసాగిస్తాం. అయితే, దీనిని ఒప్పుకునేందుకు మీరు (మెహబూబా) సిద్ధంగా లేరు, సరిహద్దుకు ఆవల ఉన్నవారి ప్రయోజనాల కోసం చౌకబారు పబ్లిసిటీ ప్రయత్నంలో ఉన్నారు. ఇది చాలా దురదృష్టకరం" అని ఒమర్ రీట్వీట్ చేశారు.కాలమే చెబుతుంది..మరోవైపు, ఒమర్ వ్యాఖ్యలపై మెహబూబా వెంటనే స్పందించారు. ఎవరిని ఎవరు బుజ్జగించే పని చేస్తున్నారో కాలమే చెబుతుందన్నారు. తాము అంకితభావంతో ఉన్నామని, ఇది నిరూపించుకోవడానికి ఉద్రిక్తతలు సృష్టించాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని తెలిపారు.

# తీవ్రవాదులు అరెస్ట్.. ఆయుధాల సీజ్



**శ్రీనగర్-నవభూమి:** జమ్మూ కాశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు శుక్రవారం అరెస్ట్ చేశాయి. వీరికి నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాతో సంబంధాలున్నాయని తెలిపాయి. వీరి వద్ద నుంచి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకుని.. సీజ్ చేసినట్లు వివరించాయి. ఈ ప్రాంతంలో వీళ్లు ఉగ్రవాద చర్యలకు పాల్పడడమే కాకుండా.. స్థానికులను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు ప్రోత్సహిస్తున్నారని చెప్పాయి. ఈ ముగ్గురు ముజామిల్ అహ్మద్, ఇషాక్ పండిట్, మున్సీర్ అహ్మద్‌గా గుర్తించామన్నారు. వీరిని మగమ్‌లో అరెస్ట్ చేశామన్నారు.లష్కరే తోయిబా సంస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న అబిద్ ఖయ్యూమ్ లోన్‌తో నేరుగా సంప్రదింపులు జరిపేంత చనువు వీరికి ఉందని పేర్కొన్నాయి. 2020లో అబిద్ ఖయ్యూమ్ లోన్.. పాకిస్థాన్ పారిపోయి.. లష్కరే తోయిబాలో చేరాడని వివరించాయి. ఇతరు పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తూ.. బద్గాం జిల్లాలోని ప్రజలను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు సన్నాహకాలు చేపడుతున్నాడని తెలిపాయి. అతడి ఆదేశాలకు అనుగుణంగా ఈ ప్రాంతంలో ఈ ముగ్గురు పని చేస్తున్నారని భద్రతా దళాలు వివరించాయి. అయితే వీరిని విచారిస్తున్నామని భద్రతా దళాలు తెలిపాయి.ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది మరణించారు. ఈ ఘటనకు పాకిస్థాన్‌దే బాధ్యత అనేందుకు భారత్ సాక్ష్యాలను సేకరించింది. వీటిని ప్రపంచం ముందు ఉంచింది. అంతేకాదు.. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. అలాగే భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ సైతం కీలక నిర్ణయాలు చేపట్టింది. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది.అలాంటి వేళ.. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను దాడి చేసి.. 100 మందికిపైగా ఉగ్రవాదులను భారత సైన్యం హతమార్చింది. ఈ చర్యకు ఆపరేషన్ సిందూర్ అని భారత్ పేరు పెట్టింది. దీంతో పాక్ సైతం.. తన దేశ సరిహద్దులకు అనుకున్ని ఉన్న భారత్‌లోని పలు రాష్ట్రాలపైకి డ్రోనులు, క్షిపణలతో దాడి చేసింది.ఈ దాడులను భారత్ తిప్పికొట్టంది. అనంతరం ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నాయి. అయితే పహల్గాం ఉగ్రదాడి అనంతరం జమ్మూ కాశ్మీర్‌లోని అన్ని జిల్లాల్లో భద్రతా దళాలు ఉగ్రవాదుల కోసం జల్లెడ పడుతున్నాయి. ఆ క్రమంలో పలు ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. అలాగే పలువురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్న సంగతి తెలిసిందే.

# నేటి నుంచి ఐపీఎల్ సందడి



**బెంగళూరు-నవభూమిబ్యూరో:** పది రోజులకు పైగా వాయిదా పడిన ఐపీఎల్ 18వ సీజన్ పునః ప్రారంభం కానుంది. శనివారం చిన్నస్వామి స్టేడియంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కోల్‌కతా నైట్ రైడర్స్ పోరుతో మళ్లీ బ్యాటర్ల విధ్వంసానికి తెర లేవనుంది. విదేశీ క్రికెటర్లు కొందరు టోర్నీకి దూరమైనా.. ప్లే ఆఫ్స్ పోరులో నిలిచేందుకు ఏడు జట్లు సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధమయ్యాయి. లీగ్ దశ ముగింపు దశకు వచ్చినందుకు ఇకపై ప్రతి మ్యాచ్ హోరాహోరీగా సాగనుంది.

తొలి టైటిల్ కలను సాకారం చేసుకోవాలనుకుంటున్న ఆర్సీబీ.. కోల్‌కతాపై విజయం సాధిస్తే నాకౌట్ పోరుకు దూసుకెళుతుంది. టేబుల్ టాపర్ గుజరాత్ టైటాన్స్ కూడా ఒక్క అడుగు దూరంలో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలిస్తే శుభ్‌మన్ గిల్ సేన బెర్తు ఖరారు చేసుకుంటుంది. మరి మిగతా రెండు జట్లు ఏవి? అనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**ఎనిమిదేసి విజయాలతో**

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలతో ఐపీఎల్ వారం రోజులు వాయిదా పడింది. మే 9న ధర్మశాలలో పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ రద్దుతో లీగ్‌ను సస్పెండ్ చేసింది బీసీసీఐ. అయితే.. ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరగా.. మే 17 నుంచి లీగ్‌ను పునరుద్ధరించేందుకు బీసీసీఐ కొత్త షెడ్యూల్ విడుదల చేసింది. ప్రస్తుతానికి గుజరాత్, ఆర్సీబీ జట్లు తలా ఎనిమిదేసి విజయాలతో వరుసగా 1, 2 స్థానాల్లో ఉన్నాయి. ఈ ఎడిషన్‌లో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. అన్నింటా దుమ్మురేపుతున్న పంజాబ్ కింగ్స్ 15 పాయింట్లతో మూడో ప్లేస్‌లో ఉంది. ఆరంభంలో తడబడినా.. అనూహ్యంగా పుంజుకున్న మాజీ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది. అయితే.. గుజరాత్, ఆర్సీబీ, పంజాబ్‌లకు ఇంకా మూడు లీగ్ మ్యాచ్‌లుండగా.. ముంబైకి మాత్రం రెండో ఉన్నాయి. వాటిలో ఒక్కటి ఓడినా.. ఆ జట్టు ప్లే ఆఫ్స్ ఆడే అవకాశాలు తగ్గిపోతాయి.

ఇక.. ఢిల్లీ క్యాపిటల్స్, ఢిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా, లక్నో సూపర్ జెయింట్స్ కూడా ప్లే ఆఫ్స్ చేరాలనే కసితో ఉన్నాయి. కానీ, ఇప్పటికే 12 మ్యాచులు ఆడిన అజింక్యా రహానే బృందం తదుపరి రెండు మ్యాచుల్లో గెలవాలి. దాంతో, 16 పాయింట్లు చేరినా ఇతర జట్ల పాయింట్లు, రన్‌రేటే మీద ఆధారపడాల్సి వస్తుంది. రిషభ్ పంత్ నేతృత్వంలోని లక్నో, అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ ఇంకో మూడేసి మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే.

## పాక్‌కు రుణం ఇవ్వడంపై ఐఎంఎఫ్ పునఃపరిశీలించాలి: కేంద్రమంత్రి..



**భుజ్-నవభూమి:** ఉగ్రవాదులకు పాకిస్థాన్ నిధులు అందిస్తుండడంపై భారత్ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విరుచుకుపడ్డారు. పాక్ తన గడ్డపై ఉగ్రవాద సంస్థలకు నిధులివ్వడానికి చరమగీతం పాడాలంటే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఆ దేశానికి ఆర్థిక సాయం ఆపేయాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లోని భుజ్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో వాయిసేన సిబ్బందిని ఉద్దేశించి రాజ్‌నాథ్ శుక్రవారం నాడు మాట్లాడారు. గ్లోబల్ సాయాన్ని పాక్ దుర్వినియోగం చేస్తూ క్రాస్ బోర్డర్ టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తోందని కేంద్రమంత్రి ఆరోపించారు.జమ్మూకశ్మీర్‌లో గురువారం నాడు పర్యటన అనంతరం రాజ్‌నాథ్ సింగ్.. భుజ్ చేరుకున్నారు. ఎల్ఓసీ, అంతర్జాతీయ సరిహద్దుల్లో భద్రతను ఆయన ఈ సందర్భంగా సమీక్షించారు. శ్రీనగర్‌లో పర్యటన సందర్భంగా పాక్‌పై రాజ్‌నాథ్ విరుచుకుపడ్డారు. పాక్ భారత్ పట్ల నయవంచనకు పాల్పడుతోందని, భారత వ్యతిరేక శక్తులు, ఉగ్రవాద సంస్థలకు తన భూభాగంపై ఆశ్రయం ఇవ్వడం తక్షణం పాక్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఐఎంఎఫ్ నుంచి రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితికి పాక్ చేరుకుందని, భారత్ మాత్రం ఐఎంఎఫ్‌కు నిధులు సమకూర్చే క్యాటగిరీలో ఉందని చెప్పారు. ఇందువల్ల పేద దేశాలను ఐఎంఎఫ్ ఆదుకోగలుగుతోందన్నారు.భారత్ అభ్యంతరాలను ఖాతరు చేయకుండా పాక్‌కు రెండో విడత లోన్ ప్యాకేజీగా 7 బిలియన్ల డాలర్లను ఐఎంఎఫ్ ఇటీవల ప్రకటించింది. ఆర్థిక వ్యవస్థ కోలుకోవడానికి, సంస్కరణల కొనసాగింపునకు ఇస్లామాబాద్‌కు రుణం మంజూరు చేస్తున్నామని పేర్కొంది. ఆర్థిక వ్యవస్థ పుంజుకునేందుకు పాక్‌కు అందిస్తున్న సహాయాన్ని కొనసాగిస్తామని తెలిపింది.ఐఎంఎఫ్ చర్యను భారత్ తప్పుపట్టింది. సంస్కరణలు అమలు చేయడంలో అత్యంత దయనీయమైన ట్రాక్ రికార్డ్ ఉన్న పాక్‌కు నిధులెలా ఇస్తారని నిలదీసింది. అదీగాక ఆ నిధులను క్రాస్ బోర్డర్ టెర్రరిజాన్ని ప్రోత్సహించేందుకు పాక్ మళ్లిస్తోందని ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను పాక్ తోసిపుచ్చింది.

## తుర్కియేకు సీఏఐటీ షాక్.. వర్తక, వాణిజ్య సంబంధాలు నిలిపివేత..




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వేళ పాక్‌కు మద్దతిచ్చిన తుర్కియే, అజర్‌బైజాన్‌కు ఆల్ ఇండియా ట్రేడర్స్ కాన్ఫెడరేషన్ షాక్ ఇచ్చింది. తుర్కియేతో అన్నిరకాల వాణిజ్య, వర్తక సంబంధాలను బాయ్‌కాట్ చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. ట్రావెల్, టూరిజం సహా ఆ దేశంతో అన్ని సంబంధాలను పూర్తిగా బాయ్‌కాట్ చేస్తున్నట్టు సీఏఐటీ నిర్వహించిన నేషనల్ ట్రేడ్ కాన్ఫరెన్స్‌లో 125కు పైగా టాప్ ట్రేడ్ లీడర్లు నిర్ణయించారు. టర్కీ, అజర్‌బైజాన్‌లో సినిమాలు షూటింగ్ చేయవద్దని కూడా భారత చలనచిత్ర పరిశ్రమకు ట్రేడ్ కమ్యూనిటీ విజ్ఞప్తి చేసింది. అక్కడ సినిమాలు షూట్ చేస్తే ట్రేడ్ కమ్యూనిటీతోపాటు, ప్రజలంతా ఆ చిత్రాలను బాయ్‌కాట్ చేస్తారని హెచ్చరించింది. ఆ దేశాల్లో ఉత్పత్తి ప్రమేషన్‌లను ఏ కార్పొరేట్ సంస్థ షూట్ చేయరాదని సైతం సదస్సులో నిర్ణయించారు.సీఏఐటీ ట్రేడ్ కాన్ఫరెన్స్‌లో 24 రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంఘీభావం తెలిపారు. భారత్‌కు వ్యతిరేకంగా నిలిచే శక్తులను వ్యతిరేకించాలని ప్రతినబూనారు. భారతదేశం ఇటీవల తీవ్రమైన జాతీయ భద్రతా సవాళ్లను ఎదుర్కొన్న సమయంలో పాక్‌కు తుర్కియే, అజర్‌బైజాన్ దేశాలు మద్దతు ప్రకటించాయి. ఈ దేశాలు సంక్షోభంలో పడినప్పుడు ముఖ్యంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం మానవతాసాయంతోపాటు దౌత్యపరంగా ఆదుకుందని, అయితే ఈ రెండు దేశాలు భారత్ పట్ల వంచనకు పాల్పడ్డాయని వాణిజ్య వర్గాలు విమర్శలు గుప్పించాయి.

## ఆ ఆలయంలో సెల్‌ఫోన్ నిషేధం..


**చెన్నై-నవభూమి:** హైకోర్టు ఉత్తర్వుల మేరకు, కాంచీపురం కామాక్షి అమ్మవారి ఆలయం లోనికి భక్తులు సెల్‌ఫోన్‌తీసుకెళ్లడంపై నిషేధం విధించారు. భక్తులు తమ సెల్‌ఫోన్ భద్రపరచుకొనేలా 'డిజిటల్ లాకర్' సదుపాయం కల్పించారు. ఈ విషయమై ఆలయ అధికారులు మాట్లాడుతూ... ఆలయాల్లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లరాదని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిందన్నారు.ఆ ప్రకా రం,కామాక్షి అమ్మవారి ఆలయంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లడంపై నిషేధం విధించామన్నారు. భక్తులు తమ సెల్‌ఫోన్ భద్రపరచుకొనేలా డిజిటల్ లాకర్ వసతి కల్పించామని తెలిపారు. ఆలయ తూర్పు, ఉత్తరం ప్రవేశ ద్వారం సమీపంలో ఏర్పాటుచేసిన డిజిటల్ లాకర్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్ తమ సెల్‌ఫోన్ ద్వారా స్కాన్ చేసి, తమ సెల్‌ఫోన్‌కు వచ్చే నాలుగు అంకెల పాస్‌వర్డ్ గుర్తుపెట్టుకొని, లాకర్‌లో సెల్‌ఫోన్ ఉంచి ఆలయం లోపలికి వెళ్లాలన్నారు.దర్శనం ముగిసిన అనంతరం లాకర్‌పై స్క్రీన్‌పై నాలుగు అంకెల పాస్ వర్డ్ నమోదుచేసి సెల్‌ఫోన్ తీసుకెళ్లవచ్చని తెలిపారు. డిజిటల్ లాకర్‌లో సెల్‌ఫోన్ ఉంచేందుకు భక్తులు క్యూఆర్ కోడ్ ద్వారా రూ.10 చెల్లించాల్సి ఉంటుందని, ఒకే సమయంలో 1,000 మంది వరకు ఈ సదుపాయం వినియోగించేలా డిజిటల్ లాకర్స్ ఏర్పాటుచేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



## టిక్‌టాక్ స్టార్‌ను కాల్చి చంపిన ఆగంతకుడు



**మెక్సికో-నవభూమి:** ఒక భయానకమైన సంఘటన చోటు చేసుకుంది. టిక్‌టాక్‌లో బాగా పాపులర్ అయిన వలెరియా మార్కెజ్ (23) అనే యువతిని దారుణంగా హత్య చేశారు. మెక్సికోలో ఒక భయానకమైన సంఘటన చోటు చేసుకుంది. టిక్‌టాక్‌లో బాగా పాపులర్ అయిన వలెరియా మార్కెజ్ (23) అనే యువతిని దారుణంగా హత్య చేశారు. బ్యూటీ, మేకప్ వీడియోలతో టిక్‌టాక్‌లో బాగా పాపులర్ అయిన యువ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌ను లైవ్ స్ట్రీమింగ్ చేస్తుండగానే దారుణంగా కాల్చి చంపేశారు. గౌడలజారా నగరంలోని ఒక బ్యూటీ పార్లర్‌లో ఆమె లైవ్ స్ట్రీమింగ్ చేస్తుండగా.. ఒక వ్యక్తి గదిలోకి వచ్చాడు. "వలెరియా నువ్వేనా?" అని అడిగాడు. ఆమె "అవును" అని చెప్పేలోపే, అతను ఆమె ఛాతీ, తలపై గన్‌తో కాల్చేశాడు. వలెరియా అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ దారుణ హత్యకు గల కారణాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో ఆమె అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వలెరియా మార్కెజ్ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండేది. ముఖ్యంగా టిక్‌టాక్‌లో ఆమెకు పెద్ద సంఖ్యలో ఫాలోవర్లు ఉన్నారు. ఆమె తన లైవ్ స్ట్రీమింగ్‌ల ద్వారా ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. అయితే, ఇలా లైవ్‌లో ఉండగా ఆమె హత్యకు గురికావడం అందరినీ కలచివేస్తోంది. ఆగంతకుడు నేరుగా గదిలోకి వచ్చి వలెరియాను గుర్తించి కాల్చడం చూస్తుంటే, ఇది పథకం ప్రకారం చేసిన హత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. వ్యక్తిగత కారణాలా, వ్యాపారపరమైన శత్రుత్వమా లేక మరేదైనా కారణమా దర్యాప్తు చేస్తున్నారు.



## ఇంధన వనరులపై దృష్టి

పెట్రోలియం ఉత్పత్తుల ధరలు అసాధారణంగా పెరిగిపోతున్నాయి. ఇతర సహజవనరుల విషయంలోనూ పర్యావరణపరమైన ఒత్తిళ్ళున్నాయి. ఈ నేపథ్యంలో ఇంధన వనరుల రంగం సమూలంగా దిశ మార్చుకుంటోంది. వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న శిలాజ ఇంధనాల వినియోగం నుంచి ప్రపంచం సౌర, పవన, హైడ్రోజన్ వంటి పునర్వినియోగ ఇంధనాల వైపు మళ్లుతోంది. విద్యుత్తు వినియోగం, రవాణా-ప్రయాణ రంగంలో వాహ నాలకు పునర్వినియోగ ఇంధన వాటా పెరిగితేనే, 'వాతావరణ మార్పు' ప్రతికూల ప్రభావాల నుంచి స్థూలంగా ప్రపంచానికి, ప్రత్యేకంగా భారత్‌కు రక్ష!ఆధునిక మానవుడి నిత్యావసరమైన ఇంధన వనరు రంగం సమూలంగా దిశ మార్చుకుంటోంది. కర్బన ఉద్గారాలతో వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న శిలాజ ఇంధనాల వినియోగం నుంచి ప్రపంచం సౌర, -పవన, హైడ్రోజన్ వంటి పునర్వినియోగ (స్వచ్ఛ- హరిత) ఇంధనాల వైపు మళ్లుతోంది. ఇదొక... అవసర, అనివార్య స్థితి! ఈ మార్పుకనుగుణంగా భారత్‌లోనూ బలమైన అడుగులే పడుతున్నాయి. అక్టోబర్ నెలాఖరుకి 150 గిగావాట్లు, 2022 సంవత్సరాం తానికి 175 గిగావాట్ల పునర్వినియోగ విద్యుత్ ఇంధన (ఆర్ఈ) స్థాపక సామర్థ్యానికి కేంద్ర ప్రభుత్వం సన్నద్ధమౌతోంది. (ఒక గిగా వాట్ అంటే వెయ్యి మెగావాట్లు) 2.2 గిగావాట్లు, నెలాఖరున మరో 2.32 గిగావాట్ల స్థాపక సామర్థ్య ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తోంది.

కార్పొరేట్ రంగం నుంచి ఇటీవల వచ్చిన భారీ ప్రకటనల ప్రకారం.... రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ వచ్చే మూడేళ్లలో రూ 75 వేల కోట్లు (పది బిలియన్ డాలర్లు), అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ వచ్చే పదేళ్లలో రూ 1.50 లక్షల కోట్లు (ఇరవై బిలియన్ డాలర్లు) పునర్వినియోగ ఇంధన రంగంలో వ్యయం చేయనున్నారు. ప్రభుత్వాలు, పరిశ్రమ, పౌర సమాజం... అప్రమత్తంగా ఉండి భవిష్యత్తుకు భరోసా ఇచ్చేలా బాటను చక్కదిద్దుకోవడమే వారి ముందున్న కర్తవ్యం. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు అసాధారణంగా పెరిగిపోతున్నాయి. ఇతర సహజ వనరుల విషయంలోనూ పర్యావరణపరమైన ఒత్తిడులున్నాయి.

వాటి లభ్యత కష్టంఖరీదవుతుండగా, వినియోగం దుర్భరమౌతున్న పరిస్థి తుల్లో పర్యావరణ సానుకూల పునర్వినియోగ ఇంధనాల వినియోగ వాటాను పెంచడం ఆరోగ్యకర పరిణామం! ఐక్యరాజ్యసమితి (యూఎన్) నిర్దేశించనట్టు, 2015 పారిస్ పర్యావరణ ఒప్పందం ప్రకారం నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవడానికి ఈ దిశలో పయనం అత్య వసరం! అదే సమయంలో సుస్థిరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుంటే, ఇప్పుడు చైనా ఎదుర్కొంటున్న తీవ్ర విద్యుత్ సంక్షోభ దుస్థితి మనకూ తప్పదు! ప్రపంచంలో అత్యధికంగా బొగ్గు వినియో గించే చైనా సదరు శిలాజ ఇంధన వాడకాన్ని రమారమి తగ్గించింది. గత దశాబ్దారంభంలో 68 శాతం ఉన్న బొగ్గు వినియోగం వాటాని, 2020లో 56 శాతానికి తగ్గించింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సరిగా లేనందున ఇప్పుడు పారిశ్రామిక, నివాస, ట్రాఫిక్ నిర్వహణ వంటి నిత్యావసరాలకూ తీవ్ర విద్యుత్ కొరత ఎదుర్కొంటూ దిగుమతుల కోసం దిక్కులు చూస్తోంది.!

అమెరికా, చైనా తర్వాత ఎక్కువ కర్బన ఉద్గారాలను (గ్రీన్ హౌజ్ గ్యాసెస్) విడుదల చేస్తున్న దేశంగా భారత్‌పై పర్యావరణ పరిరక్షణ బాధ్యత ఎంతో ఉంది. 2030 నాటికి, కార్బన్ ఫుట్‌ప్రింట్‌ని 33-35 శాతం (2005 నాటి స్థాయిపై లెక్కించి) మేర తగ్గిస్తామని పారిస్‌లో మాటిచ్చాం. పునర్వినియోగ ఇంధన వాటాని 40 శాతానికి పెంచుతా మన్నది కూడా ఒప్పందంలో భాగమే! ఇప్పటికే 38.4 శాతానికి చేరు కున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తోంది. ప్రభుత్వ-ప్రయివేటు రంగంలో తాజాగా వస్తున్న పెట్టుబడులు, ప్రణాళికల్ని బట్టి ఈ వాటాను 2030 నాటికి 66 శాతానికి పెంచే ఆస్కారముంది. పర్యా వరణ సానుకూల దిశలో గట్టి ముందడుగు పడ్డట్టే! కార్బన్ డైయాక్సైడ్ (సీవోటూ) వంటి కర్బన ఉద్గారాలను 28 శాతానికి తగ్గించినట్టు ప్రభుత్వం చెబుతోంది. కోవిడ్ రెండో అల సమయంలో దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం తగ్గి, బొగ్గు ఉత్పత్తి పెరిగింది. కానీ, సాధారణ పరిస్థితుల్లో విద్యుత్ వినియోగం మనదేశంలో పెరుగుతోంది.గరిష్ట వినియోగ సమయంలో (పీక్) గత జూలై 7న, 200.57 గిగావాట్ల విద్యుత్ వినియోగం జరిగినట్టు కేంద్ర ఇంధన మంత్రి రాజ్‌కుమార్ సింగ్ తెలిపారు. ప్రపంచ సగటు తలసరి కర్బన ఉద్గారాలతో పోలిస్తే మన తలసరి మూడో వంతేనని ఇటీవల ఒక అంతర్జాతీయ వేదిక నుంచి, సదరు మంత్రి సెలవిచ్చారు. కర్బన ఉద్గారాల సున్నాస్థితి (జీరో న్యూట్రాలిటీ) సాధించే విషయమై భారత్ నిర్దిష్ట ప్రకటన చేయాలన్న వాదనను తోసిపుచ్చుతూ ఆయనీ మాటలన్నారు. కానీ, అది సరైన వాదన కాదనేది పర్యావరణ కార్యకర్తల భావన! ప్రపం చంలో రెండో అతి పెద్ద ఉత్పత్తి దేశం, రెండో అత్యధిక జనాభా దేశం, కర్బన ఉద్గారాల్లో మూడో అతిపెద్ద దేశం. తలసరి ఉద్గారాల వెల్లడి తక్కువే అయినా, విస్తృత జనాభా రీత్యా, దీన్ని తీవ్ర సమస్యగానే పరిగణించాలి. నెల రోజుల్లో గ్లాస్‌గోవ్‌లో జరుగనున్న 'కాప్-26' యూఎన్ సదస్సులోగానీ, ముందేగానీ దీనిపై నిర్దిష్ట ప్రకటన చేయా లని భారత్‌పై అంతర్జాతీయ సమాజం నుంచి వత్తిడి పెరుగుతోంది.

భారత్ పురోగమిస్తున్న పునర్వినియోగ ఇంధన రంగంలో, అందుక వసరమైన భూలభ్యత, సేకరణ, వినియోగం జటిల సమస్యే కానుంది. హరిత మార్గాలైన సౌర విద్యుత్‌కైనా, పవన విద్యుత్తుకైనా నిర్దిష్టంగా స్థలం అవసరమౌతుంది. పునర్వినియోగ ఇంధనాల ద్వారా. 2050 నాటికి కర్బన ఉద్గారాల శూన్యస్థితి సాధించాలంటే 'ఇంధన వ్యయ-ఆర్థిక విశ్లేషన సంస్థ' (ఐఈఈఎఫ్ఎ) అధ్యయనం ప్రకారం, పెద్ద మొత్తం భూమి అవసరమౌ తుంది. సౌర విద్యుత్ వ్యవస్థకు 50,000 నుంచి 70,000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, పవనవిద్యుత్ వ్యవస్థ కోసం మరో 15,000 నుంచి 20,000 చ.కి.మీ భూమి అవసరమౌతుంది. అంటే ఒక్క విద్యుత్తుకే మొత్తం భూభాగంలో 1.7 నుంచి 2.5 విస్తీర్ణం, అటవీయేతర భూభాగంలో దీన్ని 2,2 నుంచి 3.3 శాతంగా లెక్కగట్టారు. ఇది మంచిది కాదని, భూమ్యావరణ వ్యవస్థకు చేటని పర్యావరణవేత్తలంటున్నారు. ఆహారోత్పత్తిపైనా ప్రతికూల ప్రభావమే! బడా కార్పోరేట్ల స్పర్థలో భూసేకరణ, భూదురాక్రమణలు మళ్లీ వివాదాస్పదమనే అభిప్రాయం ఉంది.ఈ విషయంలో తగినంత కస రత్తు జరగాలని, భూవినియోగ విధానాలు సమగ్రంగా ఉండాలని ఆ సంస్థ సిఫారసు చేసింది. సౌరవిద్యుత్ పలకలు (ప్యానల్స్), పవన్ విద్యుత్ టవర్స్ ఏర్పాటు చేసే భూములు, సామాజికంగా-వ్యావసా యికంగా-పర్యావరణ పరంగా తక్కువ ప్రభావితమయ్యే ప్రాంతాలు, ప్రభుత్వ ఖాళీ, పోరంబోకు, గైరాన్ వంటి భూముల్ని ఎంపిక చేయాలి. గరిష్ట ప్రయోజనం-కనీస వివాదం ప్రాతిపదకగా ఉండాలనీ సూచించింది. పంట కాల్వలపైన, ప్రయివేటు-కృత్రిమ జలాశయాల పైన సౌరపలకలు ఏర్పాటు చేయడం మంచిదంటున్నా రు. ప్రధాని మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నపుడు, నీటిపారుదల ప్రాజెక్టు కాలువ లపై సౌరపలకలు ఏర్పాటు చేసిన నమూనాకు 'జాతీయ సోలార్ మిషన్'గా యూఎన్ స్థాయిలో ప్రచారం కల్పించారు. ఇపుడు దేశ వ్యాప్తంగా దాన్ని మరింత విస్తృతపరచవచ్చు. ఇళ్లు, ఇతర నివాస ప్రదేశాలు, కార్యాలయాలపైన (రూఫ్‌టాప్) కూడా ప్యానల్స్ ఏర్పాటు చేయడం సముచితమనే అభిప్రాయముంది. ఫ్రాన్స్‌లో ఒక దశలో, ప్రతి ఇంటి పైకప్పునూ అయితే హరితంతో లేదా సౌరపలకలతో గానీ కప్పి ఉంచేట్టు ఇచ్చిన ఆదేశాలు ఫలితమిచ్చాయి.పెట్రోలియం ధరలు అంతర్జాతీ య మార్కెట్లో వేగంగా పెరుగు తున్నాయి. బ్యారెల్ క్రూడ్ 90 డాలర్లకు చేరనుం దని వార్తలొస్తు న్నాయి. భారత్, 85 శాతం

# మనిషి సమాచార దాహం తీర్చిన అద్భుత ప్రయాణం!



మానవ నాగరికత పురోగమనంలో సమాచారం ఒక కీలకమైన శక్తి. నేటి ప్రపంచాన్ని సమాచార సాంకేతికత శాసిస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఒకప్పుడు పావురాలతో, ఆ తర్వాత ఉత్తరాలతో సమాచారం పంచుకున్న మనం టెలికాం రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులతో ప్రపంచాన్ని అరచేతిలో చూస్తున్నాం. ఈ అద్భుతమైన ప్రయాణాన్ని ఒక్కసారి గుర్తు చేసుకుందాం !

1837లో శామ్యూల్ మోర్స్ టెలిగ్రాఫ్‌ను కనిపెట్టడంతో సుదూర ప్రాంతాలకు సమాచారం చేరవేయడానికి ఒక కొత్త శకం మొదలైంది. మోర్స్ కోడ్ ద్వారా విద్యుత్ సంకేతాలను ప్రసారం చేయడం ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌కు నాంది పలికింది. ఇదే రేడియో కమ్యూనికేషన్‌కు పునాది వేసింది. ఆ తర్వాత 1876లో అలెగ్జాండర్ గ్రాహం బెల్ టెలిఫోన్‌ను కనుగొనడంతో మనుషులు నేరుగా మాట్లాడుకునే అవకాశం వచ్చింది. 1969లో ఇంటర్నెట్‌కు పూర్వగామి అయిన అర్పానెట్ పరిశోధనల కోసం కంప్యూటర్లను అనుసంధానించడానికి ఏర్పాటైంది. 1973లో మార్టిన్ కూపర్ మొబైల్ ఫోన్ కాల్‌ను పరిచయం చేయడంతో కమ్యూనికేషన్ మరింత వ్యక్తిగతమైంది. 70వ దశకంలో మొబైల్ ఫోన్‌లు అందుబాటులోకి రావడం ఒక సంచలనం. 1990లో టిమ్ బెర్నర్స్-లీ వరల్డ్ వైడ్ వెబ్‌ను కనుగొనడంతో ఇంటర్నెట్ సామాన్యులకు సైతం చేరువైంది. 2004లో ఫేస్‌బుక్ ప్రారంభించబడటం సోషల్ మీడియా కమ్యూనికేషన్ యుగానికి దారితీసింది. 2007 తర్వాత స్మార్ట్‌ఫోన్‌ల ఆవిష్కరణ వైర్‌లెస్ కమ్యూనికేషన్‌ను మరింత వ్యక్తిగతం చేసింది. అదే ఏడాది ఆపిల్ ఐఫోన్‌ను విడుదల చేయడంతో కమ్యూనికేషన్, కంప్యూటింగ్, వినోదం ఒకే పరికరంలో అందుబాటులోకి వచ్చాయి. నేడు కృత్రిమ మేధస్సు, వర్చువల్ రియాలిటీ వంటి అత్యాధునిక సాంకేతికతలు సమాచార సాంకేతిక భవిష్యత్తును మరింతగా మారుస్తున్నాయి. సాంకేతికతలు వేగంగా అభివృద్ధి చెందుతుండటంతో 21వ శతాబ్దపు కమ్యూనికేషన్ గతంలో ఎన్నడూ లేనంతగా విస్తరించింది.

**ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవం - డిజిటల్ సమానత్వం కోసం ఒక పిలుపు:**

ప్రతి సంవత్సరం మే 17న మనం ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవాన్ని జరుపుకుంటాం. 1865 మే 17న ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ స్థాపన జ్ఞాపకార్థం ఈ రోజును పాటిస్తున్నాం. ఇంటర్నెట్, కొత్త టెక్నాలజీ తీసుకువచ్చిన సామాజిక మార్పులపై అవగాహన పెంచడం, ప్రాంతాల మధ్య డిజిటల్ అంతరాన్ని తగ్గించడం ఈ రోజు యొక్క ముఖ్య లక్ష్యాలు. 2025 ఇతివృత్తంగా 'డిజిటల్ పరివర్తనలో లింగ సమానత్వం' తీసుకోవడం జరిగింది. ఇంటర్నెట్, డిజిటల్ పరికరాల ప్రాప్యత, స్థోమతలో అంతరాలు, పరిమిత డిజిటల్ నైపుణ్యాల వల్ల నేటి ఆర్థిక వ్యవస్థలో రేపటి డిజిటల్ పరిష్కారాలను రూపొందించడంలో మహిళలు, బాలికల భాగస్వామ్యం పరిమితమవుతోంది. ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణ, స్థిరమైన అభివృద్ధికి కొత్త మార్గాలను తెరవడానికి ఈ అంతరాన్ని తగ్గించడం చాలా అవసరం అని ఈ థీమ్ తెలియజేస్తుంది.

**ఇండియాలో టెలికాం అభివృద్ధి - ఒక శక్తివంతమైన నెట్‌వర్క్:**

ప్రపంచ దేశాలలో చైనా తర్వాత 69.2 కోట్ల చందాదారులతో అతిపెద్ద టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్ కలిగిన రెండవ దేశం మన భారతదేశం. 2025 మార్చి 11న ట్రాయ్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2024 డిసెంబర్ 31 నాటికి మన దేశంలో 118.992 కోట్ల మంది ఫోన్



సౌకర్యం కలిగి ఉన్నారు. వీరిలో పట్టణ ప్రాంతాల్లో 66.337 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 52.656 కోట్లు ఉన్నారు. దేశవ్యాప్తంగా బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్షన్ల విషయానికి వస్తే, వైర్డ్ కనెక్షన్లు 4.119 కోట్లు, వైర్‌లెస్ కనెక్షన్లు 90.378 కోట్లతో కలిపి మొత్తం 94.496 కోట్ల బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో జియో 50.43%, ఎయిర్‌టెల్ 30.62%, వొడాఫోన్ ఐడియా 13.37%, బిఎస్ఎన్ఎల్ 3.74%, యెట్రియా 0.24%, ఇతరులు 1.60% మార్కెట్ వాటాను కలిగి ఉన్నారు. 2024 డిసెంబర్ చివరి నాటికి దేశంలో టెలిసాంద్రత 84.45%గా నమోదైంది.

**గత వైభవం - టెలికాం ప్రస్థానం మన దేశంలో:**

ఒకసారి మనం గతంలోకి తొంగి చూస్తే, ప్రొఫెసర్ యస్ పి చక్రవర్తి గారిని భారతీయ ఎలక్ట్రానిక్స్ టెలికమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ పితామహుడిగా చెప్పుకుంటాం. స్వాతంత్ర్యం రాకమునుపే టెలిగ్రాఫ్ పరిచయంతో మనదేశంలో టెలికమ్యూనికేషన్స్ ప్రారంభమయ్యాయి. 1850లో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కలకత్తా, డైమండ్ హార్బర్ మధ్య మొదటి ప్రయోగాత్మక విద్యుత్ టెలిగ్రాఫ్ లైన్‌ను తమ ఉపయోగం కోసం ప్రారంభించింది. 1873లో బొంబాయి, కలకత్తా మధ్య డ్యూప్లెక్స్ టెలిగ్రాఫీని ప్రవేశపెట్టారు. 1881లో ఇంగ్లాండ్‌కు చెందిన ఓరియంటల్ టెలిఫోన్ కంపెనీ లిమిటెడ్ కలకత్తా, బొంబాయి, మద్రాస్, అహ్మదాబాద్‌లలో టెలిఫోన్ ఎక్స్ఛేంజీలను తెరవడం ద్వారా దేశంలో మొదటి అధికారిక టెలిఫోన్ సేవలను ప్రారంభించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1948 నాటికి దేశం మొత్తం మీద కేవలం 80 వేల టెలిఫోన్ కనెక్షన్లు మాత్రమే ఉన్నాయి. 1971 నాటికి ఈ సంఖ్య 9.80 లక్షలకు చేరుకుంది. 80వ దశకంలో దేశీయ సమాచార ప్రసారాల కోసం మొదటి భూఉపగ్రహ స్టేషన్‌ను సోవియట్ యూనియన్ సహకారంతో సికింద్రాబాద్‌లో ట్రోపోస్కాటర్ సిస్టమ్ లింక్ ప్రారంభించబడింది.

**సరళీకరణ - సంస్కరణల ఊతం:**

1981లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ టెలికాం రంగంలో సరళీకరణ తీసుకురావడానికి ప్రయత్నించినా, కొన్ని రాజకీయ కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. 1991 వచ్చేసరికి దేశంలో 50.7 లక్షల టెలిఫోన్లు ఉన్నాయి. కానీ, 90వ దశకంలో పి.వి. నరసింహారావు గారి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలతో ఈ రంగం ఒక్కసారిగా ఊపందుకుంది. 1994లో వచ్చిన నేషనల్ టెలికమ్యూనికేషన్స్ పాలసీతో దేశంలోని అన్ని గ్రామాలకు టెలికమ్యూనికేషన్ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. 1997లో అప్పటి ప్రభుత్వం ట్రాయ్‌ను ఏర్పాటు చేయడంతో విధాన రూపకల్పనలో, సుంకాలు నిర్ణయించడంలో ప్రభుత్వ జోక్యం తగ్గింది. 1995లో వాణిజ్యేతర ప్రాతిపదికన మొదటి మొబైల్ టెలిఫోన్ సేవను, పబ్లిక్ కమర్షియల్ ఇంటర్నెట్ సదుపాయాన్ని టాటా కమ్యూనికేషన్స్ ప్రారంభించింది. ఆ తర్వాత వచ్చిన సాంకేతిక మార్పులతో 2జి, 3జి, 4జి, 5జి లతో మనం దూసుకుపోతున్నాం. ఇప్పుడు ఆరవ తరం కోసం పరిశోధనలు జరుగుతున్నాయి.

సాంకేతికతలు వేగంగా అభివృద్ధి చెందుతున్నందున 21వ శతాబ్దపు కమ్యూనికేషన్ గతంలో ఎన్నడూ లేనంతగా విస్తరించింది.

**సామాజిక ఆర్థికాభివృద్ధికి టెలికాం వారధి:**

టెలికమ్యూనికేషన్ భారతదేశ సామాజిక ఆర్థికాభివృద్ధికి ఎంతో మద్దతునిచ్చింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న డిజిటల్ అంతరాన్ని కొంతవరకు తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషించింది. భారతదేశంలో ఈ-గవర్నెన్స్‌ను ప్రవేశపెట్టడం ద్వారా పాలనలో పారదర్శకతను పెంచడానికి కూడా ఇది సహాయపడింది. అంతేకాకుండా, భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం సామూహిక విద్యా కార్యక్రమాలను అందించడానికి ప్రభుత్వం ఆధునిక టెలికమ్యూనికేషన్ సౌకర్యాలను సమర్థవంతంగా ఉపయోగించింది. టెలికాం రంగంలో మనం సాధించిన ఈ అద్భుతమైన ప్రగతిని కొనసాగిస్తూ, డిజిటల్ సమానత్వం సాధించే దిశగా మరింత కృషి చేద్దాం!

**జనక మోహన రావు దుంగ**
**యం.ఎస్సీ ( ఫిజిక్స్ )8247045230**

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపా నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దాని సైద్ధాంతిక భూమిక అయిన ఆర్ఎస్ఎస్ ఆదేశాల ప్రకారం పరిపాలన సాగిస్తున్నది. 2019లో రెండవసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ అనేక ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేయటమే కాకుండా, దానికనుగుణంగా చట్టాలను రూపొందిస్తూ వస్తున్నది. మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు రాష్ట్ర ప్రభుత్వాల అధికారాల్ని హరించి వస్తువుల సర్వీసుల పన్ను (జిఎస్టి)చట్టాన్ని తీసుకొచ్చింది. జీఎస్టీ చట్టం మూలమున రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు మున్సిపాలిటీ స్థాయికి దిగజారిపోయాయి. భారత రాజ్యాంగంలో చెప్పిన ఫెడరల్ స్ఫూర్తి కి భిన్నంగా ఈ చట్టం ఉన్నది. ఆ తరువాత రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసత్వ సవరణ చట్టాన్ని( సి ఏ ఏ), జాతీయ పౌరసత్వ పట్టిక (ఎన్ ఆర్ సి) బిల్లును తీసుకొచ్చింది. అదే విధంగా భారత రాజ్యాంగంలో కాశ్మీర్ కు ఇచ్చినటువంటి స్వయం ప్రతిపత్తి 370, 35%ఒ% ఆర్టికల్స్ ను రద్దు చేసింది. భారతదేశంలో ఇస్లాం ఫోబియోని రెచ్చగొట్టి మైనార్టీ ముస్లింలపై దారుణ మారణకాండ జరపటం దాని ఉద్దేశం. 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన మరుసటి దినం ఆర్ఎస్ఎస్ అధినేతలు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పడిన భారత రాజ్యాంగాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, భారత రాజ్యాంగం గా మనస్మృతి ఉండాలని, అదే తమ అభిమతం అని వారు ఉద్ఘాటించారు. భారత రాజ్యాంగ ప్రవేశికలో చెప్పినట్లుగా భారతదేశం సర్వసత్తాక, సామ్యవాద , ప్రజాతంత్ర, లౌకిక, గణతంత్ర రాజ్యంగా తాము ఒప్పుకోవటం లేదని వారు అనేక సందర్భాల్లో ఘంటాపదంగా చెప్పారు. ఒకే దేశం, ఒకే ప్రజా, ఒకే చట్టం పేరుతో భారతదేశాన్ని హిందూ దేశంగా లేదా హిందూ రాజ్యంగా ఏర్పడాలని ఆర్ఎస్ఎస్ ఉద్దేశమని వారు పదే పదే చెప్పారు. పూర్వం "జనసంఘ్" రాజకీయ పార్టీయే నేటి "భారతీయ జనతా పార్టీ".

భారతీయ జనతా పార్టీ దానికి అనుగుణంగా పరిపాలన సాగిస్తూ వస్తున్నది. 1991లో పీవీ నరసింహారావు నేతృత్వంలో తీసుకొచ్చిన లిబరైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్ పి జి) నయా ఉదారవాద విధానాలు భాజపా ప్రభుత్వం మరింతగా అమలు చేస్తున్నది. అంబానీ ,ఆదాని లాంటి ఆశ్రితపక్షపాతులకు దేశ సంపదను అప్పజెప్పటానికి మొత్తం ప్రభుత్వ రంగ పరిశ్రమలన్నిటిని ప్రైవేటీకరణకు పూనుకున్నది. అందుకనుగుణంగా అనేక చట్టాలను మారుస్తూ వస్తున్నది. అందులో భాగంగానే మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకొచ్చి మొత్తం వ్యవసాయ ఉత్పత్తులన్నిటిని అంబానీ ,ఆదానీలకు వ్యాపార సరుకుగా వేయటానికి పూనుకున్నది. దీనిని భారతదేశ రైతాంగం, ప్రధానంగా ఉత్తర భారత రైతాంగం ముందు భాగాన నిలబడి దేశ రాజధాని ఢిల్లీ నగరంలో తిష్ట వేసుకుని ఆ చట్టాలను వెనక్కి తీసుకునేంతవరకు సంవత్సర కాలము పైగా దీర్ఘకాలం పోరాటం చేశారు. సందర్భంలో రైతు సంఘాలతో చేసుకున్న ఒడంబడికను నేటి వరకు అమలు చేయలేదు.

అదే సమయంలో 29 కార్మిక చట్టాలను రద్దు పరుస్తూ నాలుగు లేబర్ కోడులను 2020 సంవత్సరంలో తీసుకొచ్చారు. ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ నాటి నుండి నేటి వరకు కేంద్ర కార్మిక సంఘాల నాయకత్వాన, వామపక్ష పార్టీల నాయకత్వాన సుదీర్ఘమైన పోరాటం చేస్తూ ఉన్నారు. పీవీ నరసింహారావు తీసుకొచ్చిన నయా ఉదారవాద విధానాల నుండి నేటి వరకు 19 సార్లు దేశవ్యాప్త సమ్మెలు జరిగాయి. కార్మిక వ్యతిరేక లేబర్ కోడులు కు వ్యతిరేకంగా మూడు సార్వత్రిక సమ్మెలు జరిగాయి. అయినా ఆశ్రితపక్షపాత పెట్టుబడిదారులకు (క్రోనీ క్యాపిటల్ లిస్టులకు) ప్రభుత్వ రంగ పరిశ్రమలను జాతి సంపదను అప్పజెప్పటమే కాకుండా దానికనుగుణంగా గత 100 సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు పరచాలని దుష్టతలంపుతో 29 చట్టాలను రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్లను తయారు చేసింది.

2019 వేతనాల కోడ్ అమలులోకి వస్తే జాతీయ కనీస వేతనం పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలు (పేమెంట్ ఆఫ్ వేజెస్) వేతనాలు నిర్ణయించే అధికారాన్ని కోల్పోతాయి. కనీస వేతనాలు (మినిమం వేజెస్) రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో అమలయ్యే అవకాశం ఉండదు. ఓవర్ టైం చేసినందుకు కానీ, సమాన పనికి సమాన వేతనం గాని కోరే హక్కును కార్మిక వర్గం కోల్పోతుంది.

2020 పారిశ్రామిక సంబంధాల కోడ్ అమలులోకి వస్తే సమ్మె హక్కు కొరకు కార్మిక వర్గం చాలా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ కోడ్ లో కార్మికులు సమ్మె చేయటానికి అనేక ఆటంకాలు కల్పించారు. 100 మంది కన్నా తక్కువ కార్మిక సంస్థల్లో పని చేస్తుంటే వారిని పైనుండి తొలగించటం సులభతరం అవుతుంది. పరిశ్రమల్లో కార్మిక సంఘాల ఏర్పాటు కష్ట భూయిష్టమవుతుంది.

2020 వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ వల్ల పది మంది కంటే తక్కువ కార్మికులు పనిచేసే కంపెనీలలో కార్మికుల ప్రాణాలకు భద్రత ఉండదు. కాంట్రాక్ట్ కార్మికులు రక్షణ కోల్పోతారు. గిగ్ ,ఫ్లాట్, ఫారం, కార్మికుల రక్షణపై సరైన నిబంధనలు రూపొందించ లేనందున వారికి రక్షణ కరువవుతుంది.

2020 సామాజిక భద్రత కోడ్ అమలులోకి వస్తే ఎవరికైనా ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చే అవకాశం వస్తుంది. అందువల్ల యాజమాన్యం ఈఎస్ఐ, పీఎఫ్ లు, గ్రాడ్యుటి కవరేజ్ లేకుండా ఉంటుంది. కార్మికులకు ఏ అవకాశం ఉండదు. కేంద్ర ప్రభుత్వంలో పనిచేసే కోటి మంది పైబడిన స్కీము వర్కర్లకి ఈ కోడ్ వల్ల ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది.

స్థలాభావం వల్ల అన్ని విషయాలను ఇక్కడ చెప్పటం సాధ్యపడటం లేదు.

కావున కార్మికులు ఈ క్రింది ప్రధాన డిమాండ్ల అమల కొరకు పోరాడాల వలసిందిగా ట్రేడ్ యూనియన్ సెం టర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ ) యావత్ కార్మిక లోకానికి ,ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నది.

1. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయడానికి పోరాడండి!
2. కనీస రోజు వారి వేతనాలు ?1000 రూపాయలు నెలవారీ వేతనాలు ?31,000 రూపాయలు కోసం పోరాడండి!
3. కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను రద్దు చేయడానికి పోరాడండి!
4. 8 గంటల ప్రామాణిక పని గంటల కోసం పోరాడండి!
5. సామ్రాజ్యవాద నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి!
6. ఆర్ఎస్ఎస్ ఫాసిస్టుల హిందూ రాజ్యాన్ని ఓడించండి!
7. మతం, కులం, ప్రాంతీయత, పేరుతో కార్మికుల విభజనను వ్యతిరేకించండి!

**మన్నవ హరిప్రసాద్, కన్వీనర్,**
ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ), ఆంధ్రప్రదేశ్ కమిటీ., 82477 28296

# విశ్వశక్తి

భక్తి

శాశ్వతమైన ఉనికి 'సత్'. ఆ ఉనికి స్వభావమైన చైతన్యమే 'చిత్'. ఈ రెండూ ఒకే వస్తువు లక్షణాలు. ఇదే వస్తువును 'పరబ్రహ్మ' అంటుంది వేదం. ఈ బ్రహ్మం ఆనంద స్వరూపంగా ఉంటుంది. అందుకే పరబ్రహ్మను రుషులు 'సచ్చిదానందం'గా భావిస్తారు.

ఈ అనంత విశ్వానికి సచ్చిదానంద తత్వమే కారణం. ఇది విశ్వవ్యాపకమైనది. శక్తి అంటే ఇదే! ఈ సచ్చిదానంద శక్తిని మహర్షులు 'జగదంబ'గా సాక్షాత్కరింపజేసుకున్నారు. విశ్వవ్యాపకమైన, విశ్వాతీతమైన మహాశక్తి ఇది. వేదాల్లో, ఆగమాల్లో (మంత్ర శాస్త్రాలు), పురాణాల్లో ఇది బహురూపాలుగా ప్రతిపాదితమైంది.విశ్వంలో నిండిన శబ్దమయ నాదశక్తి- బ్రాహ్మీ. జగత్ వ్యాపక మహాతరంగాల చైతన్యం- వైష్ణవి. కర్మానుగుణంగా జీవులను నిర్వహించే శాసక శక్తి- మాహేశ్వరి. జ్ఞానస్వరూపం- కౌమారి. అలాగే అన్నశక్తి- వారాహి. బలప్రదాయకమై శిష్టరక్షణ దుష్టశిక్షణ నిర్వర్తించే మహాశక్తి- ఇంద్రాణి. సంసార లంపటత్వాన్ని నిర్మూలించే తత్వరూప మోక్షశక్తిని 'చాముండా'గా ఆరాధిస్తారు. ఇవన్నీ సప్త మాతృకా స్వరూపాలు, విశ్వవ్యాపక మహాచైతన్యానికి సంబంధించిన విభిన్న రూపాలు. వీటన్నింటినీ సనాతన ధర్మం 'ఉపాసనా మూర్తులు'గా ఆవిష్కరించింది. అనంతాకాశంలో సహజమైన నీలిమ, అంధకారం కాళీదేవిగా గోచరిస్తాయి. అంతరిక్షంలోని జ్యోతిఃస్వరూపాల కాంతితత్వమే గౌరీ దేవి (ప్రకాశ స్వరూపిణి). గగనాల్లో భువనాల్లో నిండిన సౌందర్య శోభాశక్తి 'లక్ష్మి'గా వెలుగులీనుతుంది. బుద్ధుల్లో భాసించే విద్యారూపిణి 'సరస్వతి'గా ప్రత్యక్షమవుతుంది. ఆకాశ శక్తిని 'భువనేశ్వరి'గా భావిస్తారు. కాలశక్తిని 'కాళి'గా, మూడు కాలాల ముల్లోకాల వ్యాపక శాసక శక్తిని 'త్రిపుర'గా- మరికొన్ని ఆగమాలు వర్ణించాయి.నిగమ (వేద), ఆగమాల వర్ణనల్ని, దృక్కోణాల్ని సమన్వయపరచింది పురాణం. అది దేవీరూప, మంత్ర, ఆరాధన, లీలా కథల్ని అద్భుతంగా ఆవిష్కరించింది. బహురూపాలుగా ఉన్న ఆ ఏక శక్తిని ఆదిశక్తిగా ఉపాసించే విధానాలున్నాయి. వాటిలో శరన్నవరాత్రులకు అత్యంత ప్రాధాన్యముంది. ఆదిశక్తి పలు రూపాలు. కాలాల పరిణామాల్ని అనుసరించి, సనాతన ధర్మంలో అనేక పండుగలు కనిపిస్తాయి. వీటిలో- ఆయా కాలాల్లో జరిగే ప్రకృతి పరిణామాలు, జ్యోతిర్మండలాల ప్రభావాల మార్పులు ప్రతిఫలిస్తాయి.

క్షేమకారక రక్షణ శక్తిగా విశ్వమాతను ఆరాధించే సందర్భమే- ఆశ్వయుజ నవరాత్రుల మహా పర్వం. పూర్ణత్వానికి సంకేతంగా 'నవ'సంఖ్యతో దేవీపూజల్ని ఆచరించే తొమ్మిదిరోజుల పండుగ ఇది. ఈ పండుగకు జ్యోతిర్విజ్ఞాన, ఉపాసన, ఆధ్యాత్మిక ప్రాధాన్యాలు ఉన్నాయి. వీటికి విభిన్న జీవన రీతుల సంస్కృతీ సంప్రదాయాల శోభలూ జత కలిసి, దేశవ్యాప్త మహాపర్వ ప్రాముఖ్యం సంతరించు కుంది. అంతరంగ, బహిరంగ ప్రతికూల శక్తుల్ని జయించే ఆనందకర దివ్య శక్తుల విజయోత్సాహం ఇది. ఇదే దసరా మహోత్సవాల ప్రధాన లక్షణం, లక్ష్యం. సర్వ దేవతల సమాహార మూర్తిగా, సకల శక్తుల సమన్వయ దీప్తిగా మహాశక్తిని పూజిస్తారు. స్త్రీరూపంగా సంభావించి సమర్చన చేయడం ఒక గణనీయ విశిష్టాంశం.ప్రతి స్త్రీమూర్తినీ పరాశక్తి కళగా గౌరవించాలనే భావం బాల, కుమారి, సువాసినీ పూజల్లో కనిపిస్తుంది. కలశంలో, యంత్రంలో, విగ్రహాల్లో, హోమగుండాల్లో 'లోకాల తల్లి'ని ఆవహింపజేసి ఆరాధిస్తారు. స్త్రీమూర్తిలో దేవిని దర్శించి పూజిస్తే గాని పూర్ణం కాని పండుగ ఇది!



## మెడనొప్పికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈ మెడ నొప్పి ప్రధానంగా ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగిస్తున్నప్పుడు కలిగే ఇబ్బంది. అదే పనిగా నరాలను ఒత్తిడికి గురి చేయడం వల్ల కూడా దీర్ఘకాలిక మెడ నొప్పిగా మారుతుంది. దీనికి ప్రధాన కారణాలు, నివారణలు తెలుసుకుందాం.మెడనొప్పికి కారణాలు..సరైన భంగిమలో వెన్నుముకను ఉంచకపోవడం, సరైన భంగిమలో కూర్చోకపోవడం, కీళ్లవాపు, హెర్నియేటెడ్ డిస్క్ వంటి సమస్యలు మెడనొప్పికి ప్రధాన కారణాలు.టెక్ నెక్ సమస్య వల్ల..టెక్ నెక్ సమస్య ఎక్కువగా ఉంటే వెన్నుముక మీద ఒత్తిడి కండరాల అమరికను మార్చుతుంది. మెడ, భుజాలపై పెరిగే ఒత్తిడి భుజం నొప్పి, నడుము నొప్పి, చేతుల్లో తిమ్మిరి, లేదా జలదరింపుకు అసౌకర్యానికి కారణం అవుతుంది. దీనితో పాటు వంటి సమస్యలకు కారణం కావచ్చు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే..ఫోన్ లేదా టాబ్లెట్ ఉపయోగిస్తుంటే మాత్రం ఎప్పుడూ అవి కంటి స్థాయిలో ఉండేలా చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల మెడ నొప్పి వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది.

ఎర్గోనామిక్ సెటప్..కంప్యూటర్‌లో పని చేస్తున్నప్పుడు మానిటర్ స్క్రీన్‌ను చేయి పొడవు దూరంలో ఉండేలా చూసుకోవాలి.

విరామాలు అవసరం..మెడ వెనుక కండరాలు రిలాక్స్ కావాలంటే క్రమం తప్పకుండా విరామాలు తీసుకోవాలి. ఈ సమయంలో మెడను అటు ఇటు తిప్పడం కూడా మంచి వ్యాయామం.

వర్క్ స్పేస్..పనిచేసే చోట కూర్చునే విధానంలో కూడా జాగ్రత్తలు అవసరం. సరైన భంగిమలో కూర్చోనట్లయితే వెన్ను నొప్పి, మెడ నొప్పి వచ్చేందుకు అవకాశం ఉంటుంది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్
శనివారం
17 । మే । 2025

# లాభాల విరిబాల

'నాకు నచ్చిందే చేస్తాను' అంటుంటారు చాలామంది. కానీ, పరిస్థితులకు తలొగ్గి వచ్చిన ఉద్యోగంలో కుదురుకుంటారు. అమెరికాకు చెందిన వియన్నా హింట్జ్ కూడా అలాగే అనుకుంది. కానీ, పరిస్థితులు ఆమెను ఉద్యోగినిగా మార్చేశాయి. మనసు చంపుకొని కొన్నాళ్లు విధులు నిర్వర్తించింది. కానీ, ఏదో వెలితి. అసంతృప్తితో రోజులు భారంగా గడవసాగాయి. ఇక లాభం లేదనుకొని ఓ మానసిక వైద్యుణ్ని కలిసింది. హింట్జ్ కథంతా విని 'ఉద్యోగం మానేసి.. నీకు నచ్చిన వ్యాపారం చేస్తే గానీ, నీ మానసిక స్థితి బాగుపడదు' అని హెచ్చరించాడు. మార్కెటింగ్ అండ్ అడ్వర్టయిజ్‌మెంట్



రంగంలో చేస్తున్న ఉద్యోగానికి తక్షణం రాజీనామా చేసింది హింట్జ్.

చిన్నప్పటి నుంచి ఆమెకు పూలంటే వల్లమాలిన ప్రేమ. విరిబాలలను చూడగానే ఆమె ముఖం వికసించేది. తనకు కావాల్సిన ఆనందం పూదోటలో ఉందని నిశ్చయానికి వచ్చింది. పూల వ్యాపారం మొదలుపెట్టింది. పూలున్న చోటే ముళ్లూ ఉంటాయి కదా! కోటి ఆశలతో కుసుమాలు తాకగానే.. ఆమెకు ముళ్లు గుచ్చుకున్నాయి. మొదటి ఆరు నెలలు వరుసగా నష్టాలే ఎదురయ్యాయి.

అయినా ఆమె పట్టుదల ఆవిరి కాలేదు. కొమ్మకు పూసిన పూలన్నీ.. పూజకు అంకితం కాలేవుగా! అలాగే ఆమె వ్యాపారం కూడా మొదట్లో ఒడుదొడుకులకు గురైంది.ఇష్టమున్న చోట కష్టాలు ఎంతకాలం ఉంటాయి? హింట్జ్ విషయంలోనూ అదే జరిగింది. మరింత ధైర్యంగా ముందడుగు వేసింది. పూల పరిమళాలు ఒకే చోట ఉంటే లాభం లేదనుకుంది. ఓల్డ్ ట్రక్ ఒకటి కొనుగోలు చేసింది. దానికి 'మెయిన్ స్ట్రీట్' అని పేరుపెట్టింది. బండి నిండా విరులు నింపింది. నచ్చిన దోవలకు ఆ పూలతావిని మోసుకెళ్లింది. సీజనల్ పూలు గంపలు గంపలు తీసుకెళ్లింది. రెండు నెలలు గడిచాయి.. హింట్జ్ పూల రథం ఎప్పుడొస్తుందా అని అందరూ ఎదురుచూసే పరిస్థితి వచ్చింది.

ఎగబడి ఆమె దగ్గర పూలు కొనుగోలు చేయడం మొదలైంది. వాడిన తరులు వికసించినట్టు హింట్జ్ వ్యాపారానికి వసంతం వచ్చింది. ఇబ్బడిముబ్బడిగా అమ్మకాలు కొనసాగాయి. నెల తిరిగేసరికి గల్లాపెట్టెలో పదమూడు లక్షల రూపాయల లెక్క తేలింది. మూడు నెలల్లో ఏకంగా అరకోటి దాకా ఆర్జించింది. మొత్తానికి మనసు చంపుకొని చేసిన కార్పొరేట్ ఉద్యోగానికి చరమగీతం పాడటమే.. తన విజయానికి శంఖారావం అంటున్నదామె. ఉద్యోగార్జితం కన్నా రెండింతలు సంపాదిస్తూ యంగ్ ఆంత్రప్రెన్యూర్లకు ఆదర్శంగా నిలిచింది వియన్నా హింట్జ్. తెలిసిన వాళ్లంతా ఆమెను లాభాల విరి'బాల' అని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

# నేచురల్ హెయిర్ కలర్స్



హెయిర్‌డైస్ వేసుకున్నప్పుడు అవి జుట్టుకు సరిపడకపోవడం, కేశాల సహజమైన కాంతి కోల్పోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతుంటాయి. వీటికి విరుగుడుగా శిరోజాలకు ఆరోగ్యాన్ని, సహజమైన రంగును ఇచ్చేవి ఉన్నాయి. వాటిలో...

బ్రౌన్ కలర్ రావాలంటే...

టేబుల్ స్పూన్ కాఫీ గింజలు లేదా పొడిని కప్పు నీటిలో వేసి బాగా మరిగించి 20 నిమిషాల సేపు చల్లారనివ్వాలి. జుట్టు కాస్త నలుపు రంగు రావాలంటే కాఫీ డికాషన్‌లో పావు టీ స్పూన్ లవంగాల పొడిని కూడా కలిపి మరిగించాలి. ఈ డికాషన్‌ని వడకట్టి, తలకు షాంపూతో స్నానం చేశాక ఈ మిశ్రమాన్ని జుట్టుకంతా పట్టించాలి. 20 నిమిషాల తర్వాత జుట్టును కడిగేసుకోవాలి. ఇలా వారానికి రెండు సార్లు చేస్తే జుట్టు రంగు, ఆరోగ్యం మెరుగుపడుతుంది. డైస్ వాడకం వల్ల కేశాలకు కలిగే హాని కూడా తగ్గుతుంది.

బీట్‌రూట్‌ను పేస్ట్ చేసి, నీళ్లలో కలిపి మరిగించాలి. చల్లారిన తర్వాత వడకట్టిన నీటిని రాత్రి పడుకోబోయేముందు మాడుకు పట్టించి, వేళ్లతో మసాజ్ చేసుకోవాలి. మరుసటిరోజు ఉదయం తలస్నానం చేయాలి. వారానికి రెండు సార్లు ఇలా చేస్తూ ఉంటే కురులకు కొద్దిగా పర్పుల్ కలర్ వస్తుంది. హెయిర్ కలర్స్ వాడే యువతరపు జుట్టుకు ఇది మంచి ఆప్షన్. చుండ్రు సమస్య కూడా తగ్గిపోతుంది.ముదురు రంగు బంతిపూలను రెండు కప్పుల నీళ్లలో వేసి, కప్పు మిశ్రమం అయ్యేవరకు మరిగించాలి. ఈ నీటిని మాడునుంచి శిరోజాలకు పూర్తిగా పట్టించాలి. గంట తర్వాత శుభ్రపరుచుకోవాలి. తలలో అక్కడక్కడా తెల్లబడిన వెంట్రుకలు ఎర్రగా అవుతాయి. డై వాడేవారి జుట్టు పొడిబారి వెంట్రుకలు బిరుసు అవుతుంటాయి. నివారణకు టేబుల్ స్పూన్ పెరుగులో పెసరపిండి కలిపి, రోజంతా అలాగే ఉంచాలి. తర్వాత రోజు మిశ్రమాన్ని మాడుకు, శిరోజాలకు పట్టించి, గంట తర్వాత తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తే హెయిర్ డై/కలర్‌లలో ఉండే రసాయనాల ప్రభావం తగ్గడమే కాకుండా వెంట్రుకలు మృదువుగా అవుతాయి.


## కూరగాయలతో పచ్చడి



**కావల్సినవి:** క్యారెట్, క్యాప్సికం, ఉల్లిపాయ - ఒక్కోటి చొప్పున, క్యాబేజీ తరుగు - రెండు పెద్ద చెంచాలు, పచ్చిమిర్చి - ఐదు, వెల్లుల్లి తరుగు - పెద్ద చెంచా, ఆవనూనె - పావుకప్పు, ఉప్పు- తగినంత, ఆవపిండి - రెండు చెంచాలు, ఎండుమిర్చి - మూడు, నిమ్మకాయ - ఒకటి, ఆవాలు - చెంచా. తయారీ: క్యారెట్, క్యాప్సికం, ఉల్లిపాయని సన్నగా తరిగి ఈ ముక్కలకు క్యాబేజీ కూడా కలపాలి. వీటిపై ఆవపిండీ, తగినంత ఉప్పూ వేసి మరోసారి కలపాలి. తరవాత నిలువుగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడిచేసి ఆవాలూ, ఎండుమిర్చీ, వెల్లుల్లి ముక్కలు వేయించి.. ఈ కూరముక్కలపై వేయాలి. చివరగా నిమ్మరసం కలిపితే చాలు. ఇందులో పచ్చిమిర్చి వేస్తాం కాబట్టి కారం అవసరంలేదు.

# అందానికి ఆజ్యం

భారతీయుల ఆహారంలో నెయ్యికి ఉన్న ప్రాధాన్యం తెలిసిందే. ఆరాధనలోనూ నెయ్యికి అగ్రాసనమే. ఆజ్యం, ఘృతం దీనికి పర్యాయపదాలు. మనం ఇష్టంగా ఆరగించే నెయ్యిలో ఫ్యాటీ ఆమ్లాలు, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఈ కారణంగానే దీన్ని వందల ఏండ్లుగా భారతీయ సంప్రదాయ సౌందర్య సాధనాల్లో విరివిగా ఉపయోగిస్తున్నారు. ఆజ్యం అందం పెరగడానికీ ఉపకరిస్తుందన్నమాట!



**మాయిశ్చరైజర్‌గా**

నెయ్యి చర్మానికి సహజ మాయిశ్చరైజర్‌గా ఉపయోగపడుతుంది. ఇందులో ఉన్న ఫ్యాటీ ఆమ్లాలు పొడిబారిన చర్మానికి పోషణనిస్తాయి. తేమనిస్తాయి. కొంచెం నెయ్యి తీసుకుని ముఖానికి, శరీరానికి సున్నితంగా మర్దనా చేస్తే సరి. పొడిబారిన చర్మం మళ్లీ హైడ్రేట్ అయిపోతుంది.

**పెదవులకు పూతగా**

మృదువైన పెదవుల కోసం నెయ్యిని పల్చటి పొరలా పూసుకోవాలి. ఇలా చేస్తే పొలుసులు బారిన పెదవులకు హైడ్రేషన్ లభించి తేమతో ఉంటాయి.

**హెయిర్ కండిషనర్**

నెయ్యిని కొద్ది పరిమాణంలో తీసుకోవాలి. దాన్ని గోరువెచ్చగా వేడిచేయాలి. మాడు, వెంట్రుకలకు పట్టించి ఓ గంటపాటు ఉండనివ్వాలి. తర్వాత షాంపూతో కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కురులకు, మాడుకు మంచి పోషణ లభిస్తుంది. వెంట్రుకలు మృదువుగా, మెరుస్తూ ఉంటాయి.

**వయసు పెరుగుదలకు అడ్డుకట్ట**

నెయ్యిలోని యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్య ఛాయలతో పోరాడతాయి. నెయ్యిని పూసుకొంటే ముఖం మీద ముడతలు, గీతలు తగ్గిపోతాయి.

**కంటికింద వలయాలు**

కండ్ల కింద ఏర్పడే నల్లటి వలయాలు, చర్మం సాగుదలను అరికట్టాలంటే కొద్ది మొత్తంలో నెయ్యిని పడుకునే ముందు కండ్ల కింద రుద్దుకోవాలి.

**చర్మం పైపొరకు రక్షణగా..**

చర్మం పైపొర సంరక్షణలో, దాన్ని మృదువుగా ఉంచడంలోనూ నెయ్యి సహకరిస్తుంది.

**పాదాలకు మలాం**

పొడిబారిన, పగుళ్లిచ్చిన మడమలకు పడుకునే ముందు నెయ్యి రాసుకోవాలి. తర్వాత సాక్స్ వేసుకోవాలి. అలా రాత్రంతా ఉంచాలి. దీంతో మొండి చర్మం నుంచి ఉపశమనం లభిస్తుంది.

**మేకప్ రిమూవర్**

మేకప్ తొలగించుకోవడానికి నెయ్యి సహజమైన రిమూవర్‌గా పనికివస్తుంది. ముఖానికి నెయ్యిని ఐప్లై చేసి మేకప్ పోయేవరకు సున్నితంగా మర్దనా చేయాలి. తర్వాత గోరువెచ్చటి తడిగుడ్డతో తుడుచుకోవాలి. దీంతో చర్మం శుభ్రపడుతుంది. మాయిశ్చరైజ్ కూడా అవుతుంది.

# తిన్న ఆహారం జీర్ణం కాలేదా ? ఈ చిట్కాలు పాటించండి..!



తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే ఎవరికైనా ఇబ్బందిగానే ఉంటుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు అజీర్ణం కారణంగానే వస్తాయి. ఇవి వచ్చాయంటే ఎవరైనా మరిన్ని ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొందరికి జీర్ణాశయంలో మంట పుడుతుంది కూడా. ముఖ్యంగా పొట్ట పై భాగంలో ఇలా అనిపిస్తుంది. కొవ్వు పదార్థాలు, ఫ్రై చేయబడిన ఆహారం, ఇతర జంక్ ఫుడ్స్ తినడం కారణంగా ఎవరికైనా అజీర్ణ సమస్య వస్తుంది. అలాగే వేళ తప్పించి భోజనం చేయడం, మద్యపానం, ధూమపానం, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్ తదితర కారణాల వల్ల కూడా కొందరిలో అజీర్ణ సమస్య వస్తుంటుంది. అయితే కింద సూచించిన పలు చిట్కాలు పాటిస్తే అజీర్ణ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మరి ఆ చిట్కాలు ఏమిటో ఇప్పుడు చూద్దామా..!

1. అజీర్ణ సమస్యకు అల్లం చక్కని పరిష్కారాన్ని చూపుతుంది. ఒక గ్లాస్ నీటిలో కొద్దిగా అల్లం ముక్కలు వేసి ఆ నీటిని బాగా మరిగించాలి. అనంతరం అల్లంలో ఉండే సారం ఆ నీటిలోకి చేరుతుంది. అప్పుడు ఆ నీటిని వేడిగా ఉండగానే తాగేయాలి. ఇలా చేయడం వల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. అజీర్ణ సమస్య బాధించదు. అలాగే అల్లం ముక్కలను దంచి రసం తీసి ఆ రసాన్ని సేవించినా చాలు, సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.
2. ఒక గ్లాస్ నీటిలో కొద్దిగా బేకింగ్ సోడాను కలిపి తాగితే అజీర్ణ సమస్య బాధించదు. నీటికి బదులుగా తేనె, నిమ్మరసంలను కూడా ఉపయోగించవచ్చు.
3. ఒక గ్లాస్ నీటిలో 1 టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్‌ను కలిపి తాగితే అజీర్ణ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అవసరం అనుకుంటే ఆ మిశ్రమంలో తేనె కూడా కలుపుకోవచ్చు.
4. ఒక గ్లాస్ నీటిలో కొన్ని సోంపు గింజలను వేసి బాగా మరిగించాలి. అనంతరం ఆ





నీటిని వడకట్టి వేడిగా ఉండగానే తాగాలి. దీంతో ఆహారం త్వరగా జీర్ణమవుతుంది.
5. గుప్పెడు వాము తీసుకుని అందులో కొంత ఉప్పు వేసి బాగా నలిపి ఆ మిశ్రమాన్ని తినాలి. వెంటనే నీరు తాగాలి. దీంతో గ్యాస్, అసిడిటీ, అజీర్ణం తగ్గుతాయి.



## అమ్మకానికి భూములు.. రూ.1,000 కోట్ల నిధుల సమీకరణ

**ముంబై, నవభూమి):** పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయిన ప్రభుత్వ రంగ టెలికం సంస్థలు భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్), మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటీఎన్ఎల్) స్థిరీకరణకు.. వాటి భూములను అమ్మే దిశగా కేంద్ర ప్రభుత్వం వెళ్తున్నది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) దాదాపు రూ.1,000 కోట్ల విలువైన భూములను విక్రయించాలని చూస్తున్నట్టు సంబంధిత అధికారి ఒకరు చెప్తున్నారు. తద్వారా ఆయా సంస్థల రుణ భారాన్ని తగ్గించవచ్చని, వాటి ద్రవ్యలభ్యతను కూడా పెంచవచ్చని అంటున్నారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ప్రభుత్వ రంగ సంస్థల శాఖ (డీపీఈ) భూములను



గుర్తించగా.. వీటిని వీలైతే అమ్మడమో లేదా లీజుకు ఇవ్వడమో చేసే ఆలోచనలో మోదీ సర్కారు ఉన్నది. కాగా, బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌కు దేశంలోని ప్రధాన నగరాల్లో భూములుండగా.. 2-3 చోట్ల భూములను అమ్మకానికి తీసుకురాబోతున్నారు. ఈ ఏడాదిలోనే వీటిని అమ్మవచ్చని, రూ.1,000 కోట్లు రావచ్చని అంచనా. సర్కారీ వైఫల్యం ప్రభుత్వ సంస్థలే అయినప్పటికీ మార్కెట్‌లో ప్రైవేట్ రంగ కంపెనీలతో పోటీపడలేక బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ చతికిలపడ్డాయి. అయితే ఇందుకు కారణం కేంద్ర ప్రభుత్వ పెద్దలేనన్న విమర్శలు ఆయా సంస్థల ఉద్యోగ సంఘాలు, ఆర్థిక విశ్లేషకుల నుంచి గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రధానంగా స్పెక్ట్రం కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వకపోవడం చాలాచాలా నష్టపర్చిందన్న వాదనలున్నాయి. దీంతో ఏండ్ల తరబడి నెట్‌వర్క్‌ను విస్తరించలేక, సిగ్నలింగ్ లోపాలతో సబ్‌స్క్రైబర్లు దూరమైపోతున్నారు.

## డౌన్ ట్రెండ్‌లో బంగారం.. క్రమేణా తగ్గుముఖం పడుతున్న గోల్డ్ ధరలు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ మార్కెట్‌లో బంగారానికి గిరాకీ సన్నగిల్లిందా? అంటే.. అవునన్నట్టుగానే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతకొద్దిరోజులుగా పసిడి ధరలు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతుండటమే ఇందుకు నిదర్శనం. ఈ క్రమంలోనే దేశ రాజధాని ఢిల్లీలో రెండు రోజుల్లోనే పుత్తడి రేటు దాదాపు రెండున్నర వేల రూపాయలు పడిపోయింది. గురువారం 24 క్యారెట్ తులం విలువ రూ.1,800 దిగజారి రూ.95,050కి పరిమితమైంది. బుధవారం కూడా రూ.650 క్షీణించగా, సోమవారమైతే ఏకంగా రూ.3,400 పతనం కావడం గమనార్హం. హైదరాబాద్‌లో..హైదరాబాద్‌లోనూ బంగారం ధరలు దిగొస్తున్నాయి. గురువారం 24 క్యారెట్ తులం రేటు రూ.2,130 తగ్గి రూ.93,930గా నమోదైంది. 22 క్యారెట్ 10 గ్రాముల విలువ రూ.1,950 పడిపోయి రూ.86,100గా ఉన్నది. అయితే ధరల్లో స్థిరత్వం లోపించడం.. కొనుగోలుదారులను వేచిచూసే ధోరణిలోకి నెడుతున్నదని జ్యుయెల్లర్స్ వాపోతున్నారు. మార్కెట్‌లో ఈ ఒడిదొడుకులు తగ్గితే వ్యాపారం తిరిగి పుంజుకోవచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత నెల ఏప్రిల్ 22న దేశీయంగా పసిడి ధర ఆల్‌టైమ్ హైని తాకుతూ తులం 24 క్యారెట్ రూ.1,01,600 పలికిన సంగతి విదితమే.వెండి ధరలు కూడా..బంగారంతోపాటు వెండి ధరలూ దిగొస్తున్నాయి. వరుసగా నాల్గోరోజూ రేట్లు పడిపోగా.. గురువారం మరో రూ.1,000 తగ్గి కిలో వెండి విలువ రూ.97,000కు పరిమితమైంది. బుధవారం రూ.1,450 పతనమవగా, మొత్తంగా ఈ నాలుగు రోజుల్లో రూ.2,900 క్షీణించినైట్టెంది. కాగా, అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పడిపోతున్నాయని, ఆ ప్రభావం దేశీయ మార్కెట్‌పైనా సహజంగానే ఉంటున్నదని అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. ఇక అంతర్జాతీయంగా స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ రేటు 16.81 డాలర్లు దిగి 3,160.71 డాలర్లకు చేరింది. మొత్తానికి ఆయా దేశాల మధ్య భౌగోళిక, రాజకీయ, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలు తగ్గడంతో ఇన్వెస్టర్లు.. తమ పెట్టుబడులను బంగారం నుంచి వెనక్కి తీసుకుంటున్నారని మార్కెట్ నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. ఇది ధరల క్షీణితకు దారితీస్తున్నట్టు అభివర్ణిస్తున్నారు.

## టాటా లాక్‌హీడ్‌పై కఠిన చర్యలు వద్దు



**హైదరాబాద్-నవభూమి:** బకాయిల వసూలులో భాగంగా విమాన విడిభాగాల తయారీ సంస్థ టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ ఎంఏఎల్)పై ఎంప్లాయిస్ ప్రావిడెంట్ కఠిన చర్యలు తీసుకోరాదని హైకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 21 వరకు నిషేధిత జాబితాలో ఉంచి ఖాతాలు స్తంభింపజేయరాదని ఉత్తర్వుల్లో పేరొంది.2012 నుంచి 2017 మధ్యకాలంలో పనిచేసిన 14 మంది విదేశీ కార్మికులకు పీఎఫ్ జమ చేయకపోవడంతో ఈపీఎఫ్ఓ ఈ కంపెనీని నిషేధిత జాబితాలో చేర్చి బ్యాంకు ఖాతాను స్తంభింపజేయడానికి ఉత్తర్వులు జారీ చేసింది. ఈచర్యను టీఎల్ ఎంఏఎల్ సంస్థ సవాలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ పుల్లా కార్తీక్ ఇటీవల విచారించారు. సంస్థ ఇప్పటికే రూ.4 కోట్లు డిపాజిట్ చేసిందని, మిగిలిన రూ.10 కోట్లలో రూ.4.30 కోట్లు రికవరీ కూడా చేసినట్టు కంపెనీ తరుపున వాదిస్తున్న న్యాయవాది తెలిపారు.

## అమెరికాకు భారత్ జీరో టారిఫ్‌ల ఆఫర్ ఇచ్చింది : అధ్యక్షుడు ట్రంప్


**న్యూయార్క్-నవభూమి:** వాణిజ్య ఒప్పందంపై భారత్-అమెరికా దేశాల మధ్య జోరుగా చర్చలు జరుగుతున్న వేళ యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. అమెరికాకు భారత్ ఓ ఆఫర్ ఇచ్చిందని తెలిపారు. తమ దేశం నుంచి దిగుమతి చేసుకొనే చాలా రకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్ లతో వాణిజ్య ఒప్పందాన్ని ప్రతిపాదించినట్లు వెల్లడించారు.ఖతార్ వేదికగా జరిగిన ఓ వ్యాపార సమావేశంలో ట్రంప్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. 'అమెరికాకు భారత్ ఓ ఆఫర్ చేసింది. ఇది ఒక ప్రాథమిక ఒప్పందం. ఇందులో భారత్ అమెరికా దిగుమతులపై జీరో టారిఫ్‌లతో వాణిజ్య ఒప్పందాన్ని ఆఫర్ చేసింది' అని తెలిపారు. అయితే, ఆఫర్ పరిధిలోకి వచ్చే నిబంధనలు, రంగాల గురించి మాత్రం ట్రంప్ వివరించలేదు. ఇక ట్రంప్ ప్రకటనపై భారత ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎలాంటి స్పందనా రాలేదు. మరోవైపు భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చల్లో గొప్ప పురోగతి ఉందని ట్రంప్ గతనెల వెల్లడించిన విషయం తెలిసిందే. త్వరలోనే ఓ ఒప్పందానికి రానున్నట్లు అప్పట్లో అధ్యక్షుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే తాజా ప్రకటన వచ్చింది.



### రాష్ట్రానికి మరో గట్టి ఎదురుదెబ్బ..

# సెమీకండక్టర్ల ప్లాంట్ హుళక్కే?

**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన ఒక్కో సంస్థ ఇక్కడి అమడదూరంగా వెళ్లిపోతున్నాయి. దీంతో చిప్‌ల తయారీ పరిశ్రమ ఇక్కడికి రావడం ఎండమావిగానే కనిపిస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండు కంపెనీలు రాష్ట్రంలో యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇక్కడ ఏర్పాటు చేయలేమని భావించి ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లిపోయాయి. ఇప్పటివరకు దేశంలో ఆరు సెమీకండక్టర్ యూనిట్లకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపగా..అందులో మన రాష్ట్రానికి చోటు లేకపోవడం విశేషం. నాలుగు యూనిట్లు గుజరాత్‌లో ఏర్పాటుకానుండగా, ఒకటి అస్సాం, మరొకటి ఉత్తరప్రదేశ్‌కు తరలిపోయింది.ఇక్కడ యూనిట్ ఏర్పాటునకు అవసరమైన పర్యావరణ పరిస్థితులు పుష్కలంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రానికి గుడ్‌బై పలుకుతున్నాయి. ఇదేక్రమంలో హెచ్‌సీఎల్, ఫాక్స్‌కాన్ సంయుక్త భాగస్వామ్యంలో రూ.3,706 కోట్ల పెట్టుబడితో ఉత్తరప్రదేశ్‌లో చిప్‌ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. వచ్చే రెండేండ్లలో అందుబాటులోకిరానున్న ఈ యూనిట్‌లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఆటోమొబైల్స్, పీసీల కోసం డిస్‌ప్లే డ్రైవ్ చిప్‌లు తయారుకానున్నాయి. తాజా చిప్ యూనిట్‌కు క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో మన రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమ భవితవ్యంపై సర్వత్రా చర్చ మొదలైంది. దీనికి కారణం లేకపోలేదు. ఐటీ రంగానికి ప్రధాన కేంద్రంగా మారిన హైదరాబాద్‌ను సెమీకండక్టర్ల తయారీలోనూ అభివృద్ధి చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషిచేసింది. ఇప్పటికే ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీల ఏర్పాటు ద్వారా మన రాష్ట్రంలో సెమీకండక్టర్ల పరిశ్రమకు అవసరమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటైంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ విశేష కృషితో కార్నింగ్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్, కేన్స్ సెమికాన్ కంపెనీలు రాష్ట్రంలో సెమీకండక్టర్ల యూనిట్లు స్థాపించేందుకు ముందుకొచ్చాయి. ఈలోగా



రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కార్నింగ్ తమిళనాడుకు, కేన్స్ సెమికాన్ గుజరాత్‌కు తరలివెళ్లిపోయింది. సెమీకండక్టర్లకు గిరాకీ..సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కొత్తపుంతలు తొక్కుతున్న వేళ సెమీకండక్టర్ల పరిశ్రమకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న గిరాకీ అంతాఇంతా కాదు. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక అవసరాలు, విమానయాన రంగం తదితర వాటిల్లో చిప్‌ల వినియోగం రోజురోజుకూ గణనీయంగా పెరుగుతున్నది. ఇందులో భాగంగా దిగుమతులను తగ్గించి దేశంలోనే సెమీకండర్ల తయారీని ప్రోత్సహించేందుకు ఇండియా సెమీకండక్టర్ మిషన్(ఐఎస్ఎం)ను ఏర్పాటు చేసింది.రాష్ట్రానికి రావడానికి జంకుతున్న కంపెనీలు సెమీకండక్టర్ యూనిట్ల స్థాపనకు రాష్ట్రంలో పుష్కలమైన వనరులు ఉన్నప్పటికీ కంపెనీలు ముందుకు రాకపోవడంపట్ల పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అనేక ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సేవలను అందిస్తున్నప్పటికీ.. సెమీకండక్టర్ల యూనిట్ ఏర్పాటు చేయడానికి ముందుకురావడం లేదు. వీటిలో అమెరికాకు చెందిన ఇంటెల్, క్వాల్కమ్, మైక్రోచిప్ టెక్నాలజీ ఇంక్.. అలాగే, జర్మనీకి చెందిన ఇన్ఫినియస్ టెక్నాలజీ, టెస్సోల్, మైక్రాస్ టెక్నాలజీ, మోస్‌చిప్, మిరాఫ్రా టెక్నాలజీ, ఏఎండీలు ఉన్నాయి.

### భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దు..

# టిమ్ కుక్‌కు సూచించిన ట్రంప్

**న్యూయార్క్-నవభూమి:** ఖతార్ వేదికగా భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అక్కసు వెళ్లగక్కారు. భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దని ఆ సంస్థ సీఈవో టిమ్ కుక్‌కు సూచించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదికను ఊటంకిస్తూ ప్రముఖ జాతీయ మీడియా ఇండియా టుడే తెలిపింది.అధ్యక్షుడు ట్రంప్ ప్రస్తుతం అరబ్ దేశాల పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. తన పర్యటనలో భాగంగా నిన్న ఖతార్‌ను సందర్శించారు. ట్రంప్ కోసం ఎమిర్ ఆఫ్ ఖతార్ దోహాలో ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేసింది. ఈ విందుకు పలువురు సీఈవోలు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. ఈ విందుకు హాజరైన యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో ట్రంప్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తన అభిప్రాయాన్ని టిక్ కుక్‌కు తెలియజేశారు. భారత్‌లో యాపిల్ సంస్థను విస్తరించొద్దని సూచించారు.'నాకు టిమ్ కుక్‌తో నిన్న చిన్న సమస్య ఎదురైంది. అతడు భారత్‌లో తయారీ కర్మాగారాల నిర్మాణాలు చేపట్టారు. అలా చేయడం నాకు ఇష్టం లేదని చెప్పాను. ఫలితంగా అమెరికాలో ఉత్పత్తి పెంచేందుకు యాపిల్ అంగీకరించింది. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటి. అక్కడ వ్యాపారం చేయడం చాలా కష్టమని టిమ్ కుక్‌కు వివరించా. భారత్ కోసం ఆలోచించాల్సిన అవసరం లేదు. ఆ దేశం తనను తాను చూసుకోగలదని చెప్పా. నా వల్ల యాపిల్ సంస్థ ఇప్పుడు యూఎస్‌లో 500బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టాలని యోచిస్తోంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.అమెరికా, చైనా దేశాల మధ్య టారిఫ్‌ల యుద్ధం కారణంగా దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు



ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. ఇందులో భాగంగానే అమెరికా మార్కెట్లో విక్రయించే ఐఫోన్ల తయారీకి సంబంధించిన పూర్తి అసెంబ్లీని భారత్‌కు తరలించాలని కంపెనీ యోచిస్తోంది. వచ్చే ఏడాది సాధ్యమైనంత తొందరగానే అమెరికా ఫోన్‌లకు సంబంధించిన యాపిల్ ఐఫోన్ అసెంబ్లీ భారత్‌కు తరలించే అవకాశం ఉందని గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి సంస్థలు ఇప్పటికే భారత్‌లో ఐఫోన్ అసెంబ్లింగ్ చేస్తున్న విషయం తెలిసిందే. జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే ఐఫోన్లలో అత్యధికంగా భారత్‌లో తయారైనవే ఉంటాయని టిమ్ కుక్ ఇటీవల ప్రకటించారు. ఐపాడ్స్, మ్యాక్‌బుక్, యాపిల్ వాచ్‌లు, ఎయిర్‌పాడ్స్ వంటి ఉత్పత్తులను మాత్రం వియత్నాం నుంచి దిగుమతి చేసుకోవాలని యాపిల్ భావిస్తోంది.

### ఎలక్ట్రిక్ వాణిజ్య.. అవగాహన ఒప్పందంపై

# సంతకం చేసిన టాటా మోటార్స్, వెర్టెలో

**ముంబై-నవభూమి:** టాటా మోటార్స్, భారతదేశంలో అతిపెద్ద వాణిజ్య వాహన తయారీదారు వెర్టెలో, బెస్పోక్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్, దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి రెండు కంపెనీల మధ్య ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేస్తున్నట్లు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యం ద్వారా, వెర్టెలో అనుకూలీకరించిన లీజింగ్ పరిష్కారాలను అందిస్తుంది, ఇది ఫ్లీట్ యజమానులు స్థిరమైన మొబిలిటీకి సజావుగా మారడానికి సహాయపడుతుంది. ఈ పరిష్కారాలు మొత్తం టాటా మోటార్స్ ఎలక్ట్రిక్ వాణిజ్య వాహన పోర్ట్‌ఫోలియోకు వర్తిస్తాయి.ప్రకటనపై వ్యాఖ్యానిస్తూ, మిస్టర్. రాజేష్ కౌల్, వైస్ ప్రెసిడెంట్ బిజినెస్ హెడ్ ట్రక్స్, టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ ఇలా అన్నారు, "టాటా మోటార్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రజాస్వామ్యీకరించడం స్థిరమైన రవాణా పరిష్కారాల ప్రాప్యతను విస్తరించడం పట్ల తన నిబద్ధతను కొనసాగిస్తోంది. మా అధునాతన ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలకు విస్తృత ప్రాప్యతను సాధించడానికి ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. ఈ సహకారాల ద్వారా, మేము స్థిరమైన రవాణా పరిష్కారాలను వేగవంతం చేయడమే కాకుండా, భారతదేశంలో బలమైన పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి కూడా దోహదపడుతున్నాము" ఈ భాగస్వామ్యం గురించి మాట్లాడుతూ, మిస్టర్ సందీప్ గంభీర్, వెర్టెలో ఇలా అన్నారు, "బస్సులు, ట్రక్కులు మినీ-ట్రక్కులు వంటి విస్తృత శ్రేణి ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలలో స్వీకరణను వేగవంతం చేయడంలో టాటా మోటార్స్‌తో భాగస్వామ్యం చేసుకోవడం మాకు సంతోషంగా ఉంది. ఈ భాగస్వామ్యం బెస్పోక్ లీజింగ్ సొల్యూషన్‌లను సులభతరం చేస్తుంది వాణిజ్య ఫ్లీట్ ఆపరేటర్లకు ఎలక్ట్రిక్ మొబిలిటీని సహజ ఎంపికగా చేసే స్థిరమైన పర్యావరణ వ్యవస్థను సృష్టించడానికి దోహదపడుతుంది. ఈ సహకారం టాటా మోటార్స్ వెర్టెలో ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాల స్వీకరణను వేగవంతం చేయడానికి పర్యావరణ అనుకూల మొబిలిటీ పరిష్కారాలను స్థాయిలో రూపొందించడానికి వీలు కల్పిస్తుంది."టాటా మోటార్స్, టాటా ఏస్‌తో పాటు టాటా అల్ట్రా టాటా స్టార్‌బస్ శ్రేణిని మాస్-మొబిలిటీ సొల్యూషన్స్‌లో అందిస్తోంది. కంపెనీ టాటా ప్రైమా టాటా అల్ట్రా .12, టాటా మాగ్నా బస్సు, టాటా అల్ట్రా 9 బస్సు, టాటా ఇంటర్‌సిటీ 2.0 బస్సు, టాటా ఏస్ ప్రో టాటా ఇంట్రా కూడా ప్రదర్శించింది, ఇవి విస్తృత అప్లికేషన్లలో కస్టమర్ అవసరాలకు అనుగుణంగా ఉంటాయి. ఆవిష్కరణ స్థిరత్వంపై దృఢమైన దృష్టితో, టాటా మోటార్స్ ట్రక్కులు, బస్సులు చిన్న వాణిజ్య వాహనాలలో దాని ఎలక్ట్రిక్ పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తూ కొనసాగుతుంది. పెరుగుతున్న ఛార్జింగ్ మౌలిక సదుపాయాలు, బలమైన సేవా నెట్‌వర్క్ ఫ్లీట్ అప్‌టైమ్ ఖర్చులను ఆప్టిమైజ్ చేయడానికి టాటా మోటార్స్ ఫ్లీట్ ఎడ్జ్ అనే కనెక్టెడ్ ప్లాట్‌ఫామ్ ద్వారా మద్దతును అందిస్తూ, భారతదేశంలో సుస్థిరమైన రవాణా విప్లవానికి నాయకత్వం వహిస్తుంది.



## 5 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు



**న్యూఢిల్లీ-నవభూమి:** గత నెలలో దేశ ఎగుమతులు, దిగుమతుల మధ్య అంతరం 5 నెలల గరిష్ఠాన్ని తాకింది. గురువారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం ఏప్రిల్‌లో ఎగుమతులు 9.03 శాతం పెరిగి 38.49 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక దిగుమతులు 19.12 శాతం ఎగిసి 64.91 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు 5 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 26.42 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ముడి చమురు దిగుమతులు 25.6 శాతం ఎగబాకి 20.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. బంగారం దిగుమతులు 3.09 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

## ఎన్ఎస్‌పీసీఎల్‌కు సింగరేణి బొగ్గు



**హైదరాబాద్-నవభూమి:** సింగరేణి నుంచి ఎన్ఎస్‌పీసీఎల్(ఎన్‌టీపీసీ సెయిల్ పవర్ కంపెనీ)కి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5 లక్షల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సింగరేణి కాలరీస్, ఎన్ఎస్‌పీసీఎల్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.సింగరేణి సీఎండీ బలరాం ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోల్ మూవ్‌మెంట్ ఎస్‌డీఎం సుభానీ సమక్షంలో సింగరేణి జీఎం(మార్కెటింగ్) ఎన్వీ రాజశేఖర్‌రావు, ఎన్ఎస్‌పీసీఎల్ సీఈవో దివాకర్ కౌశల్, జీఎంలు నీల్ కమల్, పలాష్‌లు అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారు. సింగరేణి నాణ్యమైన బొగ్గు సరాఫరా చేస్తుందనే నమ్మకంతోనే ఈ ఒప్పందం చేసుకున్నామని ఎన్ఎస్‌పీసీఎల్ అధికారులు వెల్లడించారు.

## టి సి ఐ క్యూ 4 %డ% ఎఫ్ వై 2025 ఆర్థిక సంవత్సరానికి మంచి ఎదుగుదల



**హైదరాబాద్-నవభూమి:** ట్రాన్స్పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (టి సి ఐ), ఇండియా అనేది ఇంటిగ్రేట్ చేయబడిన మల్టీ మోడల్ లాజిస్టిక్స్ సరఫరా పరిష్కారాలను అందించే సంస్థ. అది ఈరోజు ఈ త్రైమాసికానికి మార్చ్ 31, 2025 తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక ఫలితాలను వెల్లడించింది.2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక హైలెట్స్ :ఆదాయం: ఇదే కాల వ్యవధి లో గత సంవత్సరం ? 10,954 మిలియన్ల తో పోలిస్తే ఆదాయం యొక్క పూర్తి నివేదిక 9.3% ఎదుగుదల తో 11,972 మిలియన్ లకు చేరుకుంది.ఈ బి ఐ డి టి ఏ: సంస్థ యొక్క వడ్డీ కి ముందు ఆదాయం, టాక్సులు, తగ్గుదల యమార్టైజేషన్ (ఈ బి ఐ డి టి ఏ) ? 1,401 మిలియన్ రూపాయల వద్ద నిలిచింది అది 2024 ఆర్థిక సంవత్సరం లో 11.3% పెరుగుదల తో ? 1,259 మిలియన్ల కు చేరుకుంది.టాక్స్ తరువాత లాభం(పి ఏ టి): ముందు సంవత్సరం ? 1,033 మిలియన్స్ తో పోలిస్తే పి ఏ టి 11.4% నుంచి ? 1,151 మిలియన్ రూపాయలకు పెరిగింది.

## నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

**హైదరాబాద్(నవభూమి):** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. ఇటీవలి కాలంలో నమోదైన లాభాల నేపథ్యంలో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో, వారాంతపు చివరి ట్రేడింగ్ సెషన్‌లో కీలక సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ రెండూ నష్టాలను చవిచూశాయి.వివరాల్లోకి వెళితే, బీఎస్ఈ సెన్సెక్స్ 200.15 పాయింట్లు (0.24 శాతం) క్షీణించి 82,330.59 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో సెన్సెక్స్ ఒక దశలో 82,514.81 గరిష్ఠ స్థాయిని తాకి, మరో దశలో 82,146.95 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అదేవిధంగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 42.30 పాయింట్లు (0.17 శాతం) నష్టపోయి 25,019.80 వద్ద ముగిసింది. గురువారం నాటి భారీ ర్యాలీ అనంతరం నిఫ్టీ కన్సాలిడేషన్ బాట పట్టినట్లు కనిపించింది.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 | హైదరాబాద్ | శనివారం | 17 । మే । 2025



## హాంకాంగ్, సింగపూర్‌లో పెరుగుతున్న కోవిడ్ కేసులు



**సింగపూర్-నవభూమి:** ఆసియాలో మళ్లీ కరోనా వేవ్ మొదలైన సూచనలు కనబడుతున్నాయి. హాంకాంగ్, సింగపూర్‌లో కరోనా కేసులు పెరుగుతుండటంతో స్థానిక అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. హాంకాంగ్‌లో వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని స్థానిక అధికారి ఒకరు హెచ్చరించారు. ఇటీవల శాంపిల్స్‌లో అనేకం పాజిటివ్‌గా తేలాయని అన్నారు. ఈ ఏడాది ఈ స్థాయిలో కోవిడ్ పాజిటివ్స్ రావడం ఇదే తొలిసారని అన్నారు. మే 3తో ముగిసిన వారంలో 31 కొవిడ్ మరణాలు నమోదు అయ్యాయని, ఈ ఏడాది ఇదే గరిష్ఠ సంఖ్య అని కూడా తెలిపారు. రెండేళ్ల నాటి కొవిడ్ ఇన్ఫెక్షన్ దశతో పోలిస్తే కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ పరీక్షల్లో వైరల్ లోడ్ పెరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. దీనర్థం వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని భావించాలని అన్నారు. ఇక పొరుగున ఉన్న సింగపూర్‌లో కొవిడ్ కేసులు పెరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. దాదాపు ఏడాది తరువాత అక్కడి ఆరోగ్య శాఖ కొవిడ్ కేసుల సంఖ్యను తాజాగా వెల్లడించింది. మే3తో ముగిసిన వారంలో కేసుల సంఖ్య 14200గా ఉందని, అంతకుముందు వారంతో పోలిస్తే ఇది 28 శాతం ఎక్కువని అధికారులు అన్నారు. ఆసుపత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య కూడా 30 శాతం పెరిగిందని చెప్పారు.

## ఇండోనేషియాలో అల్లర్లు.. 20మంది మృతి




**జకార్తా-నవభూమి:** ఇండోనేషియాలోని పాపువా ప్రాంతంలో భద్రతా బలగాలు, వేర్పాటువాదులకు మధ్య శుక్రవారం ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈ ఘర్షణల్లో మొత్తం 20 మంది మరణించారు. వీరిలో18 మంది రెబల్స్ కాగా.. ఇద్దరు పోలీస్ ఉన్నతాధికారులు ఉన్నారని మిలటరీ ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ ఇవాన్ ద్వి ప్రిహర్టోనో వెల్లడించారు. ఇంతన్ జయ ప్రాంతం తిరుగుబాటుదారులకు కేంద్రంగా ఉన్న సంగతి తెలిసిందే. విద్య, వైద్య సేవలు అందించేందుకు మిలటరీ దళాలు ఈ ప్రాంతానికి బుధవారం చేరుకున్నాయి. దీంతో డజన్ల కొద్ది రెబల్స్ ఆయుధాలతో వీధుల్లోకి వచ్చి.. ఈ ప్రభుత్వ దళాలపై దాడులకు దిగాయని.. దీంతో యుద్ధం చెలరేగిందని ద్వి ప్రిహర్టోనో వివరించారు. ఇక ఈ ఘర్షణ అనంతరం రైఫిల్, స్వదేశీ తుపాకీ, బాణాలతోపాటు తుపాకీ బుల్లెట్లను తిరుగుబాటుదారులకు చెందిన జెండాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అయితే ప్రభుత్వం తరపున ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని స్పష్టం చేశారు. 1960 మొదట్లో ఇండోనేషియా ఒకప్పుడు డచ్ కాలనీగా ఉన్న ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. నాటి నుంచి పాపువాలో తిరుగుబాటు ప్రారంభమైంది. 1969లో పాపువాను ఇండోనేషియాలో విలీనం చేశారు. ఇక పశ్చిమ పాపువా లిబరేషన్ ఆర్మీ తిరుగుబాటు దారుడు సెబ్బీ సాంబోమ్ మాట్లాడుతూ.. ఈ అల్లర్లలో ముగ్గురు మాత్రమే మరణించారని చెప్పారు. మిగిలిన వారంతా అమాయకులని స్పష్టం చేశారు. అలాగే పుంకాక్ జయ రీజెన్సీలో తిరుగుబాటుదారులు ఇద్దరు పోలీసులను హత్య చేశాని వివరించారు. ఇటీవల తిరుగుబాటుదారుల దాడులు పెరిగాయి. ఈ దాడుల్లో తిరుగుబాటుదారులు, భద్రతా దళాలతోపాటు స్థానికులు సైతం మరణించిన సంగతి తెలిసిందే.

## భారత్ సామర్థ్యం ముందు చైనా, పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ ఎందుకూ పనికిరావు



**న్యూయార్కు-నవభూమి:** ఉగ్రవాదాన్ని పోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను అమెరికా రక్షణ రంగ నిపుణుడు జాన్ స్పెన్సర్ సమర్థించారు. పాక్‌పై భారత్ దాడి, రక్షణాత్మక ఆధిపత్యాన్ని ప్రదర్శించిందన్నారు. ఈ ఆపరేషన్‌తో పాకిస్థాన్‌లోని ఏ ప్రదేశంలోనైనా ఎప్పుడైనా దాడి చేయగలమన్న సందేశాన్ని దాయాదికి పంపిందన్నారు. ప్రముఖ జాతీయ మీడియా ఇండియా టుడేకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జాన్ స్పెన్సర్ మాట్లాడుతూ.. భారత రక్షణ వ్యవస్థలతో పోలిస్తే చైనా, పాక్ ఎయిర్ డిఫెన్స్ చాలా బలహీనమని అభిప్రాయపడ్డారు. భారత్ సామర్థ్యం ముందు అవి ఎందుకూ పనికిరావన్నారు. 'అటు దాడికి అవసరమైన దూకుడును, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని భారత్ చూపించింది. పాక్ డ్రోన్ దాడులు, హై-స్పీడ్ క్షిపణులను ఎదుర్కోవడంతో సహా తనను తాను విజయవంతంగా రక్షించుకోవడంలో భారత్ విజయవంతమైంది. పాక్‌ను ఎప్పుడైనా, ఎక్కడైనా దెబ్బ కొట్టగలమని నిరూపించింది. భారత్‌పై దాడికి చైనా వైమానిక రక్షణ వ్యవస్థను పాక్ ఉపయోగించింది. అవి ఘోరంగా విఫలమయ్యాయి. భారత సామర్థ్యం ముందు అవి నిలువలేకపోయాయి. భారతదేశ అధునాతన సైనిక సామర్థ్యానికి బ్రహ్మోస్ క్షిపణి నిదర్శనం. చైనా, పాక్ వైమానిక రక్షణ వ్యవస్థలను బ్రహ్మోస్ ధ్వంసం చేసేసింది' అంటూ భారత్ సామర్థ్యాన్ని కీర్తించారు. కాగా, పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్‌తో గట్టి బదులు తీర్చుకున్న విషయం తెలిసిందే. దీనికి ప్రతిదాడిగా మే 10న భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇస్లామాబాద్ డ్రోన్, క్షిపణి దాడులకు యత్నించింది. దీంతో భారత్ పాక్ భూభాగంలోని 11 వైమానిక స్థావరాలపై దాడి చేసింది. ఈ దాడులకు భారత్ 'బ్రహ్మోస్' క్షిపణులను వాడింది.

## మళ్లీ కోరలు చాస్తున్న కరోనా మహమ్మారి.. ఆ దేశాల్లో హై అలర్ట్

**సింగపూర్ -నవభూమి:** ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి ఇప్పుడు మళ్లీ కోరలు చాస్తోంది. ఆసియాలోని రెండు దేశాల్లో భారీగా కొవిడ్ కొత్త కేసులు నమోదవుతున్నాయి. దీంతో ఆయా దేశాల్లో ఆరోగ్య శాఖ అధికారులు హై అలర్ట్ అయ్యారు. ఆసియా దేశాల్లో కరోనా కేసుల్లో భారీ పెరుగుదల నమోదైనట్లు అక్కడి అధికారులు తెలిపారు. ముఖ్యంగా అధిక జనసాంద్రత కలిగిన హాంకాంగ్, సింగపూర్ దేశాల్లో కేసులు గణనీయంగా పెరుగుతున్నట్లు వెల్లడించారు. హాంకాంగ్‌లో వైరస్ వ్యాప్తి అధికంగా ఉందని స్థానిక అధికారి ఒకరు హెచ్చరించారు. ఇటీవల శాంపిల్స్‌లో అనేకం పాజిటివ్‌గా తేలాయని తెలిపారు. ఈ ఏడాది ఈ స్థాయిలో కరోనా పాజిటివ్‌గా తేలడం ఇదే తొలిసారని అన్నారు. మే 3తో ముగిసిన వారంలో 31 కొవిడ్ మరణాలు నమోదైనట్లు చెప్పారు. ఈ ఏడాది ఇదే గరిష్ఠ సంఖ్య అని కూడా తెలిపారు. రెండేళ్ల నాటి కొవిడ్ ఇన్ఫెక్షన్ దశతో పోలిస్తే కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ పరీక్షల్లో వైరల్ లోడ్ పెరుగుతున్నట్టు అధికారులు గుర్తించారు. అటు సింగపూర్ కూడా కొవిడ్ కేసుల పెరుగుదలతో అలర్ట్ అయింది. దాదాపు ఏడాది తర్వాత ఈ నెలలో కొవిడ్ కేసుల సంఖ్యపై సింగపూర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ.. నివేదికను విడుదల చేసింది. మే 3వ తేదీ నాటికి అంచనా వేసిన కేసుల సంఖ్య కంటే 28 శాతం పెరిగి పాజిటివ్ కేసుల సంఖ్య 14,200కు చేరుకున్నట్లు తెలుస్తోంది. నిత్యం ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య కూడా దాదాపు 30 శాతం పెరిగినట్లు సమాచారం. థాయ్‌లాండ్, చైనా దేశాల్లోనూ కొవిడ్ కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నట్లు తెలుస్తోంది. జనాభాలో తగ్గుతున్న ఇమ్యూనిటీ కారణంగా కేసుల సంఖ్య పెరుగుతూ ఉండొచ్చని ఆరోగ్య శాఖ అధికారులు భావిస్తున్నారు. కేసుల పెరుగుదలతో ఆయా దేశాల అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రద్దీ ప్రాంతాలకు దూరంగా

# భారత్‌తో సంబంధాల పునరుద్ధరణ ఆఫ్ఘన్ సై



**కాబూల్(నవభూమి):** భారత్‌తో సంబంధాలకు పునరుద్ధరణ, పరస్పర సహకారం, పెట్టుబడులకు ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వం ఆసక్తితో ఉన్నట్టు తాలిబన్ ప్రతినిధి సుహైల్ షహీన్ శుక్రవారంనాడు తెలిపారు. ఇంతకుముందు భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, తాలిబన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమిర్ ఖాన్ ముత్తాఖీ తొలిసారి ఫోనులో సంభాషించారు. అనంతరం భారత్‌తో సంబంధాల పునరుద్ధరణకు ఆసక్తితో ఉన్నట్టు సుహైల్ షహీన్ ప్రకటించారు. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ ప్రభుత్వం 2021 ఆగస్టులో అధికార పగ్గాలు చేపట్టింది. ఆ ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా గుర్తించనప్పటికీ దౌత్య సంబంధాలను కొనసాగిస్తోంది. అయితే మంత్రుల స్థాయిలో జైశంకర్, ముత్తాఖి మధ్య అత్యున్నత స్థాయిలో ఫోన్ సంభాషణలు చోటుచేసుకోవడం మాత్రం ఇదే మొదటిసారి. దీనికి ముందు ముత్తాఖీ, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మధ్య గత జనవరి దుబాయిలో చర్చలు జరిగాయి. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తాలిబన్ ప్రభుత్వం ఖండించడంతో రెండు దేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణకు సానుకూల సంకేతాలు వెలువడ్డాయి. జైశంకర్, ముత్తాఖీ మధ్య ఫోను సంభాషణల ప్రాధాన్యతపై సుహైల్ షహీన్‌ను ప్రశ్నించినప్పుడు, ఇండియాతో ఆఫ్ఘన్‌కు చారిత్రక సంబంధాలున్నాయని, వాటిని తిరిగి పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆఫ్ఘన్ ప్రభుత్వం బ్యాలెన్స్‌డ్ అప్రోచ్ విధానాన్ని అనుసరిస్తుందని, తమ దేశంలోని వివిధ రంగాల్లో ఏ దేశమైనా పెట్టుబడులు పెట్టేందుకు వీలుందన్నారు. ఇండియా-ఆఫ్ఘన్ మధ్య ప్రస్తుతం ఒక బిలయన్ డాలర్ల మేరకు ద్వైపాక్షిక వాణిజ్యం ఉంది. కాగా, పహల్గాం ఉగ్రదాడిని ఆఫ్ఘనిస్తాన్ ఖండించడాన్ని స్వాగతిస్తున్నట్టు జైశంకర్ తెలిపారు. ఆఫ్ఘన్ ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించడంతో పాటు వారి అభివృద్ధికి నిరంతరం మద్దతు ఇందిస్తామన్నారు. ఇరుదేశాల మధ్య పరస్పర సహకారాన్ని ముందుకు తీసుకువెళ్లే అశాలంపై తాను, ముత్తాఖీ చర్చలు జరిపినట్టు చెప్పారు. 2021 నుంచి ఆఫ్ఘన్‌కు భారత్ 50,000 టన్నుల గోధుమలు, 350 టన్నుల మెడిసన్లు, 40,000 లీటర్ల మలాథియాన్ ఫెస్టిసైడ్స్, 29 టన్నుల భూకంప సహాయక సామగ్రి పంపింది. ఆఫ్ఘన్ విద్యార్థులకు 2,000 ఆన్‌లైన్ స్కాలర్‌షిప్‌లు కూడా ఇచ్చింది.

### 5,000 మందికి పైగా పాకిస్తానీ యాచకులను

# బహిష్కరించిన సౌదీ అరేబియా



**కరాచీ-నవభూమి:** పాకిస్తాన్‌లో ఇతర ఏజెంట్లలానే కొందరు భిక్షాటన కోసం వ్యక్తులను ఇతర దేశాలకు పంపిస్తారు. నిజానికి కూలి పని కోసం వెతికే వారిని ఏజెంట్లు టార్గెట్ చేస్తారు. అయితే, ఏ పనీ దొరకనప్పుడు వీరిని భిక్షాటన వైపు మళ్లిస్తుంటారు. ఇలా వేల మందిని ఇతర దేశాలకు తరలిస్తుంటారు. అయితే, ఈ విషయంపై అలర్ట్ అయిన సౌదీ అరేబియా గత 16 నెలల్లో మొత్తం 5,033 మంది పాకిస్తానీ యాచకులను బహిష్కరించింది. ఈ విషయం పాకిస్తాన్ అంతర్గత మంత్రి మొహ్సిన్ నక్వీ ఆ దేశ అసెంబ్లీలో తెలిపారు. 5,033 మంది పాకిస్తానీ యాచకులు బహిష్కరణ 16 నెలల వ్యవధిలో మొత్తం 5,033 మంది పాకిస్తానీ యాచకులను సౌదీ అరేబియా నుండి బహిష్కరించినట్లు అంతర్గత మంత్రి మొహ్సిన్ నక్వీ అసెంబ్లీలో తెలిపారు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) ఎంఎన్‌ఎ సెహర్ కమ్రాన్ లేవనెత్తిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా నక్వీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు డాన్ పత్రిక నివేదించింది. ప్రధానంగా పశ్చిమాసియాలోని మరో ఐదు దేశాలలో భిక్షాటన చేస్తున్నందుకు మరో 369 మందిని అరెస్టు చేసినట్లు నక్వీ పేర్కొన్నారు. మంత్రి అందించిన డేటా ప్రకారం జనవరి 2024 నుండి సౌదీ అరేబియా, ఇరాక్, మలేషియా, ఒమన్, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) నుండి మొత్తం 5,402 మంది పాకిస్తానీయులను బహిష్కరించారు. కమ్రాన్ గత మూడు సంవత్సరాల డేటాను కోరగా మంత్రి జనవరి 2024 నుండి సంబంధించిన వివరాలను అందించారు. ఈ దేశాల నుండి బహిష్కరించబడిన వారిలో ఎక్కువ మంది సింధ్ ప్రావిన్స్‌కు చెందినవారని డేటాలో తేలింది. డాన్ పత్రిక ప్రకారం, భిక్షాటన ఆరోపణలపై ఈ దేశాల నుండి బహిష్కరించబడిన వారిలో ప్రావిన్స్ నుండి మొత్తం 2,795 మంది ఉన్నారు. అయితే పంజాబ్‌కు చెందిన వారి సంఖ్య 1,437గా ఉంది. డేటా ప్రకారం, బహిష్కరించబడిన వారిలో 1,002 మంది ఖైబర్ పఖ్తుంఖ్వా నుండి, 125 మంది బలూచిస్తాన్ నుండి, 33 మంది ఆజాద్ కాశ్మీర్ నుండి, 10 మంది ఇస్లామాబాద్ నుండి వచ్చారు. సౌదీ అరేబియా 247 మంది పాకిస్తానీయులను స్వదేశానికి తిరిగి పంపించింది. పాకిస్తాన్ తరచు తమ యాచకులను తమ దేశానికి పంపిస్తుందని గమనించిన సౌదీ అరేబియా పాకిస్తాన్ జాతీయులకు వీసాలపై యుఎఇ కఠినమైన ఆంక్షలు విధించింది. అన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, పాక్ యాచకులు మాత్రం వారి దేశంలో తగ్గడం లేదు.

# భారత్ సూపర్ ఆఫర్!



**దోహా,(నవభూమి):** అమెరికాకు చెందిన సరుకులపై అన్ని రకాల సుంకాలను ఉపసంహరించుకోవటానికి సిద్ధంగా ఉన్నట్లు భారత్ తమకు తెలిపిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. ఖతార్ పర్యటనలో ఉన్న ట్రంప్ ఆ దేశ రాజధాని దోహాలో గురువారం జరిగిన ఓ వాణిజ్య సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ సంచలన ప్రకటన చేశారు. ఎటువంటి సుంకాలు లేని ఒప్పందానికి సిద్ధంగా ఉన్నట్లు భారత్ నుంచి ప్రతిపాదన వచ్చిందన్నారు. ట్రంప్ ప్రకటనపై భారత విదేశాంగమంత్రి జైశంకర్ స్పందిస్తూ.. 'భారత్ అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయి. అవి సంక్లిష్టమైనవి. అన్నింటిపైనా స్పష్టత వచ్చే వరకూ నిర్ణయం తీసుకోవటం అంటూ ఉండదు. ఏ వాణిజ్య ఒప్పందమైనా ఇరుదేశాలకు లబ్ధి చేకూర్చాలి. దీనిపై ముందే తీర్పులు ప్రకటించేయటం అపరిపక్వత అవుతుంది' అని పేర్కొన్నారు. కాగా, భారత్ సుంకాలు వేయబోనని చెప్పిందన్న ట్రంప్ ప్రకటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్‌లో పలు ప్రశ్నలు సంధించారు. 'కేంద్ర వాణిజ్యమంత్రి ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. ట్రంపేమో దోహా నుంచి మరో భారీ ప్రకటన చేశారు. ప్రధానమంత్రి ఈ వ్యవహారంపై ఏమీ మాట్లాడటం లేదు. ఇంతకూ ఆయన (మోదీ) దేనికి అంగీకరించారు? ఆపరేషన్ సిందూర్ నిలిపివేతకు ట్రంప్ ప్రకటనకు మధ్య ఏమైనా సంబంధం ఉందా?' అని పేర్కొన్నారు. మరోవైపు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఖరారు కోసం చర్చలు జరిపేందుకు కేంద్ర వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ ప్రస్తుతం అమెరికాలో ఉన్నారు. భారత ఉత్పత్తుల మీద ట్రంప్ ఇటీవల 26 శాతం సుంకం విధించి, ఆ తర్వాత 90 రోజుల తాత్కాలిక మినహాయింపు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ గడువు ముగియకముందే ఇరుదేశాల వాణిజ్య ఒప్పందాన్ని ఒక కొలిక్కి తీసుకురావాలని భారత్ ప్రయత్నిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత్‌లో వద్దు.. అమెరికాలో నిర్మించండి దోహా వాణిజ్య సదస్సులో ట్రంప్ మరో వివాదాస్పద ప్రకటన చేశారు. చైనా నుంచి భారత్‌కు ఐఫోన్ ప్లాంట్లను భారీ ఎత్తున తరలిస్తున్న ఆపిల్ కంపెనీకి ఆ పని చేయవద్దని ట్రంప్ సూచించారు. ఆపిల్ సీఈఓ టిమ్‌కుక్‌తో అంతకుముందు రోజు జరిగిన సంభాషణ వివరాలను ఈ మేరకు వెల్లడించారు. భారత్‌లో నిర్మించేబదులు అమెరికాలో ఐఫోన్ తయారీ ప్లాంట్లను నిర్మించాలని టిమ్‌కు సూచించానని, భారత్ తన అవసరాలు తాను చూసుకోగలదని చెప్పానన్నారు. ఇక మీదట అమెరికాలో యాపిల్ కంపెనీల్లో ఉత్పత్తి పెరగనుందన్నారు. అయితే, భారత్‌లో పెట్టుబడులకు సంబంధించి తమ ప్రణాళికలపై ట్రంప్ ప్రకటన ప్రభావం ఉండబోదని యాపిల్ కంపెనీ ఉన్నతాధికారులు స్పష్టం చేసినట్లు కేంద్రప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. యాపిల్ ఉత్పత్తుల తయారీ ప్రధాన కేంద్రాల్లో ఒకటిగా భారత్‌ను చూస్తామని వారు తెలిపినట్లు పేర్కొన్నాయి. భారత్-పాక్ యుద్ధం ఆపటానికి సాయపడ్డా భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధాన్ని తానే ఆపినట్లుగా పలుమార్లు చెప్పుకున్న ట్రంప్ తాజాగా కాస్త తగ్గారు. ఇరుదేశాల సమస్యను తానే మొత్తంగా పరిష్కరించకపోయినా, పరిష్కరించేందుకు సాయపడ్డానని తెలిపారు. ఖతార్‌లోని అల్ ఉదీద్ వైమానిక స్థావరంలో అమెరికా సైనికులను ఉద్దేశించి మాట్లాడుతూ, 'భారత్ పాకిస్థాన్ మధ్య పరిస్థితి రోజురోజుకీ తీవ్రమవుతూ వచ్చింది. ఆ సమయంలో నేను వారితో.. యుద్ధం బదులు వ్యాపారం చేసుకోవాలని చెప్పాను. దానికి ఇరుదేశాలూ చాలా సంతోషించాయి. వాళ్లు వెయ్యేళ్లుగా కొట్లాడుకుంటున్నారు. నేను దాన్ని ఆపగలనని చెప్పా.. ఆపా. నేను దేన్నైనా ఆపగలను, పరిష్కరించగలను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## గాజాలో మారణహోమం..ఇజ్రాయెల్ దాడుల్లో 64 మంది మృతి



**గాజా(నవభూమి):** గాజాలో ఇజ్రాయెల్ మారణహోమాన్ని సృష్టిస్తోంది. వరుసగా మూడోరోజు భీకర దాడులకు పాల్పడింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు వైమానిక దాడులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో డజన్ల కొద్దీ ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. డీర్ అల్-బాలా, ఖాన్ యూనిస్ నగర శివారుల్లో ఇజ్రాయెల్ దళాలు భీకర దాడులకు పాల్పడినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో 64 మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. 48 మృతదేహాలను ఇండోనేషియా ఆసుపత్రికి తరలించగా.. మరో 16 మృతదేహాలను నాజర్ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు వెల్లడించారు. ఇక ఈ దాడుల్లో వంద మందికిపైగా గాయపడినట్లు చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పశ్చిమాసియా పర్యటనలో ఉండగా.. ఐడీఎఫ్ దళాలు గాజాపై వరుస దాడులకు పాల్పడుతుండటం గమనార్హం. గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేయడం ఇది వరుసగా మూడోరోజు. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ నగరంపై బుధ-గురువారాల మధ్య రాత్రి ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో 54 మంది మరణించారు. మృతుల్లో ఓ పాత్రికేయుని కుటుంబ సభ్యుల్లో 11 మంది కూడా ఉన్నారు. అంతకు ముందు మంగళవారం రాత్రి బుధవారం తెల్లవారుజామున మధ్య జరిగిన దాడుల్లో 22 మంది చిన్నారులు సహా మొత్తం 70 మంది ప్రాణాలు కోల్పోయారు. ఫలితంగా గత మూడు రోజుల వ్యవధిలోనే ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో గాజాలో 180 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఇటీవలే మాట్లాడుతూ.. గాజాలో యుద్ధాని ఆపడానికి ఎలాంటి మార్గం లేదని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. హమాస్ ఉగ్రవాద సంస్థను అంతం చేసే వరకు గాజా స్ట్రిప్‌లో యుద్ధం కొనసాగుతుందన్నారు. దీంతో కాల్పుల విరమణపై అవకాశాలు సన్నగిల్లాయి.

## గగనతల రారాజు పాక్ ఎయిర్‌ఫోర్స్ అంట.. ఫేక్ వార్తను ప్రచారం చేస్తూ నవ్వులపాలైన పాక్ ఉప ప్రధాని




**కరాచీ-నవభూమి:** ఉగ్రవాదుల్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్‌తో భారత సైన్యం పాక్‌ను చావుదెబ్బ తీసింది. ఆ దేశంలోని ఉగ్ర స్థావరాలు, వైమానిక స్థావరాలను ధ్వంసం చేసింది. భారత్ దాడితో తోకముడిచిన దాయాది.. చివరికి కాళ్లబేరానికి వచ్చింది. అయితే, తమకు జరిగిన నష్టాన్ని కప్పిపుచ్చుకునేందుకు పాక్ నేతలు తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో పాక్ ఉప ప్రధాని, దేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఏకంగా పార్లమెంట్ సాక్షిగా నవ్వులపాలయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ ఎయిర్‌ఫోర్స్‌ను విదేశీ మీడియా గొప్పగా ప్రశంసించిందంటూ ప్రకటించుకున్నారు. పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను కీర్తిస్తూ అంతర్జాతీయ మీడియా సంస్థలు పలు కథనాల్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బ్రిటన్‌కు చెందిన 'డైలీ టెలిగ్రాఫ్' (%ఙప్త్వ ఋఅఞ్రీఎ ఎవ్రీవప్త్రీఖుజూప్త్ర%) అందుకు భిన్నంగా 'ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్ వ్యవహరించిన తీరును ప్రశంసిస్తూ ఓ కథనాన్ని ప్రచురించింది' అంటూ ఆ పత్రిక హెడ్‌లైన్‌ను సెనేట్‌లో చూపించి గొప్పలు చెప్పుకున్నారు ఇషాక్ దార్. మే 10వ తేదీన ఫ్రెంట్ పేజీలో 'ఆకాశంలో ఎదురులేని రారాజు.. పాకిస్థాన్ ఎయిర్‌ఫోర్స్' పేరుతో ఆ కథనం ఉంది. ఇది నిజమని నమ్మిన సభ్యులు చప్పట్లతో పాక్ సైన్యాన్ని మెచ్చుకున్నారు. దీనిపై స్పందించిన పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం అసలు నిజాన్ని బయటపెట్టింది. అది ఏఐ జనరేటెడ్ ఇమేజ్ అని తేల్చింది. మరోవైపు ఆ దేశ మీడియా 'డాన్' సైతం అది ఫేక్ అని తేల్చింది. ఆ పత్రిక ఎప్పుడూ అలాంటి కథనాల్ని ప్రచురించలేదని తేల్చింది. దీంతో ఫేక్ వార్తను నిజమని నమ్మించాలని చూసి తానే బొక్కబోర్లా పడ్డట్టైంది ఇషాక్ దార్ పరిస్థితి. ఇక ఫేక్ వార్తలను ప్రచారం చేస్తున్న పాక్ పాలకులపై సొంత దేశంలోనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## మిత్ర దేశాల్లో పాకిస్థాన్ బిచ్చగాళ్లు.. ఏకంగా 5033 మందిని వెళ్లగొట్టిన సౌదీ



**కరాచీ-నవభూమి:** తాము ఏ మిత్ర దేశానికి వెళ్లినా అడుక్కోవడానికే వచ్చామన్నట్లు చూస్తారని మూడేళ్ల క్రితం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఓ సమావేశంలో అన్నారు. ఆయన ఏ ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేశారో గానీ, మిత్ర దేశాలను మాత్రం పాకిస్థాన్ బిచ్చగాళ్లు హడలెత్తిస్తున్నారు. కొందరు పాకిస్థానీలు యాత్రికుల వీసాలను తీసుకుని వెళ్లి మరీ మిత్ర దేశాల్లో భిక్షాటన చేస్తున్నారు. ఫలితంగా యాచకులను ఎగుమతి చేసే దేశంగా పాకిస్థాన్ అపకీర్తిని మూటగట్టుకుంది. ఈ క్రమంలో సౌదీ అరేబియా తాజాగా తమ దేశంలో ఉన్న పాకిస్థానీ బిచ్చగాళ్లను స్వదేశానికి పంపుతోంది. ఇప్పటివరకు ఏకంగా 5033 మంది బిచ్చగాళ్లను బలవంతంగా పాకిస్థాన్‌కు వెళ్లగొట్టింది. పాకిస్థాన్ మిగతా మిత్రదేశాలు కూడా సౌదీ బాటనే అనుసరిస్తున్నారు. ఆయా దేశాలు కూడా 369 మంది పాకిస్థానీ బిచ్చగాళ్లను స్వదేశానికి పంపించాయి. ఈ విషయాన్ని పాకిస్థాన్ ఇంటీరియర్ మంత్రి మొహసిన్ నక్వీ ఇటీవల ఆ దేశపు నేషనల్ అసెంబ్లీలో వెల్లడించారని డాన్ పత్రిక తన కథనంలో పేర్కొంది. అంటే 2024 జనవరి నుంచి మిత్ర దేశాలు తరిమేసిన పాకిస్థాన్ బిచ్చగాళ్ల సంఖ్య 5,402. బిచ్చగాళ్లను వెళ్లగొట్టిన పాకిస్థాన్ మిత్రదేశాల్లో సౌదీతోపాటు.. ఇరాక్, మలేసియా, ఒమన్, ఖతార్, యూఏఈ ఉన్నాయి. తిరిగొచ్చిన పాకిస్థాన్ బిచ్చగాళ్లలో సింధి ప్రావిన్స్‌కు చెందినవాళ్లు 2,795 మంది, పంజాబ్ ప్రావిన్స్ నుంచి 1,437 మంది, ఖైబర్ ఫక్తుంక్వా నుంచి 1,002 మంది, బలోచిస్థాన్ నుంచి 125 మంది, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ నుంచి 33 మంది, ఇస్లామాబాద్ నుంచి 10 మంది ఉన్నారు.

## కార్గో షిప్‌లో పాక్ జాతీయుడు.. భారత్‌లోకి ప్రవేశం నిరాకరణ



**బెంగళూరు-నవభూమి:** భారత పోర్ట్‌కు చేరుకున్న విదేశీ కార్గో షిప్‌లో పాకిస్థాన్ జాతీయుడు ఉన్నాడు. దీంతో పోర్టు అధికారులు అప్రమత్తమయ్యారు. భారత్‌లోకి అతడి ప్రవేశాన్ని నిరాకరాంచారు. పోర్టులోకి అడుగుపెట్టకుండా నిరోధించారు. మే 12న ఇరాక్‌కు చెందిన ఎంటీఆర్ ఓషన్ అనే కార్గో షిప్ బిటుమెన్ లోడ్‌తో కర్ణాటకలోని కార్వార్ పోర్టుకు చేరుకున్నది. అందులో షిప్ కెప్టెన్‌తో సహా 14 మంది భారతీయులు, ఇద్దరు సిరియన్లు, ఒక పాకిస్థాన్ జాతీయ సిబ్బంది ఉన్నారు. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ జాతీయులకు భారత్‌లోకి ప్రవేశాన్ని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. వారి వీసాలను కూడా రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ఇరాక్ కార్గో నౌకలో పాకిస్థాన్ జాతీయుడు ఉన్నట్లు తెలుసుకుని కార్వార్ పోర్టు పోలీసులు, అధికారులు అలెర్ట్ అయ్యారు. ఆ కార్గో షిప్‌లోకి వారు వెళ్లారు. మరోవైపు పాకిస్థాన్, సిరియా జాతీయులను ఓడ నుంచి కిందకు దిగవద్దని పోలీస్ ఇన్‌స్పెక్టర్ నిశ్చల్ కుమార్ ఆదేశించారు. అలాగే పోలీస్ అధికారి సూచన మేరకు వారి మొబైల్ ఫోన్లను షిప్ కెప్టెన్ స్వాధీనం చేసుకున్నారు. పోర్టులో బిటుమెన్‌ను అన్‌లోడ్ చేసిన తర్వాత ఆ కార్గో షిప్ తిరిగి ఇరాక్‌కు బయలుదేరిందని కార్వార్ పోర్టు అధికారులు వెల్లడించారు.

నవచిత్ర



## శోభన్‌బాబు,వాణిశ్రీల 50 ఏళ్ళ జీవనజ్యోతి



నటరత్న యన్టీఆర్ తో ఆరంభమైన డి. వి. యస్. ప్రొడక్షన్స్ సంస్థ ఆయనతో వరుసగా "మంగమ్మ శపథం పిడుగు రాముడు తిక్కశంకరయ్య గండికోట రహస్యం చిన్ననాటి స్నేహితులు ధనమా దైవమా వంటి జనరంజక చిత్రాలను నిర్మించింది. ఈ సంస్థ అధినేత డి.వి.యస్. రాజు ముందుగా కె. విశ్వనాథ్ దర్శకత్వంలో 'చిన్ననాటి స్నేహితులు'నిర్మించారు. ఆ తరువాత శోభన్ బాబు వాణిశ్రీ జంటగా విశ్వనాథ్ దర్శకత్వంలో నిర్మించిన చిత్రమే 'జీవనజ్యోతి' ఈ చిత్రానికి కె. రామలక్ష్మి మూలకథను అందించగా, దానికి కె. విశ్వనాథ్ స్క్రీన్ ప్లే సమకూర్చారు... 1975 మే 16న విడుదలైన 'జీవనజ్యోతి' అనూహ్య విజయం సాధించింది... శోభన్ బాబు కెరీర్ లోనే బిగ్ హిట్ గా నిలచింది 'జీవనజ్యోతి'... 1975 బ్లాక్ బస్టర్ గానూ 'జీవనజ్యోతి' వెలిగింది. 'మదర్ సెంటిమెంట్'తో రూపొందిన చిత్రం 'జీవనజ్యోతి'... తన తోడికోడలు కొడుకును సొంతకొడుకులా లాలిస్తూ సాగిన హీరోయిన్ ఆ బాబు మరణంతో పిచ్చిదవుతుంది... తరువాత ఆమె కన్నకూతురు కొడుకు కూడా అచ్చు ఆ బాబులాగే ఉండడంతో ఆ పిల్లాడిని చూసి మామూలు మనిషి అవుతుంది. తల్లి కోసం కూతురు చేసిన త్యాగంతో 'జీవనజ్యోతి' ముగుస్తుంది. వాణిశ్రీ ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రంలో అల్లు రామలింగయ్య, రాజబాబు, సత్యనారాయణ, శుభ, నిర్మలమ్మ తదితరులు నటించారు..

# సమంతతో సహజీవనం?




స్టార్ హీరోయిన్ సమంత రుత్ ప్రభు, ఫ్యామిలీ మ్యాన్ డైరెక్టర్ రాజ్ నిడిమోరు డేటింగ్ వ్యవహారంపై మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. సోషల్ మీడియాలో సమంత షేర్ చేసిన ఫోటోలు ఈ రూమర్లకు మరింత బలాన్ని చేకూర్చాయి. దాంతో వారి మధ్య ఉన్న బంధం పెళ్లికి దారి తీస్తున్నదనే విషయంపై ఓ వర్గం ఓ నిర్ణయానికి వచ్చారు. ఇలా రెండో పెళ్లి గురించి వస్తున్న వార్తలపై సమంత మేనేజర్ క్లారిటీ ఇచ్చారు. దాంతో గత కొద్ది రోజులుగా సాగుతున్న ఊహాగానాలకు తెర దించే ప్రయత్నం జరిగింది. సమంత మేనేజర్ చెప్పిన వివరాల్లోకి వెళితే.. సమంత రుత్ ప్రభు నిర్మాతగా మారి రూపొందించిన శుభం సినిమా భారీ సక్సెస్ అందుకొన్నది. నిర్మాతగా తన విజయాన్ని ఆస్వాదిస్తున్నారు. ఈ సినిమాకు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన రాజ్ నిడిమోరుతో కలిసి ఓ సెల్ఫీ ఫోటోను షేర్ చేసింది. ఆ ఫోటోలో రాజ్ నిడిమోరు భుజంపై వాలిపోయి ఆనందంగా కనిపించడం అందరిలో కొన్ని అనుమానాలు వచ్చేలా చేశాయి. సమంతతో రెండో పెళ్లి రూమర్లు.. రాజ్ నిడిమోరు మాజీ భార్య ఇన్స్‌టాగ్రామ్‌లో షాకింగ్ పోస్ట్ రాజ్ నిడిమోరుతో సమంత సెల్ఫీ ఫోటో ఓ వైపు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తుంటే.. సడెన్‌గా మరో విషయం మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. రాజ్ నిడిమోరు మాజీ భార్య శ్యామిలీ దే నర్మగర్భంగా ఓ పోస్టు పెట్టి.. తనలోని భావోద్వేగాన్ని వెల్లడించడం సమంత డేటింగ్ రూమర్లకు లింక్ అయ్యేలా చేసింది. దాంతో వారి వ్యవహారం మరింత గందరగోళంగా మారింది. అయితే సమంత, రాజ్ నిడిమోరు కలిసి జీవించడానికి ఏర్పాట్లు చేసుకొన్నారు. వారిద్దరు సహజీవనం చేయడానికి నిర్ణయం తీసుకొన్నారు. అందుకోసం ఇంటిని కొనుగోలు చేయడానికి, ఇంటికి సంబంధించిన వస్తువులను సమకూర్చుకోవడానికి ఏర్పాట్లు చేసుకొంటున్నారు అనే వార్త జాతీయ మీడియాలో ప్రచురించారు. అయితే ఇలాంటి రూమర్లు హద్దు దాటి పోతుంటే..సమంత మేనేజర్ మహేంద్ర రంగంలోకి దిగి ఈ విషయంపై పూర్తి క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు.

## అబ్బో... నిహారిక ప్లాన్లు మామూలుగా లేవుగా!



హోస్ట్‌గా, నటిగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలైన మెగా డాటర్ నిహారిక కొణిదెల, ఇప్పుడు నిర్మాతగానూ తనదైన ముద్ర వేస్తున్నారు. ఇటీవల జరిగిన ఓ అవార్డుల కార్యక్రమంలో, టాలీవుడ్ అగ్ర హీరోలతో ఎలాంటి సినిమాలు నిర్మించాలనుకుంటున్నారో ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

ఒకవేళ ప్రముఖ హీరోలతో సినిమాలు నిర్మించే అవకాశం వస్తే, ఎవరితో ఎలాంటి జానర్‌లో సినిమా చేస్తారని యాంకర్ అడిగిన ప్రశ్నకు నిహారిక బదులిచ్చారు. స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్‌తో ఓ అందమైన ప్రేమకథా చిత్రాన్ని నిర్మించాలని ఉందని తెలిపారు. సూపర్ స్టార్ మహేశ్‌బాబుతో అయితే ఒక భారీ పౌరాణిక చిత్రాన్ని తెరకెక్కించాలన్నది తన కోరిక అని చెప్పారు. ఇక పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో ఒక వినోదాత్మక కామెడీ సినిమా చేయాలని ఉందని నిహారిక తన మనసులోని మాటను బయటపెట్టారు. అంతేకాకుండా, తాను దర్శకత్వం వహించే అవకాశం వస్తే, తన తొలి సినిమా మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్‌తోనే ఉంటుందని స్పష్టం చేశారు.'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో నిర్మాతగా మారిన నిహారిక, ఆ సినిమాకు గాను 'వర్సటైల్ ప్రొడ్యూసర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును కూడా అందుకున్నారు. ఈ అవార్డుల కార్యక్రమానికి సంబంధించిన వీడియో తాజాగా విడుదలైంది. ప్రస్తుతం ఈమె 'మ్యాడ్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న సంగీత్ శోభన్ హీరోగా, మానస శర్మ దర్శకత్వంలో మరో చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## అఖండ-2 హిట్ కోసం ప్రగ్యా ఎదురుచూపులు

బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో కంచె బ్యూటీ ప్రగ్యాజైస్వాల్ నటించిన అఖండ 2 కోసం అభిమానులను ఎదురు చూస్తున్నాయి. మునుపటి తదుపరి ,మునుపటి తదుపరి నటి ప్రగ్య జైస్వాల్ ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన కొత్త చిత్రాలను పంచుకున్నారు. ప్రగ్య అందమైన నారింజ రంగు దుస్తులలో, అద్దం ముందు కూర్చుని తన జుట్టును స్టైల్ చేసుకుంటూ కనిపిస్తుంది. ఈ పోస్ట్‌లో అభిమానులకు ఆమె గ్లామరస్ లుక్ ఆమె అందమైన రోజులను చూపించే అనేక చిత్రాలు ఉన్నాయి. ప్రగ్య తన మొదటి చిత్రం కంచె నుండే ప్రజాదరణ పొందింది. అప్పటి నుండి ఆమె నటిగా ఎదుగుతూనే ఉంది. ఆమె రాబోయే సినిమా ప్రయాణం మరింత ఉత్తేజకరమైనది. బాలకృష్ణతో కలిసి హ్యాట్రిక్ సాధించడానికి ప్రగ్య సిద్ధంగా ఉంది. అఖండ మరియు డాకు మహారాజ్ చిత్రాలలో అతనితో కలిసి పనిచేసిన తర్వాత, ఆమె ఇప్పుడు అఖండ 2లో భాగం. అంటే ఒకే స్టార్‌తో వరుసగా మూడు సినిమాలు చేయడం. అంతే కాదు, ఈసారి దర్శకుడు బోయపాటి శ్రీనుతో ఆమె మరో హ్యాట్రిక్ సాధించబోతోంది. జయ జానకి నాయక మరియు అఖండ తర్వాత, అఖండ 2" వారి మూడవ కలయికను కూడా సూచిస్తుంది. బాలకృష్ణ బోయపాటి శ్రీనుతో ఈ రెండు హ్యాట్రిక్ కాంబినేషన్‌లు ఆమె అఖండ 2 కోసం అభిమానులను వేచి చూస్తున్నాయి. వరుసగా బాలయ్య సినిమాలే చేస్తుండటంతో బాలయ్య హీరోయిన్‌గా మారిపోతుందేమోనని అభిమానుల కామెంట్లు. బాలయ్య బాబుకు సెంటిమెంట్ ఎక్కువ. ఏ హీరోయిన్‌తో నైనా హిట్లు కొడితే మళ్లీ అదే హీరోయిన్‌కు ఛాన్స్ ఇస్తారు. గతంలో సిమ్రాన్‌కూ అలాగే నాలుగైదు సినిమాల్లో ఛాన్స్ ఇచ్చారు. ఇప్పుడు ప్రగ్యాకు అలాంటి అవకాశమే లభించింది. ఎలాగైతేనే ఈ అందాల భరిణకు సినిమా ఛాన్సులు దక్కుతున్నాయి.

# బాలీవుడ్ వైపు ఎన్టీఆర్ బలమైన అడుగులు!



యంగ్ టైగర్ ఎన్టీఆర్ బాలీవుడ్ వైపు వడి వడిగా బలమైన అడుగులు వేస్తున్నాడా? అంటే జరుగుతున్న పరిణామాలు, తను అంగీకరించిన ప్రాజెక్ట్‌లు ఇది నిజమేనని తేల్చి చెప్పేస్తున్నాయి. %దీఎ: ౦బజ్ఞూుఎఱ ణవం౦ ఎ 17 మీఖఎ 2025 2:00౼ావీ ాష్ట్రుతీవ%: యంగ్ టైగర్ ఎన్టీఆర్ బాలీవుడ్ వైపు వడి వడిగా బలమైన అడుగులు వేస్తున్నాడా? అంటే జరుగుతున్న పరిణామాలు, తను అంగీకరించిన ప్రాజెక్ట్‌లు ఇది నిజమేనని తేల్చి చెప్పేస్తున్నాయి. జక్కన్న తెరకెక్కించిన ఆర్ ఆర్ ఆర్‌తో యంగ్ టైగర్ ఎన్టీఆర్ వరల్డ్ వైడ్‌గా క్రేజ్‌ని దక్కించుకోవడం తెలిసిందే. ఈ మూవీతో హాలీవుడ్‌లోనూ హాట్ టాపిక్‌గా మారిన ఎన్టీఆర్ ఇప్పుడు బాలీవుడ్‌పై కన్నేసినట్టుగా తెలుస్తోంది. తెలుగులో పాన్ ఇండియా సినిమాలు చేస్తూనే బాలీవుడ్‌పై దృష్టిపెట్టినట్టుగా తెలుస్తోంది.బాలీవుడ్‌లో అతిపెద్ద ఫ్రాంచైజీ అయినా యష్ రాజ్ ఫిలింస్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న ఈ మూవీని ఆగస్టు 14న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ చేయబోతున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యస్ రాజ్ ఫిలింస్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్ని ఈ మూవీ బిజినెస్ పరంగానూ వార్తల్లో నిలుస్తోంది. ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా కనిపించనున్న ఈ మూవీ తరువాత ఎన్టీఆర్ తాజాగా మరో బాలీవుడ్ క్రేజీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా యష్ రాజ్ ఫిలింస్‌లోవార్ 2%-%ని అంగీకరించే సమయంలోనే భారీ ఒప్పందంపై ఎన్టీఆర్ సంతకం చేసినట్టుగా తెలుస్తోంది. అంటే ఈ స్పై యూనివర్స్‌లో ఎన్టీఆర్ మరో సినిమా కూడా చేయడం ఖాయమన్నమాట.వార్ 2 తరువాత ఎన్టీఆర్ దాదాసాహెబ్ ఫాల్కే జీవిత కథ ఆధారంగా తెరపైకి రానున్న సినిమాకు ఎన్టీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడని, మేడ్ ఇన్ ఇండియా%-% పేరుతో తెరపైకి రానున్న ఈ ప్రాజెక్ట్‌ని రాజమౌళి తనయుడు కార్తికేయ, వరుణ్ గుప్తా సంయుక్తంగా నిర్మిస్తారని, దీనికి బాలీవుడ్ డైరెక్టర్ నితిన్ కక్కర్ దర్శకత్వం వహిస్తారని ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే ఇదే కథతో అమీర్‌ఖాన్ హీరోగా రాజ్ కుమార్ హిరాణీ కాంబినేషన్‌లో ఓ సినిమాకు రూపకల్పణ జరుగుతోందని, సితారే జమీన్ పర్ రలీజ్ తరువాత ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుందని ఇన్ సైడ్ టాక్.

## 28 కోట్లు పెడితే 200 కోట్లకి పైగా తెచ్చిందే!

మలయాళ క్రైమ్ థ్రిల్లర్ సినిమాలను ఇష్టపడేవారి సంఖ్య చాలా ఎక్కువ. సహజత్వానికి దగ్గరగా ఉండే ఈ క్రైమ్ థ్రిల్లర్ సినిమాలను చూడటానికి అంతా ఎంతో ఆసక్తిని కనబరుస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలోనే మోహన్ లాల్ నుంచి ఒక క్రైమ్ థ్రిల్లర్ థియేటర్లకు వచ్చింది .. ఆ సినిమా పేరే 'తుడరుమ్'. రెంజిత్ నిర్మించిన ఈ సినిమాకి, తరుణ్ మూర్తి దర్శకత్వం వహించాడు. ఏప్రిల్ 24వ తేదీన ఈ సినిమాను భారీస్థాయిలో విడుదల చేశారు. మోహన్ లాల్ సరసన 'శోభన' నటించిన ఈ సినిమాకి, మిక్కీ జె మేయర్ సంగీతాన్ని సమకూర్చాడు. మోహన్ లాల్ కి గల క్రేజ్ గురించి .. మార్కెట్ గురించి తెలియంది కాదు. అయినా కథకు తగినట్టుగా ఖర్చు చేస్తూ, కేవలం 28 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మించారు. అలాంటి ఈ సినిమా కేరళలోనే 100 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా 200 కోట్లకి పైగా వసూళ్లను సాధించింది. మలయాళ ఇండస్ట్రీలో తక్కువ సమయంలో ఈ స్థాయి వసూళ్లను రాబట్టిన మూడో సినిమాగా ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించింది. అలాంటి ఈ సినిమా, జూన్ లో 'హాట్ స్టార్' ద్వారా స్ట్రీమింగ్ కానున్నట్టు తెలుస్తోంది. కథ విషయానికి వస్తే .. హీరో ఒక ట్యాక్సీ డ్రైవర్. నీతి – నిజాయితీతో కూడిన సింపుల్ లైఫ్ అతనిది. ఆయనకు ఇద్దరు పిల్లలు. హీరో కొడుకు తన తండ్రి కారులో స్నేహితులతో కలిసి సరదాగా 'చెన్నై' కి వెళతాడు. ఆ కారులో గంజాయిని స్మగ్లింగ్ చేస్తున్నారని పోలీసులు కారు సీజ్ చేస్తారు. ఆ సంఘటనతో హీరో లైఫ్ ఎలాంటి ప్రాబ్లమ్స్ లో పడుతుందనేది కథ.



## ఈశ్వరన్ సారథ్యంలో.. ఇంగ్లండ్ పర్యటనకు ఇండియా 'ఏ' జట్టు ప్రకటన




**న్యూఢిల్లీ–నవభూమి:** త్వరలో ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న భారత 'ఏ' జట్టును బీసీసీఐ ప్రకటించింది. దేశవాళీలో నిలకడగా రాణిస్తున్న అభిమన్యు ఈశ్వరన్ సారథ్యంలో 18 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేసింది. వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ అతడికి డిప్యూటీగా వ్యవహరించనున్నాడు. గతేడాది బీసీసీఐ క్రమశిక్షణ చర్యలతో సెంట్రల్ కాంట్రాక్టుతో పాటు జట్టులో చోటు కోల్పోయిన ఇషాన్ కిషన్.. ఆశ్చర్యకరంగా 'ఏ' జట్టుకు ఎంపికయ్యాడు. దేశవాళీలో సంచలన ప్రదర్శనలు చేసిన కరుణ్ నాయర్ సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి వచ్చాడు. 33 ఏండ్ల నాయర్.. 'ఏ' జట్టులో రాణిస్తే ప్రధాన జట్టులోనూ ఆడే అవకాశాలు మెరుగవుతాయి.

ఇక టీమ్‌ఇండియా రెగ్యులర్ ఓపెనర్ యశస్వి జైస్వాల్, రుతురాజ్, నితీశ్ కుమార్ రెడ్డి వంటి స్టార్ క్రికెటర్లు జట్టులో ఉన్నారు. కాగా ఇటీవల కాలంలో వన్డేలు, టీ20లలో నిలకడగా రాణిస్తున్న శ్రేయాస్ అయ్యర్ సైతం 'ఏ' జట్టులో ఉంటాడని ఆశించినా అతడికి నిరాశే ఎదురైంది. ఈశ్వరన్ సారథ్యంలోని భారత జట్టు.. ఇంగ్లండ్ లయన్స్‌తో మే 30న తొలి టెస్టు, జూన్ 6న రెండో టెస్టు ఆడనుంది. రోహిత్ శర్మ రిటైర్మెంట్ తర్వాత భారత టెస్టు జట్టు పగ్గాలు అందుకుంటాడని భావిస్తున్న శుభ్‌మన్ గిల్‌తో పాటు యువ బ్యాటర్ సాయి సుదర్శన్ రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉండనున్నారు.

## చెస్ ప్రపంచకప్‌లో రిత్విక్



**యూఏఈ–నవభూమి:** ప్రతిష్టాత్మక చెస్ ప్రపంచకప్ టోర్నీకి భారత యువ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఆఖర్లో జరుగనున్న ఈ మెగాటోర్నీలో భారత్ తరఫున రిత్విక్ ప్రాతినిధ్యం వహించనున్నాడు. అల్ ఐన్(యూఏఈ) వేదికగా ముగిసిన ఏషియన్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఆరో స్థానంలో నిలువడం ద్వారా రిత్విక్..చెస్ ప్రపంచకప్ బెర్తు దక్కించుకున్నాడు. శుక్రవారంతో ముగిసిన టోర్నీలో టాప్–10లో నిలిచిన ప్లేయర్లు నేరుగా ఈ మెగాటోర్నీకి అర్హత సాధిస్తారు. 33వ సీడ్‌గా బరిలోకి దిగిన రిత్విక్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. మొత్తం తొమ్మిది రౌండ్ల పాటు జరిగిన టోర్నీలో ఈ యువ జీఎం 6.5 పాయింట్లు దక్కించుకున్నాడు. 33 దేశాలకు చెందిన 154 మంది టాప్ ప్లేయర్లు ఈ టోర్నీలో పోటీపడ్డారు. భారత్, జపాన్, చైనా, మలేషియా, ఖతార్, సింగపూర్ లాంటి దేశాల ప్లేయర్లు గట్టిపోటీనిచ్చారు. చెస్ ప్రపంచకప్‌లో భారత్ నుంచి రిత్విక్‌తో పాటు నిహాల్ సరీన్, ఇనియాన్, నారాయణన్, ప్రణేశ్, హర్షవర్ధన్, కార్తికేయన్ మురళీ ఉన్నారు.

భారత్ నుంచి ఏడుగురు ఎంపిక:యూఏఈ: ప్రతిష్టాత్మక చెస్ ప్రపంచకప్ టోర్నీకి భారత యువ గ్రాండ్‌మాస్టర్ రాజా రిత్విక్ ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఆఖర్లో జరుగనున్న ఈ మెగాటోర్నీలో భారత్ తరఫున రిత్విక్ ప్రాతినిధ్యం వహించనున్నాడు.

నవక్రీడ

## నీరజ్ నయా చరిత్ర

**దోహా–నవభూమి:** భారత గోల్డెన్ బాయ్ నీరజ్ చోప్రా కొత్త చరిత్ర లిఖించాడు. జావెలిన్‌త్రోలో తనకంటూ ప్రత్యేకతను నిలుపుకుంటూ సరికొత్త రికార్డుతో నీరజ్ కదంతొక్కాడు. శుక్రవారం దోహా వేదికగా మొదలైన ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్‌లో నీరజ్ తొలిసారి 90.23 మీటర్ల మార్క్ అందుకుని ఔరా అనిపించాడు. గత కొన్నేండ్లుగా ఊరిస్తూ వస్తున్న 90 మీటర్ల దూరాన్ని తన మూడో ప్రయత్నంలో సాధించాడు. ఈ క్రమంలో గతంలో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డు(89.94మీ)ను చోప్రా బద్దలు కొట్టాడు. పోటీలో తన మొదటి ప్రయత్నంలోనే 88.44మీటర్ల మార్క్ అందుకున్న ఈ స్టార్ అథ్లెట్..రెండో ప్రయత్నంలో ఫౌల్ అయ్యాడు. అయితే మూడో ప్రయత్నంలో తన బలాన్నంతటినీ కూడదీసుకుంటూ ఇన్నాళ్లుగా అందినట్లే అంది దూరమవుతున్న 90మీటర్ల దూరాన్ని ఒడిసిపట్టుకున్నాడు.

అదే జోరును కొనసాగించడంలో చోప్రా ఒకింత విఫలమయ్యాడు. నాలుగో ప్రయత్నంలో 80.56మీటర్లు విసిరిన నీరజ్ ఐదోసారి ఫౌల్ అయ్యాడు. ఆఖరిదైన ఆరో త్రోలో నీరజ్ 88.20మీటర్లకు పరిమితమయ్యాడు. ఇదే అదనుగా అప్పటి వరకు చోప్రా దరిదాపుల్లో ఉన్న జులియన్ వెబర్ ఆరో ప్రయత్నంలో ఏకంగా 91.06మీటర్లు విసిరి అగ్రస్థానంలోకి దూసుకొచ్చాడు. కెరీర్‌లో తొలిసారి అత్యుత్తమ మార్క్ అందుకున్న వెబర్..నీరజ్‌ను రెండో స్థానానికి పరిమితం చేయగా, అండర్సన్ పీటర్స్(85.64మీ)మూడో స్థానంలో నిలిచాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**